@vaartanews @mvnewstv

www.mivaartanews.com

TGBIL/25/A0512

మన మీ.. వార్త

ప్రతి అక్షరం... ప్రజల కోసం

తెలుగు దిన పత్రిక

MANA MI VARTA NEWS

గురువారం
12 నవంబర్ 2026

సూర్యపేట, హైదరాబాద్

సంపుటి : 02
సంచిక : 129
పేజీలు : 12 వెల : 5/-

PUBLISHED AT SURYAPETA | HYDERABAD | KHAMMAM | KARIMNAGAR | MAHABOOBNAGAR | NALGONDA | NIZAMABAD | WARANGAL | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KURNOOL | MANGALAGIRI | NELLORE







మేధో సంపత్తి వివాదాలకు ఆ హైకోర్టే శరణ్యం అనుకోవడం భ్రమ

- 'ఫోరమ్ షాపింగ్'పై సుప్రీంకోర్టు ఆగ్రహం
- ఫోరమ్ షాపింగ్ లేదా లిటిగేషన్ టూరిజం పోకడలపై సుప్రీంకోర్టు తీవ్ర అసహనం
- కర్ణాటక, తమిళనాడుకు చెందిన సంస్థల వివాదాన్ని ఢిల్లీ హైకోర్టులో దాఖలు చేయడంపై ఆక్షేపణ
- సంబంధిత ఐపీ దావాను ఢిల్లీ నుంచి మద్రాస్ హైకోర్టుకు బదిలీ చేసిన సుప్రీం ధర్మాసనం
- హైకోర్టుల మధ్య ఎలాంటి అంతరాలు, క్రమానుగత వ్యత్యాసాలు ఉండవని స్పష్టీకరణ



కుల్గామ్‌లో సీఆర్‌పీఎఫ్ శిబిరంపై ఉగ్రదాడి

- ముగ్గురు జవాన్లకు గాయాలు!
- చెక్‌పోస్టు వద్ద మోటార్‌సైకిల్‌పై వచ్చి కాల్పులు.. ఇద్దరి పరిస్థితి విషమం!

తమ్మిడికుంటకు పునర్జీవం!

- 14 ఎకరాల నుంచి తిరిగి 30 ఎకరాలకు విస్తరణ.. రూ.20 కోట్లతో అభివృద్ధి
- చెరువుల పరిరక్షణకు రాజకీయాలకతీతంగా సహకరించాలి: సీఎం రేవంత్‌రెడ్డి
- నాగార్జున ఉదారత అభినందనీయం.. నిజ జీవితంలోనూ హీరోనేనని ప్రశంస
- త్వరలో తమ్మిడికుంట వద్దే సినిమా షూటింగ్: అక్కినేని నాగార్జున
- ఎఫ్‌టీఎల్ పరిధిలో ఇళ్లు కోల్పోయిన 34 మందికి ఇందిరమ్మ ఇళ్ల పత్రాలు



హైదరాబాద్:

హైదరాబాద్‌లో చెరువుల పునరుద్ధరణకు ప్రభుత్వం చేపట్టిన చర్యల్లో మరో కీలక ముందడుగు పడింది. ఆక్రమణలతో కుంచించుకు పోయిన మాదాపూర్‌లోని తమ్మిడికుంట చెరువుకు తిరిగి పూర్వ వైభవం తీసుకొచ్చేలా హైడ్రా చేపట్టిన అభివృద్ధి పనులు పూర్తయ్యాయి. సుమారు రూ.20 కోట్ల వ్యయంతో 14 ఎకరాల నుంచి తిరిగి 30 ఎకరాల విస్తీర్ణానికి పునరుద్ధరించిన చెరువును ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి - మిగతా9లో



తెలంగాణ విద్యారంగంలో కీలక మార్పులు

- వచ్చే ఏడాది నుంచే 10+2 విధానం!
- వచ్చే విద్యా సంవత్సరం నుంచి కొత్త విద్యా విధానం అమలు చేయాలని సీఎం ఆదేశాలు
- 9 నుంచి 12వ తరగతి వరకు ప్రత్యేక విద్యా ప్రణాళిక
- 12వ తరగతి నుంచే నైపుణ్యాభివృద్ధికి ప్రాధాన్యం
- విద్యార్థులకు నష్టం కలగకుండా సంస్కరణలు చేపట్టాలి: రేవంత్‌రెడ్డి

హైదరాబాద్

తెలంగాణ విద్యారంగంలో కీలక సంస్కరణలకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమవుతోంది. వచ్చే విద్యా సంవత్సరం నుంచే రాష్ట్రంలో 10ం2 విద్యా విధానాన్ని అమలు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఆధునిక అవసరాలు, మారుతున్న విద్యా ప్రమాణాలకు అనుగుణంగా రాష్ట్ర విద్యా వ్యవస్థలో మార్పులు తీసుకురావాలని సూచించారు. బోధి పెవిలియన్‌లో విద్యాశాఖ ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో సీఎం ఈ మేరకు దిశానిర్దేశం చేశారు. తొమ్మిదో తరగతి నుంచి - మిగతా9లో



రైతులకు కేంద్రం భారీ ఊరట..

- రూ.62,370 కోట్ల ఎరువుల సబ్సిడీకి ఆమోదం!
- రబీ 2026-27 సీజన్‌కు భారీగా నిధుల కేటాయింపు..
- డీఏపీ బస్తా ధర రూ.1,350గానే కొనసాగింపు!
- ముద్రా రుణాలకు మరో ఐదేళ్ల పొడిగింపు..
- స్టాండప్ ఇండియా పథకానికీ గ్రీన్ సిగ్నల్!
- యుగే యుగీన్ మ్యూజియానికి రూ.3,230 కోట్లు..
- నోయిడా మెట్రో విస్తరణకు రూ.2,390 కోట్లు!

రామమందిర విరాళాల లెక్కలు బయటపెట్టాలి

- విరాళాల సేకరణ నుంచి లెక్కింపు వరకు అవకతవకల ఆరోపణలు..
- సమగ్ర దర్యాప్తునకు జైరాం రమేశ్ డిమాండ్!
- 2021లోనే అక్రమాలపై ఫిర్యాదు చేశారంటూ ప్రస్తావన..
- ఫిర్యాదు చేసిన అధికారినే తొలగించారని ఆరోపణ!
- ఎస్ఐటీ నివేదికను ఎందుకు బహిర్గతం చేయడం లేదు?
- మోదీ, యోగి ప్రభుత్వాలపై కాంగ్రెస్ నేత ప్రశ్నలు!





విదేశీయులకు వీసా విధానంలో భారీ మార్పులు

- 13 కేటగిరీలు 9కి కుదింపు!
- ఉప విభాగాలు 49 నుంచి 23కి తగ్గింపు..
- దరఖాస్తు ఫారాల్లో 70 శాతం వరకు ఫీల్డ్స్ తొలగింపు!
- వీసా ప్రక్రియను సరళతరం చేసిన కేంద్ర హోం శాఖ..
- విదేశీ సందర్శకులకు మరింత సులభంగా అనుమతులు!

ఆంధ్రాకు నీళ్లు.. తెలంగాణకు ఎక్కిళ్లా?

- నిర్మల్ రైతు గర్జన సభలో కేటీఆర్ ఆగ్రహం
- కాంగ్రెస్ పాలనలో రైతులకు కష్టాలు..
- ఇది ప్రకృతి కరువు కాదు, పాలకులు తెచ్చిన కరువు
- కన్నెపల్లి పంపులు ఎందుకు ప్రారంభించడం లేదు?
- రైతుల కన్నీళ్ల కంటే నా గడ్డంపైనే సీఎం దృష్టి: కేటీఆర్
- పెండింగ్ రుణమాఫీ పూర్తి చేయాలి.. వ్యవసాయ రుణాలు రీషెడ్యూల్ చేయాలి



నిర్మల్

రైతుల సంక్షేమం కంటే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి రాజకీయాలే ముఖ్యమయ్యాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. రాష్ట్రంలో నెలకొన్న కరవు పరిస్థితులకు ప్రకృతి ఒక్కటే కారణం కాదని, ప్రభుత్వ నిర్లక్ష్యం కూడా కారణమని ఆరోపించారు. పక్క రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ నీటిని ప్రాజెక్టుల ద్వారా ఎత్తిపోస్తుంటే.. తెలంగాణలో మాత్రం అందుబాటులో ఉన్న నీటిని వినియోగించుకోవడం లేదని మండిపడ్డారు. బుధవారం నిర్మల్‌లో బీఆర్ఎస్ నిర్వహించిన రైతు గర్జన మహాసభలో ఆయన మాట్లాడారు. పట్టిసీమ వద్ద ఏపీ నీటిని ఎత్తిపోస్తుంటే, కన్నెపల్లి వద్ద తెలంగాణ ప్రభుత్వం పంపులు ఎందుకు ప్రారంభించడం లేదని ప్రశ్నించారు. ఆంధ్రాకు నీళ్లు.. తెలంగాణకు ఎక్కిళ్లు ఎందుకని నిలదీశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రైతుల సమస్యలను పట్టించుకోవడం లేదని కేటీఆర్ ఆరోపించారు. రైతుల కన్నీళ్లు తుడవాల్సిన సీఎం.. తన గడ్డం - మిగతా9లో

ఎల్‌నినో దెబ్బకు యాసంగి సాగుకు బ్రేక్!

నీటి కొరత భయంతో ఆరుతడి పంటల వైపు రైతుల చూపు

వరి సాగుకు వెనుకంజ.. నూనెగింజలు, పప్పుధాన్యాలకే ప్రాధాన్యం

గతేడాదితో పోలిస్తే సాగు విస్తీర్ణంలో భారీ తగ్గుదల

జలాశయాల్లో తగ్గిన నీటి నిల్వలు.. భూగర్భ జలాలపైనా ప్రభావం



హైదరాబాద్:

ఎల్‌నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితులు తెలంగాణలో యాసంగి సాగుపై ప్రభావం చూపుతున్నాయి. జలాశయాల్లో నీటి నిల్వలు తగ్గిపోవడం, భూగర్భ జలమట్టాలు పడిపోవడం, విద్యుత్తు సరఫరాపై ఆందోళనలు రైతులను వరి సాగుకు దూరం చేస్తున్నాయి. ఆయకట్టు ప్రాంతాల్లోనూ సాగునీటి సరఫరాపై స్పష్టత లేకపోవడంతో రైతులు ప్రత్యామ్నాయ పంటల వైపు మొగ్గు చూపుతున్నారు. యాసంగి సీజన్ ప్రారంభమై పది రోజులు గడుస్తున్నా వరి నాట్లు ఆశించిన స్థాయిలో మొదలుకాలేదు. బోరుబావుల్లో నీటి సౌకర్యం ఉన్న ప్రాంతాల్లో మాత్రమే పరిమితంగా వరి సాగు చేపడుతున్నారు. వ్యవసాయ శాఖ గణాంకాల - మిగతా9లో



అయోధ్యలో అద్భుత రామ్ దర్బార్

- 220 టన్నుల ఇసుకతో ప్రపంచ రికార్డు!
- 58 అడుగుల పొడవు.. 20 అడుగుల ఎత్తుతో భారీ సైకత శిల్పం!
- ఏడు రోజుల పాటు శ్రమించిన కళాకారుడు మధురేంద్ర కుమార్ బృందం..
- బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటు!
- సరయూ తీరంలో కనువిందు చేస్తున్న రామమందిర నమూనా..

స్వచ్ఛ సర్వేక్షణ్‌లో ఏపీ నగరాల హవా.. విశాఖకు అగ్రతాంబూలం

- స్వచ్ఛ సర్వేక్షణ్ 2025-26 ర్యాంకింగ్స్
- 10 లక్షల జనాభా కేటగిరీలో గ్రేటర్ విశాఖకు మొదటి స్థానం
- దేశంలోనే 3వ అత్యంత స్వచ్ఛమైన నగరంగా విజయవాడ
- 3 నుంచి 10 లక్షల జనాభా విభాగంలో గుంటూరుకు 3వ ర్యాంకు
- దేశంలోనే అత్యంత స్వచ్ఛమైన నగరంగా నవీ ముంబై ఎంపిక



సంపాదకీయం

విశ్వాసం, గౌరవమే వివాహ వ్యవస్థకు మూలం

ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో సంచలనం సృష్టించి ఉప ముఖ్యమంత్రి అయిన పవన్ కళ్యాణ్, ఇప్పుడు తన మూడవ భార్యకు విడాకులు ఇచ్చి దూరంగా ఉంటున్నారు. దీంతో రెండు తెలుగు రాష్ట్రాల్లో పవన్ కళ్యాణ్ విడాకుల గురించే మాట్లాడుకుంటున్నారు. సోషల్ మీడియా, టీవీ చానళ్లు, వెబ్ సైట్లు ఒకటేంటి అన్నీ చోట్ల ఏపీ డిప్యూటీ సీఎం ముచ్చటగా మూడో పెళ్లిని కూడా రద్దు చేసుకోవడం ఏంటని ఆశ్చర్యపోతున్నారు. 2026 నవంబర్ 9 రాత్రి పవన్ కళ్యాణ్, అనా లెజ్‌నెవా విడిపోతున్నట్టు ప్రకటించారు. అభిమానులకు ఈ ప్రకటన షాకిచ్చింది. సనాతన ధర్మం గురించి మాట్లాడే పవన్ కళ్యాణ్ ఇలాంటి నిర్ణయం ఎందుకు తీసుకున్నారంటూ సోషల్ మీడియాలో చర్చ జరుగుతోంది. జనసేన అధినేత పవన్ కళ్యాణ్ తన ప్రసంగాల్లో సనాతన ధర్మ పరిరక్షణ గురించి ప్రస్తావిస్తుంటారు. అయితే సనాతన ధర్మం గురించి మాట్లాడే వ్యక్తులు తమ వ్యక్తిగత జీవితంలో ధర్మవిలువలు పాటిస్తున్నారా? పవన్ కళ్యాణ్ మమూడు పెళ్లిళ్లు.. మూడో భార్యతో విడాకుల వ్యవహారంతో మరోసారి చర్చనీయాంశమైంది. 1997లో నందినిని వివాహం చేసుకున్న పవన్ కళ్యాణ్ 2008లో విడాకులు తీసుకున్నారునటి రేణుదేశాయ్ లో సహజీవనం చేసి 2009లో పెళ్లిచేసుకున్నారు..వీరికి ఇద్దరు పిల్లలు.. 2012లో విడిపోయారు.రష్యాకు చెందిన అనా లెజ్‌నెవాని 2013లో వివాహం చేసుకున్నారు..వీరికి ఇద్దరు పిల్లలున్నారు..లేటెస్ట్ గా పరస్పర అంగీకారంతో విడిపోతున్నట్టు ప్రకటించారుతమ వైవాహిక బంధం ముగిసినప్పటికీ పిల్లల బాధ్యతలు కలసి నిర్వహిస్తామని తెలిపారు. సనాతన ధర్మం అంటే శాశ్వతమైన ధర్మం లేదా ఎప్పటికీ నిలిచే జీవన విలువలు అని అర్థం. ఇది కేవలం మతపరమైన నినాదం కాదు.. సత్యం, ధర్మం, అహింస, దయ, కరుణ, ఇంద్రియ నిగ్రహం, పరులకు హాని చేయకపోవడం లాంటి విలువలకు సనాతన ధర్మంలో ప్రాధాన్యత ఉంది. ధర్మం అంటే కేవలం పూజ చేయడం, దేవాలయాలు సందర్శించడం, ఆచారాలు పాటించడం మాత్రమే కాదు.. మనిషి తన బాధ్యతలు నిజాయితీగా నిర్వహించడం, ఇతరుల హక్కులు గౌరవించడం, కుటుంబాన్ని బాధ్యతతో నడిపించడం కూడా ధర్మంలో భాగమే. హిందూ సంప్రదాయంలో వివాహాన్ని పవిత్రమైన సంస్కారంగా భావిస్తారు. ప్రాణి భూమ్మీద పడినప్పటి నుంచి మరణించే వరకూ ముఖ్యమైన 16 సంస్కారాలు అనుసరిస్తారు. వాటిలో వివాహం కూడా ఒకటి. అగ్నిసాక్షిగా పెళ్లి చేసుకుని ఆఖరిక్షణం వరకూ ఆమెతోనే కలసి బతకాలన్నది శాస్త్రవచనం. పవన్ కళ్యాణ్ మొదటి భార్య నందిని. వారిద్దరూ ప్రేమించుకుని పెళ్లి చేసుకున్నారు. అయితే, పవన్, నందినిల మధ్య ప్రేమ ఎక్కువ కాలం నిలవలేదు. నందిని కూడా విశాఖపట్నంలోని ఒక సంపన్న కుటుంబానికి చెందినది. మొదటి భార్యకు విడాకులు ఇవ్వకుండానే రెండో పెళ్లి చేసుకున్నాడని ఆమె ఆరోపించింది. విశాఖపట్నం కుటుంబ న్యాయస్థానానికి వాంగ్మూలం ఇచ్చిన పవన్ కళ్యాణ్, తాను రేణు దేశాయ్‌ను వివాహం చేసుకోలేదని చెప్పారు. ఆ తర్వాత, పవన్ కళ్యాణ్ విడాకుల కోసం దరఖాస్తు చేసుకోగా, 2008లో నందినికి రూ. 5 కోట్ల భరణం చెల్లించి విడాకులు పొందారు.తన మొదటి భార్యతో విడిపోయి, 2012లో, ఈ జంట విడాకులు తీసుకుని విడిపోయారు.అయితే పవన్ కళ్యాణ్ నుండి రేణు దేశాయ్ కోట్ల రూపాయల భరణం అందుకోలేదని సమాచారం. దానికి బదులుగా, పవన్ కళ్యాణ్ ప్రతి నెలా వారి ఇద్దరు పిల్లల పోషణ ఖర్చులను చెల్లిస్తున్నట్లు తెలుస్తోంది. రేణు దేశాయ్ తన పేరు మీద కొన్ని ఆస్తులను రిజిస్టర్ చేయించుకున్నట్లు కూడా సినీ వర్గాల్లో ఇన్ సైడ్ టాక్.తన రెండవ భార్య రేణు దేశాయ్‌తో విడాకులు తీసుకునే ముందు, పవన్ కళ్యాణ్ 2010లో 'టీన్ మార్' సినిమా షూటింగ్ కోసం రష్యా వెళ్లారు. అక్కడ ఆయన మోడల్ అన్నా లెజ్నోవాను కలిశారు. 2012లో రేణు దేశాయ్‌కు విడాకులు ఇచ్చిన పవన్ కళ్యాణ్, 2013 ప్రత్యేక వివాహ చట్టం కింద అన్నా లేజనోవాను వివాహం చేసుకున్నారు. ఇప్పుడు ఆయన మూడవ వివాహం కూడా విడాకుల బాట పట్టింది. అన్నాతో పవన్ కళ్యాణ్ 13 ఏళ్ల వైవాహిక జీవితానికి తెరదించారు.కొందరు మాత్రం పవన్ కళ్యాణ్ విడాకులు తీసుకోవడానికి ఓ బలైమన కారణం ఉందంటూ పోస్ట్‌లు పెడుతున్నారు. అందులో మరీ ముఖ్యంగా తన రాజకీయపాలన కోసమే ఈ పని చేసినట్లు పలువురు అభిప్రాయపడుతున్నారు. ప్రజలకు సేవ చేయాలన్న ఒకే ఒక్క కారణంతో తన కుటుంబానికి దూరంగా ఉండాలనుకున్నాడని.. అందుకోసమే విడాకులు తీసుకున్నాడని పెద్ద ఎత్తున పోస్ట్‌లు పెడుతున్నారు. నిజంగానే ఈ కారణంతోనే విడాకులు తీసుకున్నాడా? లేదంటే ఇద్దరి మధ్య విభేదాలు ఉన్నాయా? అనేది క్లారిటీ లేదు.ఇందులో నిజమెంతుందో పక్కన పెడితే ఈ టైమ్‌లో పవన్ కళ్యాణ్ విడాకులు తీసుకోవడం తన పొలిటికల్ కెరీర్‌కు మరో మచ్చలా మిగిలిపోతుందా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. అయితే చాలా మంది మాత్రం అది వాళ్ల పర్సనల్ లైఫ్.. విడాకులు తీసుకుంటారో, కలిసుంటారో అన్నది వాళ్ల ఛాయిస్. వాళ్ల డెసిషన్‌కు రెస్పెక్ట్ ఇవ్వాలి కానీ... ఇంకా బురద జల్లే ప్రయత్నాలు చేయడం సరికాదు అంటూ పోస్ట్‌లు పెడుతున్నారు.భార్యాభర్తలు పరస్పర విశ్వాసం, గౌరవం, బాధ్యతతో జీవించాలని వివిధ ధర్మశాస్త్రాలు, సంప్రదాయాలు బోధిస్తాయి. వివాహం విఫలం అయితే జీవితాంతం బాధను భరించాలనే నియమమం సనాతన ధర్మంలో ఉందని చెప్పలేం. పెళ్లి, విడాకులు, పునర్వివాహాల విషయంలో హిందూ సంప్రదాయాల్లో భిన్నమైన అభిప్రాయాలు, ఆచారాలు ఉన్నాయి. ఆధునిక భారతీయ చట్టం కూడా విడాకులు, పునర్వివాహాలకు అవకాశం కల్పిస్తోంది. ఓ వ్యక్తి ఎన్ని వివాహాలు చేసుకున్నారనే సంఖ్య ఆధారంగా మాత్రమే వారి ధార్మికతను నిర్ణయించడం సరైన పద్ధతి కాదు. అదే సమయంలో ప్రతి వివాహంలోనూ భాగస్వామ్య గౌరవం, పిల్లల సంక్షేమం, కుటుంబ బాధ్యతలను ప్రాధాన్యత ఇవ్వడం అవసరం.ఆధ్యాత్మిక దృక్పథంలో చూస్తే వ్యక్తిగత జీవితంపై తీర్పు చెప్పడం కన్నా ఆ వ్యక్తి ప్రవర్తనలో ధర్మ విలువలు ఎంతవరకు ప్రతిబింబిస్తున్నాయో పరిశీలించడం ముఖ్యం. వివాహ బంధం కొనసాగపోవడానికి ఎన్నో వ్యక్తిగత కారణాలు ఉండొచ్చు. పూర్తి కారణాలు తెలియకుండా తప్పొప్పులు చెప్పడం సముచితం కాదంటారు ఆధ్యాత్మికవేత్తలు. సనాతన ధర్మం గురించి ప్రజలకు సందేశాలు ఇచ్చేనాయకులు తమ జీవితాల్లో సత్యం, నిబద్ధత, బాధ్యత, పరస్పర గౌరవం వంటి విలువలకు ప్రాధాన్యత ఇవ్వాలని అంతా ఆశించడం సహజం. సనాతన ధర్మం అంటే ఇతరులకు చెప్పేందుకు ఉపయోగించే నినాదం కాదు..అది మనిషి తన జీవితంలో ఆచరించాల్సిన విలువల సమాహారం. రాజకీయ నాయకుడు అయినా, ఆధ్యాత్మికవేత్త అయినా, సామాన్యుడు అయినా ధర్మం ముందు బాధ్యత ఒక్కటే. ధర్మం మాటల్లో కనిపించడం కన్నా చేతల్లో చూపించినప్పుడే సందేశం విలువ పెరుగుతుంది..

పాలకుల పంచన చేరని సీఈసీ శేషన్!



దేశంలో కొన్నేండ్లుగా ఎన్నికల సంఘం వివాదాస్పదంగా మారిపోయింది. ఇప్పుడైతే బీజేపీకి తాబేదారుగా వ్యవహరిస్తున్నదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పార్టీకొక పాలసీ, రాష్ట్రానికొక విధానంతో ఈసీ తన స్థాయిని తానే భ్రష్ట పట్టించుకుంటున్నది. ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణలో అవకతవకల వివాదంతో ఈసీ ఖ్యాతి పతనావస్థకు చేరింది. ఏకంగా ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌పైనే ఏతీవ్రమైన ఆరోపణలు వస్తున్నాయి. ఆయన రాజీనామా కోరుతూ ఆందోళనలు ఉధృతంగా నడుస్తున్నాయి. కానీ ఈసీకి సంబంధించి ఈనాటి ఈ దుస్థితికి భిన్నమైన చిత్రం ఒకనాడు ఉండేది. వెన్నెముక లేని అధికారులు ఎన్నికలను భ్రష్ట పట్టిస్తున్న ఇలాంటి తరుణంలో సీఈసీ పదవికి వన్నె తెచ్చిన ఒక ప్రజాస్వామిక పరిరక్షకుడి గురించి తెలుసుకోవాల్సిన అవసరమున్నది. ఆయన మరెవరోకాదు, టీఎన్ శేషన్‌గా ప్రఖ్యాతిగాంచిన తిరునళ్లై నారాయణ అయ్యర్ శేషన్. నేడు ఆయన వర్ధంతి సందర్భంగా ఆ మహనీయుడి కృషిని స్మరించుకుందాం. ఐఏఎస్‌అంటే 'అయ్యా.. ఎస్' అని తలూపడం కాదని రాజ్యాంగం కల్పించిన విశేషాధికారాలతో నిష్పక్షపాతంగా, నిర్భయంగా ప్రజల కోసమే పని చేయడం అని నిరూపించిన అధికారులు అరుదు. అందులో కేంద్ర ఎన్నికల సంఘం మాజీ ప్రధాన అధికారి టీఎన్ శేషన్ ముందువరుసలో ఉంటారు. రాజ్యాంగం విలువలను గౌరవిస్తూ అదేబాటలో పయనించారు. ఒత్తిళ్లకు లొంగకుండా సాహసోపేతమైన సంస్కరణలను అమలు చేసి, చరిత్రలో చిరస్థాయిగా నిలిచారు. ఎన్నికలంటే ఒక తంతు కాదని, అది ఒక గొప్ప బాధ్యత అని భావించి, లోపభూయిష్టమైన విధానాలను రూపుమాపారు. ఆ తర్వాత కాలంలో చాలామంది ఎన్నికల అధికారులకు మార్గదర్శిగా నిలిచారు. శేషన్ గురించి తెలుసుకుంటే అధికారులకు తమ పదవికున్న గొప్పదనం స్పష్టంగా అర్థమవుతుంది.

1990వ దశకం తొలినాళ్లలో కొందరు ఐఏఎస్ అధికారులు రాజకీయ నాయకుల బెదిరింపులకు భయపడి దిక్కుదోచని దశలో ఉన్న రోజులవి. అటువంటి సమయంలో రాజ్యాంగానికి కట్టుబడి ఉద్యోగ ధర్మం నిర్వహించే ఐఏఎస్‌లను ఏ రాజకీయ నాయకులు ఏమీ చేయలేరని నిరూపించారు టీఎన్ శేషన్. ఐఏఎస్‌లు తమ విలువల్ని మరిచినప్పుడు మాత్రమే రాజకీయ నాయకుల అడుగులకు మడుగులొత్తాల్సి వస్తుందని, విధి నిర్వహణలో నిజాయితీగా పని చేస్తే నిర్భయంగా ఉండొచ్చని తన ఆచరణ ద్వారా చాటిచెప్పారు. ఐఏఎస్ విశిష్టతను అర్థమయ్యేలా చూపెట్టారు. ఎందరో ఐఏఎస్‌లలో ఆత్మైస్థెర్యం, స్ఫూర్తిని నింపారు. కేంద్ర ఎన్నికల సంఘంలో పదో ఎన్నికల ప్రధానాధికారిగా నియమితుడైన ఆయన 1990 డిసెంబర్ 12 నుంచి 1996 డిసెంబర్ 11 వరకు పదవిలో కొనసాగారు. పదవిని స్వీకరించిన తొలినాళ్లలోనే ఎన్నికల విధానంలోని వంద అవకతవకలు, లోపాల్ని గుర్తించారు. ఓటర్ల జాబితాలు, పోలింగ్ స్టేషన్ల నిర్వహణలో లోపాలను సరిదిద్దాలని భావించారు. బెదిరించి ఓట్లు వేయించుకునే పద్ధతులు, నిబంధనలకు మించి ఖర్చు పెట్టే అభ్యర్థులపై కఠినంగా వ్యవహరించారు.

గూండాయిజంతో పోలింగ్ బూత్‌లను ఆక్రమించడం, అధికారుల పక్షపాత ధోరణి లాంటి అంశాలపై దృష్టి సారించారు. లోపాలను సరిచేయడంలో చాలా కఠినంగా వ్యవహరించారు. అంతేకాదు పారదర్శక ఎన్నికల నిర్వహణలో ఫొటో గుర్తింపు కార్డులు అత్యవసరమని ప్రతిపాదించారు. కొన్ని స్వార్థ రాజకీయ శక్తులు ఈ ప్రతిపాదనను తీవ్రంగా వ్యతిరేకించాయి. తన ప్రతిపాదనకు సరైన ప్రతిస్పందన ప్రభుత్వం నుంచి రాకపోవడంతో ఫొటో గుర్తింపు కార్డులు లేకపోతే ఎన్నికలే నిర్వహించబోనని తేల్చిచెప్పారు. చివరికి సర్వోన్నత న్యాయస్థానం ఆదేశాలకు లోబడి మాత్రమే ఎన్నికలను నిర్వహించారు. శేషన్ పట్టుదల వల్లనే తర్వాతి కాలంలో ఫొటో గుర్తింపు కార్డులు అమల్లోకి వచ్చాయి.

1993లో పార్లమెంటుకు జరిగిన ఎన్నికల్లో అభ్యర్థులు తమ ప్రచార వ్యయ వివరాలను సమర్పించకపోవడంతో 1,488 మంది అభ్యర్థుల్ని మూడేండ్ల వరకు పోటీకి అనర్హులుగా ప్రకటించారు శేషన్. సుమారు 40,000 మంది ఆశావహ అభ్యర్థులు సమర్పించిన వివరాలను స్వయంగా పరిశీలించి, తప్పుడు వివరాలిచ్చినందుకు 14,000 మందిని పోటీకి అనర్హులుగా నిర్ధారించారు. తన కఠిన నిర్ణయాల వల్ల, ఎన్నో విమర్శలను ఎదుర్కొన్నారు. అయినా శేషన్ తన సంస్కరణలను కొనసాగించారు. తాను చట్టంలోని కామాలు, ఫుల్‌స్టాప్‌లను కూడా మార్చకుండా అమలు చేశానని అనేవారు. ప్రజాస్వామిక విలువల కోసం పాటుపడిన శేషన్ 2019 నవంబర్ 10న చెన్నైలోని స్వగృహంలో తుదిశ్వాస విడిచారు. భౌతికంగా దూరమైనా ఆయన నెలకొల్పిన విలువలు ఎందరో అధికారులకు మార్గదర్శకాలయ్యాయి. శేషన్ బాటలో నడిచిన అధికారులు ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారు.

తీరు మారని ట్రంప్



ఇటీవల వెల్లడైన మధ్యంతర ఎన్నికల్లో రిపబ్లికన్లు దారుణంగా దెబ్బతిన్నా అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ వ్యవహారశైలి మారిన దాఖలా కనబడటం లేదు. ఎప్పటిలాగే పరస్పర విరుద్ధ సంకేతాలు పంపుతూ గందరగోళపరిచేందుకే ఆయన ప్రయత్నిస్తు న్నారు. తమ దాడులవల్ల ఇరాన్ సైనికంగా బలహీనపడిందనీ, ఇక యుద్ధం ముగిసిందనే అనుకుంటున్నాననీ మంగళవారం ఆయన ప్రకటించారు. ఆ ప్రాంత దేశాలైన ఖతార్, సౌదీ అరేబియా, యూఏఈ, బహ్రెయిన్ తదితర దేశాల కోరికమేరకే కొత్త దాడులు చేయరాదన్న నిర్ణయం తీసుకున్నామన్నారు.

ఇరాన్ ఆర్థిక వ్యవస్థను ధ్వంసం చేశాం గనుక ఇక యుద్ధం అవసరం లేదని విదేశాంగ మంత్రి మార్కో రుబియో కూడా చెప్పారు. వినడానికి బాగానే అనిపించినా ఈ ప్రకటనల్లో ఎక్కడో తేడా ఉందని అందరికీ అర్థమవు తుంది. ఒకపక్క యుద్ధం ఇక ఉండబోదంటూనే ఓడరేవుల దిగ్బంధం కొనసాగిస్తామని ట్రంప్ అంటున్నారు. మాటలవరకూ ఆయన అయోమయం సృష్టిస్తున్నా, చేతలు ఆయనే మిటో చాటుతున్నాయి. ఇప్పటికీ రోజూ హార్మూజ్ జలసంధిలో చమురు నౌకలపై అమెరికా దాడులు చేస్తూనేవుంది. వాటికి జవాబుగా ఇరాన్‌వైపునుంచి ప్రతిఘటన కొనసాగుతోంది.

ఒమన్‌లో భాగమైన దీదామర్ దీవిలో చమురు స్మగ్లింగ్‌కు పాల్పడు తున్న శత్రు నౌకల్ని ధ్వంసం చేశామని ఇరాన్ తెలిపింది. ఇవన్నీ అమెరికా తరలించుకు పోతున్న ముడిచమురు ట్యాంకులే. ఆత్మరక్షణ కోసమంటూ ఇరాన్‌లోని కెషమ్ ద్వీపంపై అమెరికా దళాలు ఇటీవలే దాడులు జరిపాయి. ఈ యుద్ధానికి అనుబంధంగా మొదలైన లెబనాన్, యెమెన్ ఘర్షణలు కూడా యథావిధిగానే ఉన్నాయి. అమెరికా మాదిరే ఇజ్రాయెల్ సైతం లెబనాన్‌తో కుదిరిన ఒడంబడికను ఉల్లంఘిస్తూ నిత్యం దాడులు చేయటంవల్లే ఈ పరిస్థితి తలెత్తింది.

ఎనిమిది నెలల క్రితం ఇరాన్‌తో అనవసర కయ్యానికి దిగిన ట్రంప్ వల్ల ఆర్థిక వ్యవస్థ కనీవినీ ఎరుగని స్థాయిలో కష్టాలు ఎదుర్కొంటున్నది. ఇంధన ధరలు భారీగాపెరగటంతో, ఇతర నిత్యావసరాల ధరలు సైతం ఆకాశాన్నంటాయి. మొన్న ఆగస్టు తర్వాత తొలిసారి బ్రెంట్ ముడి చమురు బ్యారెల్ 90 డాలర్లకు పడిపోయింది. ట్రంప్ తాజా ప్రకటనే ఇందుకు కారణం. కానీ ఇలా అబద్ధాలతో ఎన్నాళ్లు ధరల్ని అదుపు చేయగలుగుతారు? అమెరికా దుందుడుకు చర్యలు, అది తరచు స్వరం మార్చటం వగైరాలన్నీ దశాబ్దాలుగా చూస్తున్న ఇరాన్‌ను ఇలాంటి మాయదారి ప్రకటనలు మోసపుచ్చలేవు.

ఆ దేశ విదేశాంగమంత్రి అబ్బాస్ అరఘూచి చెప్పినట్టు గౌరవప్రదమైన భాష, దౌత్యపరమైన చర్చలు, ఇన్నేళ్లుగా అమలు చేస్తూ వచ్చిన ఆంక్షల ఎత్తివేత, అమెరికా స్తంభింపజేసిన ఇరాన్ ఆస్తుల విడుదల వంటివి మాత్రమే ఘర్షణలు నిలిచిపోవటానికి దోహదపడతాయి. ఇవన్నీ జరిగిన రెండు రోజుల్లోనే హార్మూజ్‌జలసంధిలో సాధారణ పరిస్థితులేర్పడతాయని కూడా అరఘూచి అన్నారు. ఈ ప్రతిపాదనలపై తన వైఖరేమిటో చెప్పకుండా, లక్ష్యం నెరవేరింది గనుక తదుపరి దాడులుండబోవని ట్రంప్ చెప్పటం ప్రజల్ని వంచించటమే.

రిపబ్లికన్లను జనం తిరస్కరించటానికి ఇరాన్ యుద్ధంతోపాటు ఇతర కారణాలు కూడా ఉన్నాయి. తన రెండో ఏలుబడి మొదలయ్యాక ట్రంప్ దేశంలో సకల వ్యవస్థలనూ నాశనం చేశారు. న్యాయవ్యవస్థను గుప్పెట్లో పెట్టుకోవడానికి ప్రయత్నించారు. జాతి విద్వేషాలను రెచ్చగొట్టారు. వలసదారులపై ఉక్కుపాదం మోపారు. సక్రమంగా దేశంలో ప్రవేశించినవారిని సైతం వేటాడారు. లైంగిక మైనారిటీ లను వేధించారు. అదనపుసుంకాల పేరిట అనేక దేశాలను దూరం చేసుకున్నారు. వీటన్నిటికీ బాధ్యుడు స్టీఫెన్ మిల్లర్. అలాంటి వ్యక్తిని తాజాగా ట్రంప్ పదోన్నతి కల్పించి, వైట్‌హౌస్ సిబ్బంది వ్యవహారాల చీఫ్‌గా నియమించారు.

ఆయనలో పరివర్తన రాలేదనీ, ఇరాన్ యుద్ధం గురించిన ప్రకటన కూడా మోసపూరిత ఎత్తుగడేననీ స్పష్టంగా తెలుస్తుంది. ఈరెండేళ్లూ ఎటూ ఆయన మైనారిటీ అధ్యక్షుడిగానే కాలం వెళ్లదీయాలి. అయినా తనవీటో అస్త్రాన్ని ఎడాపెడా ప్రయోగిస్తారు. ప్రతినిధుల సభలోనూ, సెనేట్‌లోనూ డెమాక్రాట్లు తమ ఆధిక్యతతో వీలైనమేర అడ్డుకుంటేనే ఈ వైపరీత్యాల తీవ్రతను కాస్తయినా తగ్గించటం సాధ్యమవుతుంది.

తెలుగు సాహిత్యంలో సరికొత్త అధ్యాయం..

తొలి మహిళా సహస్రావధానానికి రంగం సిద్ధం!

విజయవాడ: తెలుగు సాహిత్య చరిత్రలో ఒక సరికొత్త అధ్యాయానికి విజయవాడ నగరం వేదిక కానుంది. అత్యంత క్లిష్టమైన సాహిత్య ప్రక్రియగా పేరుగాంచిన "సహస్రావధానం"ను తొలిసారిగా ఒక మహిళ నిర్వహించబోతున్నారు. ప్రముఖ అవధాని బులుసు అపర్ణ ఈ చారిత్రక ఘట్టానికి శ్రీకారం చుట్టారు. డిసెంబరు 10 నుంచి జనవరి 3 వరకు మొత్తం 25 రోజుల పాటు పొట్టి శ్రీరాములు ఇంజనీరింగ్ కళాశాల ప్రాంగణంలో ఈ అపూర్వ సాహిత్య యజ్ఞం జరగనుంది. మంగళవారం విజయవాడ కేబీఎన్ కళాశాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో హిందూ హైస్కూల్స్ కమిటీ జనరల్ కరస్పాండెంట్ గోపిశెట్టి మల్లయ్య, కేబీఎన్ కళాశాల కరస్పాండెంట్ టి.శ్రీనివాసు, అవధాని అపర్ణ ఈ వివరాలు వెల్లడించారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన ప్రచార ప్రతులను ఆవిష్కరించారు. డిసెంబరు 10న ప్రముఖ అవధాన బ్రహ్మ మాడుగుల నాగఫణిశర్మ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. అనంతరం 25 రోజుల పాటు వివిధ దశల్లో అవధాన ప్రక్రియ కొనసాగుతుంది. జనవరి 3న జరిగే ముగింపు కార్యక్రమం, ధారణ, విజయోత్సవ సభకు సహస్రావధాని గరికిపాటి నరసింహారావు హాజరుకానుండటం విశేషం. ఈ సందర్భంగా అవధాని బులుసు అపర్ణ మాట్లాడుతూ.. "ఇప్పటివరకు 325కు పైగా అష్టావధానాలు, ఏడు శతావధానాలు, రెండు ద్విశతావధానాలు పూర్తి చేశాను. ఇప్పుడు గురువుల ఆశీస్సులతో సహస్రావధానానికి సిద్ధమయ్యాను. డిసెంబరు 10 నుంచి 22 వరకు సమస్యలు, దత్తపదులు, వర్ణన అంశాలను స్వీకరించి, 23 నుంచి వాటి పూరణలు చేస్తాను. జనవరి 3న 750 పద్యాల ధారణతో పాటు ఆశుపద్యాలు, ఘంటావధానంతో కలిపి వెయ్యి పద్యాలను పూర్తి చేస్తాను" అని వివరించారు. అత్యంత ప్రతిష్ఠాత్మకమైన ఈ కార్యక్రమాన్ని పీఎస్‌సీఎంఆర్ ఇంజినీరింగ్ కళాశాల ఇండోర్ స్టేడియంలో నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. తెలుగు సాహితీ లోకంలో ఒక మహిళ ఒంటిచేత్తో సహస్రావధానం చేయడం ఇదే ప్రథమం కావడంతో ఈ కార్యక్రమంపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఇది తెలుగు భాషాభిమానులకు, సాహిత్య ప్రియులకు ఒక పండుగలా నిలిచిపోతుందని నిర్వాహకులు ధీమా వ్యక్తం చేశారు.

బాపూజీ నగర్‌లో రూ.49.8 లక్షలతో సిమెంటు రోడ్ల నిర్మాణం

- రోడ్ల నిర్మాణ పనులను కాలనీవాసులతో కలిసి పరిశీలించిన బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు సాయిజెన్ శేఖర్

నాచారం, నవంబర్ 11 (మన మీ వార్త):

ఉప్పల్ నియోజకవర్గం హెచ్ఎంటీ నగర్ డివిజన్ పరిధిలోని బాపూజీ నగర్ కాలనీ రోడ్ నంబర్ 1, 2లలో రూ.49.8 లక్షల వ్యయంతో నూతనంగా చేపట్టిన సిమెంటు రోడ్ల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. ఈ పనులను బుధవారం బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు సాయిజెన్ శేఖర్ కాలనీవాసులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా నిర్మాణ పనుల పురోగతిని ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించి, రోడ్ల నిర్మాణంలో నాణ్యతా



ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని, పనులను నాణ్యతతో త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. కాలనీవాసులకు మెరుగైన రహదారి సౌకర్యాలు కల్పించడమే లక్ష్యంగా అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు పేర్కొన్నారు.నూతన సిమెంటు రోడ్ల నిర్మాణంతో కాలనీలో రాకపోకలకు ఇబ్బందులు తొలగి మెరుగైన సౌకర్యాలు అందుబాటులోకి రానున్నాయని కాలనీవాసులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పనుల పర్యవేక్షణకు వచ్చిన సాయిజెన్ శేఖర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయించిన ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో బాపూజీ నగర్, సరస్వతి నగర్ కాలనీ అధ్యక్షులు వనం జయరాజ్, ప్రధాన కార్యదర్శి నరసింగరావు, యాదగిరిరెడ్డి, బాల్‌రెడ్డి, ఆంజనేయులు, మక్బూల్, కట్ట బుచ్చన్న గౌడ్, రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కేపీహెచ్‌బీలో ప్రభుత్వ పాఠశాల స్థల పరిరక్షణకు ముందడుగు

- సీఎం రేవంత్ రెడ్డి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్ బాబుకు శేరి సతీష్ రెడ్డి కృతజ్ఞతలు

కూకట్పల్లి నవంబర్ 11 మన మీ వార్త

ఉమ్మడి కేపీహెచ్‌బీ డివిజన్‌లో హౌసింగ్ బోర్డు లేఔట్‌లో పాఠశాల కోసం కేటాయించిన స్థలాన్ని అధికారికంగా ప్రభుత్వ పాఠశాల స్థలంగా గుర్తించేలా చర్యలు చేపట్టిన ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి కి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు కు శేరి సతీష్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

ఈ స్థలాన్ని ప్రభుత్వ పాఠశాల అవసరాలకు వినియోగించేలా అధికారిక చర్యలు తీసుకోవాలని మంత్రి శ్రీధర్ బాబు దృష్టికి తీసుకెళ్లినట్లు ఆయన పేర్కొన్నారు. మంత్రి స్పందించి ముఖ్యమంత్రి తో చర్చించి, సంబంధిత అధికారులను ఆదేశించడం ద్వారా ప్రభుత్వ పాఠశాల స్థలంగా గుర్తించే ప్రక్రియకు ముందడుగు పడిందని తెలిపారు.

గత బీఆర్ఎస్ పాలనలో ఎన్టీఆర్ పేరుతో పాఠశాల నిర్మిస్తామని డబ్బులు వసూలు చేసి, పిల్లర్లు వేసి పనులను అసంపూర్తిగా వదిలేశారని సతీష్ రెడ్డి ఆరోపించారు. పదేళ్ల కాలంలో పాఠశాల నిర్మాణాన్ని పూర్తిచేసి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావడానికి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు.

అప్పటి కార్పొరేటర్ ఆధ్వర్యంలో చేపట్టిన నిర్మాణానికి ఏయే అనుమతులు తీసుకున్నారో, ఎంత మొత్తం వసూలు చేశారో, ఎంత ఖర్చు చేశారో ప్రజలకు వెల్లడించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ స్థలంలో అధికారిక అనుమతులు లేకుండా ప్రైవేటు వ్యక్తులు నిర్మాణాలు చేపట్టడం ఏమిటని ప్రశ్నించారు.

"ప్రభుత్వ స్థలం ప్రజల ఆస్తి. దానిని ఎవరూ తమ సొంత జాగీరుగా భావించకూడదు. పాఠశాల నిర్మాణానికి విరాళాలు ఇవ్వాలనుకునేవారు సంబంధిత ప్రభుత్వ శాఖను సంప్రదించి, అధికారికంగా సహకరించాలి. నిర్మాణ పనులు ప్రభుత్వ పర్యవేక్షణలో, పారదర్శక విధానంలో జరగాలి" అని ఆయన స్పష్టం చేశారు.

పాఠశాలకు పేరు పెట్టడం కంటే విద్యార్థులకు





నాణ్యమైన విద్య, పూర్తిస్థాయి భవనం, అవసరమైన మౌలిక వసతులు కల్పించడమే ముఖ్యమని పేర్కొన్నారు. ఈ స్థలంలో ప్రభుత్వ పాఠశాల నిర్మాణాన్ని పూర్తిచేసి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని కోరారు.

ప్రజల ఆస్తుల పరిరక్షణకు, ప్రభుత్వ విద్య బలోపేతానికి స్పందించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి, మంత్రి శ్రీధర్ బాబు కి మరోసారి ధన్యవాదాలు తెలిపారు. తెలిపిన వారిలో బి బ్లాక్ అధ్యక్షులు తూము వేణు, ఉమ్మడి కెపిహెచ్బి డివిజన్ మాజీ అధ్యక్షులు తమ్మినేని ప్రవీణ్ కుమార్, కూకట్పల్లి నియోజకవర్గ క్రిస్టియన్ మైనార్టీ సెల్ కన్వీనర్ మేకల మైఖేల్ తదితరులు పాల్గొన్నారు.

ఉప్పల్ నియోజకవర్గంలో మంచినీటి, డ్రైనేజీ సమస్యలను తక్షణమే పరిష్కరించాలి





- వాటర్ వర్క్స్ ఎండీ అశోక్‌రెడ్డిని కోరిన కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి మందుముల పరమేశ్వర్‌రెడ్డి

ఉప్పల్, నవంబర్ 11 (మన మీ వార్త):

ఉప్పల్ నియోజకవర్గ పరిధిలో నెలకొన్న మంచినీటి సరఫరా, డ్రైనేజీ సమస్యలను తక్షణమే పరిష్కరించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని కాంగ్రెస్ పార్టీ ఉప్పల్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి మందుముల పరమేశ్వర్‌రెడ్డి అధికారులను కోరారు. ఈ మేరకు బుధవారం హైదరాబాద్ మెట్రో వాటర్ వర్క్స్ మేనేజింగ్ డైరెక్టర్ అశోక్‌రెడ్డిని కలిసి నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న తాగునీటి సరఫరా, మురుగునీటి సమస్యలను వివరించారు.నియోజకవర్గంలోని పలు కాలనీలలో సక్రమంగా మంచినీటి సరఫరా జరగక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, మరోవైపు డ్రైనేజీ వ్యవస్థలో తలెత్తుతున్న సమస్యలతో స్థానికులు అసౌకర్యానికి గురవుతున్నారని ఎండీ దృష్టికి తీసుకెళ్లారు. ప్రజల దైనందిన అవసరాలను దృష్టిలో ఉంచుకుని సంబంధిత అధికారులు ప్రత్యేక చొరవ తీసుకొని సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ముఖ్యంగా తరచూ తాగునీటి, డ్రైనేజీ సమస్యలు తలెత్తుతున్న ప్రాంతాలను గుర్తించి, సమస్యలు పునరావృతం కాకుండా అవసరమైన చోట్ల నూతన పైపులైన్ల నిర్మాణం చేపట్టాలని సూచించారు. అదేవిధంగా వివిధ కారణాలతో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేసి మంచినీటి సరఫరా, మురుగునీటి వ్యవస్థలను మరింత మెరుగుపరచాలని కోరారు.



ప్రజలకు మౌలిక సదుపాయాల పరంగా ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు సమన్వయంతో పనిచేసి సమస్యలను పరిష్కరించాలని మందుముల పరమేశ్వర్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో రామంతాపూర్ డివిజన్ అధ్యక్షుడు పెద్ది రాజు సందీప్ కుమార్‌తో పాటు మహమ్మద్ రఫిక్, జలీల్ పాషా, భాస్కర్, గంగాపుత్ర, షాగా శ్రీధర్, జంగయ్య, మతీన్, యాదగిరిరెడ్డి, రామబ్రహ్మం, జంగారెడ్డి, రాహుల్, చెంచుల్, వెంకటేశ్వరరావు, జ్ఞానేశ్వర్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాలలో సుస్థిరత సాధించాలి

- ఎంపీడీవో శంకర్ నాయక్

పర్వతగిరి నవంబర్11(మల్లేష్ మీ వార్త ప్రతినిధి) :

మహిళలు ఆర్థికంగా సామాజికంగా అభివృద్ధి చెంది అన్ని రంగాలలో సుస్థిరత సాధించాలనే సంకల్పంతో ప్రభుత్వం మహిళా సమైక్యలకు పక్కా భవనాల నిర్మాణాలకు నిధులు మంజూరు చేయడం జరిగిందని పర్వతగిరి ఎంపీడీవో మాలోత్ శంకర్ నాయక్ తెలిపారు. బుధవారం పర్వతగిరి మండలంలోని చౌటపల్లి, బూర్గుమళ్ళ గ్రామాల్లో సర్పంచ్ లు వెంకటేశ్వరరావు, ఎలికట్టే కృష్ణవేణి ఆధ్వర్యంలో మహిళా వివో భవనాల నిర్మాణానికి భూమి పూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంపీడీవో శంకర్ నాయక్, ఎంపీఓ శేషాంజనేయులు ముఖ్యఅతిథిగా పాల్గొని ఆయా గ్రామాల సర్పంచులతో కలిసి టెంకాయలు కొట్టి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో శంకర్ నాయక్ ఎంపీఓ శేషాంజనేయులు మాట్లాడుతూ... మహిళల అభివృద్ధి కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టి అమలు చేస్తున్న పథకాలను మహిళలు సద్వినియోగం చేసుకొని సాధికారత సాధించాలన్నారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతను పాటించి ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని సూచించారు. వివిజి రాంజీ పథకం ద్వారా గ్రామాల్లో చేపడుతున్న పనులకు హాజరు శాతం పెంచుటకు మహిళలు ప్రత్యేక శ్రద్ధ చూపాలని వారు కోరారు. ప్లాస్టిక్ నివారణకు ప్రతి ఒక్కరు నడుము బిగించి పర్యావరణ పరిరక్షణకు తోడ్పడాలని అన్నారు. ఏల్ నినో ప్రభావాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రతి ఒక్కరు ప్రతి నీటి బిందువును ఒడిసిపట్టి భూగర్భ జలాల నీటిమట్టాన్ని పెంపొందించుటకు కృషి చేయాలని వారు కోరారు. ప్రజల భాగస్వామ్యంతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమన్నారు. అనంతరం ఆయా గ్రామాల్లో వివిజి రాంజీ పథకం ద్వారా నిర్మించిన మ్యాజిక్ సోఫిట్స్, మరుగుదొడ్డి నిర్మాణాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ లు



కృష్ణవేణి వెంకటేశ్వరరావు ఎంపీఓ శేషంజన్ స్వామి ఏపిఎం రాజీరు, సీసీలు గోలి కొమురయ్య, వర్కాల సుధాకర్ పంచాయతీ కార్యదర్శి గూగులోత్ అశోక్ నాయక్, కిరణ్ జిపిఓ యాకయ్య సొసైటీ డైరెక్టర్లు లింగంపల్లి కుమార్ రావు కందుల లావణ్య రాజు, జిపీల పాలకవర్గ సభ్యులు వివోల ప్రతినిధులు, వివోఏలు, ఏఎన్ఎంలు, అంగన్వాడి ఆశా కార్యకర్తలు, ఎమ్మెస్ సిబ్బంది, మహిళా స్వయం సహాయక బృందాల లీడర్లు సభ్యులు గ్రామ ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

వివాహ వేడుకకు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించిన కంది శ్రవణ్ కుమార్ రెడ్డి

- యూత్ కాంగ్రెస్ నాయకుడు భూక్య వినోద్ నాయక్, రేఖల వివాహ వేడుకలో పాల్గొన్న హబ్సిగూడ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు

హబ్సిగూడ, నవంబర్ 11 (మన మీ వార్త):



ఘట్‌కేసర్ మండలం ఔషాపూర్‌లోని KSNR గార్డెన్స్ అండ్ ఫంక్షన్ హాల్‌లో బుధవారం నిర్వహించిన వివాహ వేడుకకు హబ్సిగూడ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కంది శ్రవణ్ కుమార్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. హబ్సిగూడ స్ట్రీట్ నంబర్ 8కు చెందిన భూక్య ఆనంద్ నాయక్, స్వరూప దంపతుల కుమారుడు, యూత్ కాంగ్రెస్ నాయకుడు భూక్య వినోద్ నాయక్‌కు, భువనగిరికి చెందిన తేజావత్ గమ్మ, గోవింద్ నాయక్ దంపతుల కుమార్తె రేఖతో జరిగిన వివాహ వేడుకలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతన వధూవరులను ఆశీర్వదించి, వారి వైవాహిక జీవితం సుఖసంతోషాలతో సాగాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో హబ్సిగూడ డివిజన్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు వాసు నాయక్, సుమన్ నాయక్ తదితరులు పాల్గొని నూతన దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు.

అక్రమ ఇసుక రవాణా ట్రాక్టర్ పట్టివేత

- ఇద్దరిపై కేసు నమోదు

చిట్యాల, నవంబర్11 (మీవార్త) :



బుధవారం ఉదయం 11గంటల సమయంలో చిట్యాల ఎస్సై పోచంపల్లి సతీష్ శివాజీ చౌక్ చిట్యాల వద్ద వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా కాల్వపల్లి వైపు నుండి ఇసుక లోడుతో వస్తున్న ఒక ట్రాక్టర్‌ను మహీంద్రా 415 డిఎల్ నెంబర్ యూ25 1640 వాహనాన్ని ఆపి తనిఖీ చేశారు.

తనిఖీలో భాగంగా సదరు డ్రైవర్ మద్యం సేవించి వాహనం నడుపుతున్నట్లు గుర్తించడమే కాకుండా ఇసుక రవాణాకు సంబంధించి ఎలాంటి అనుమతి పత్రాలు వే బిల్లులు లేవని తేలింది. విచారణలో రేగొండ మండలం కాకర్లపల్లి గ్రామానికి చెందిన డ్రైవర్ ఇచ్చంతుల సునీల్ (26) అని తెలిసింది. తన ట్రాక్టర్ యజమాని అయిన రేగొండ కు చెందిన పట్టెం కోటిలింగం(35) చెప్పిన విధంగా కాల్వపల్లి మానేరు వాగు నుండి ఎలాంటి అనుమతులు లేకుండా దొంగతనంగా ఇసుక రవాణా చేస్తున్నట్లు డ్రైవర్ అంగీకరించాడు. వెంటనే పోలీసులు ఇసుక ట్రాక్టర్‌ను సీజ్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. మద్యం సేవించి వాహనం నడిపినందుకు మరియు అక్రమంగా ఇసుక రవాణాకు పాల్పడినందుకు ట్రాక్టర్ డ్రైవర్ ఇచ్చంతుల సునీల్ మరియు యజమాని పట్టెం కోటిలింగంపై చట్టరీత్యా కేసు నమోదు చేసినట్లు చిట్యాల ఎస్సై పోచంపల్లి సతీష్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

విద్యారంగ అభివృద్ధికి మౌలానా అబుల్ కలాం ఆజాద్ చేసిన సేవలు చిరస్మరణీయం

- ఆయన ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి: జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద

మన మీ వార్త నవంబర్ 11 వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి.



భారతదేశ తొలి విద్యాశాఖ మంత్రిగా దేశ విద్యారంగ అభివృద్ధికి విశేష కృషి చేసిన మహనీయుడు మౌలానా అబుల్ కలాం ఆజాద్ అని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అన్నారు. బుధవారం జిల్లా కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో బుధవారం

మైనారిటీ వెల్ఫేర్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి లో జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మౌలానా అబుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మౌలానా అబ్దుల్ కలాం అజాద్ గారు 1888 నవంబర్ 11న,మక్కాలో జన్మించారని, వారు దేశానికి అందించిన సేవలను చిరస్మరణీయం మన్నారు.

భారత స్వాతంత్ర్య ఉద్యమంలో కీలక పాత్ర పోషించడంతో పాటు, స్వాతంత్ర్యం అనంతరం దేశంలో విద్యావ్యవస్థ పటిష్టతకు పునాదులు వేసిన గొప్ప దార్శనికుడని పేర్కొన్నారు.

మౌలానా అబుల్ కలాం ఆజాద్ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకొని విద్యాభివృద్ధికి ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని, విద్యావంతమైన సమాజ నిర్మాణానికి అందరూ భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చారు.

ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ రెవెన్యూ ఎల్ కిషోర్ కుమార్ మాట్లాడుతూ విద్య అనేది ప్రతి ఒక్కరికీ అందుబాటులో ఉండాలని, విద్య ద్వారానే సమాజంలో మార్పు, దేశంలో అభివృద్ధి సాధ్యమవుతుందని ఆయన బలంగా విశ్వసించారని తెలిపారు.

దేశ భవిష్యత్తు తరగతి గదుల్లోనే రూపుదిద్దుకుంటుందని భావించి, విద్యారంగ అభివృద్ధికి విశేష ప్రాధాన్యతనిచ్చారని అన్నారు. ఉన్నత విద్య, సాంకేతిక విద్య, పరిశోధన రంగాల అభివృద్ధికి ఆయన చేసిన కృషి దేశ పురోగతికి ఎంతగానో దోహదపడిందని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో జిల్లా మైనారిటీ వెల్ఫేర్ అధికారి రమేష్, జిల్లా విద్యాశాఖ అధికారి ప్రశాంత్ రెడ్డి , ఇంటర్మీడియట్ విద్యా శాఖ అధికారి శ్రీధర్ సుమన్, సంబంధిత శాఖల జిల్లా అధికారులు , కలెక్టరేట్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

టీజీపీఎస్సీ ఛైర్మన్ బుర్రా వెంకటేశంను మర్యాదపూర్వకంగా కలిసిన జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద

మన మీ వార్త నవంబర్ 11 వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి.



తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) ఛైర్మన్ బుర్రా వెంకటేశంను బుధవారం హనుమకొండ ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ లో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను అందించి శుభాకాంక్షలు తెలిపారు.

మర్యాదపూర్వకంగా కలిసిన ఈ భేటీలో పరస్పరం శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు.

జవహర్‌నగర్ లో భద్రత లేని రోడ్డు పనులు - వాహనదారుల ప్రాణాలతో చెలగాటం

జవహర్‌నగర్ , నవంబర్ 11(వార్త ప్రతినిధి)





జవహర్‌నగర్ డంపింగ్ యార్డ్ గేటు ఎదురుగా సీఆర్‌పీఎఫ్ మార్గంలో ఎలాంటి భద్రతా ఏర్పాట్లు లేకుండా చేపడుతున్న రోడ్డు పనులపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఈ విషయంపై స్థానికుడు ఓరుగంటి ప్రశాంత్ కుమార్ స్పందిస్తూ – రోడ్డు పనులు చేపట్టిన ప్రాంతంలో కనీసం బారికేడ్లు, హెచ్చరిక బోర్డులు, రిఫ్లెక్టర్లు, దారి మళ్లింపు బోర్డులు కూడా ఏర్పాటు చేయలేదని, దీంతో వాహనదారులు, ముఖ్యంగా రాత్రి వేళల్లో ప్రయాణించే వారు ప్రమాదాల బారిన పడే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.

భారీ వాహనాలు తిరిగే ఈ ప్రధాన రహదారిపై ఇలా నిర్లక్ష్యంగా పనులు చేపట్టడం సరికాదని, ఇది కాంట్రాక్టర్ నిర్లక్ష్యానికి, అధికారుల పర్యవేక్షణ లోపానికి నిదర్శనమని ఆయన మండిపడ్డారు.

ప్రమాదం జరిగి ప్రాణనష్టం జరిగే వరకు వేచి చూడకుండా, వెంటనే అధికారులు స్పందించి సదరు ప్రాంతంలో భద్రతా ఏర్పాట్లు చేయాలని, నిబంధనలు పాటించని కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

బారికేడ్లు లేకుండా రోడ్డు పనులు చేయడం వల్ల వాహనదారులకు తీవ్ర ప్రమాదం ఉంది. ప్రమాదాలు జరగకముందే అధికారులు స్పందించాలి" – ఓరుగంటి ప్రశాంత్ కుమార్

ఇప్పటికైనా GHMC మరియు సంబంధిత ఇంజనీరింగ్ విభాగం అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

పంచారామాల దర్శనానికి ప్రత్యేక బస్సులు

నవంబర్12,11,2026

– హనంకొండ జిల్లాపరకాల డిపో మేనేజర్ టీ.శ్రీనివాసులు



పరకాల: కార్తీక మాసం సందర్భంగా శైవ క్షేత్రాలైన పంచారామాలకు పరకాల నుండి ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు పరకాల డిపో మేనేజర్ టీ. శ్రీనివాసులు తెలిపారు. భక్తుల సౌకర్యార్థం తెలంగాణలోని రామప్ప శ్రీ రామలింగేశ్వరాలయం, లక్న వరం సరస్సు, మేడారం సమ్మక్క – సారలమ్మ, మల్లూరు శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానం, బొగత జలపాతం, కాళేశ్వరంలోని శ్రీ కాళేశ్వర ముక్తేశ్వర స్వామి దేవస్థానం, భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానం లతో పాటు హైదరాబాదు రామోజీ ఫిలిం సిటీ, సాలార్‌జంగ్ మ్యూజియం, గోల్కొండ కోట, ఆంధ్ర ప్రదేశ్ లోని ప్రసిద్ధి చెందిన పంచరామ క్షేత్రాలైన అమరావతి , ద్రాక్షారామం, భీమవరం, పాలకొల్లు, సామర్లకోట లలోని స్వామి వార్లను దర్శించుకునేలా ప్రత్యేక బస్సు సౌకర్యాన్ని కల్పించినట్లు తెలిపారు. అంతేకాకుండా తమిళనాడులోని అరుణాచలంకు కూడా నడపడం జరుగుతుందని తెలిపారు. అయ్యప్ప భక్తుల సౌకర్యార్థం శబరిమలై దేవస్థానానికి భక్తుల డిమాండ్ కు అనుగుణంగా ఈ ప్రత్యేక బస్సులు నడపడం జరుగుతుందని, మరిన్ని వివరాల కోసం 99592 26051,96669 19190, 76740 08703లను సంప్రదించాలని డిఎం తెలిపారు.

తెలంగాణ ఉద్యమకారుని సన్మానించిన బీసీ సంఘాల ఐక్యవేదిక.



నవంబర్ 12,11,2026 పరకాల ప్రతినిధి మన మీ వార్త

భూపాలపల్లి జిల్లా జై శంకర్ జిల్లా రేగొండ మండలం కేంద్రంలో బీసీ సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో తెలంగాణ ఫోరం భూపాలపల్లి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ గా ఎన్నికైన తెలంగాణ ఉద్యమకారుడు పున్నం రవి గారిని ఘనంగా శాలువా బొకేతో అన్ని కుల సంఘాలు మరియు బీసీ సంఘాల ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమానికి భూపాలపల్లి బీసీ సంఘాల ఐక్యవేదిక అధ్యక్షులు పైడిపల్లి రమేష్ అధ్యక్షతన ముఖ్యఅతిథిగా బీసీ సంఘాల రాష్ట్ర అధ్యక్షులు ఎర్ర సత్యనారాయణ, మాజీ ప్రొఫెసర్ గడ్డం భాస్కర్, హైకోర్టు లాయర్ బీసీ సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర నాయకుడు వంశీకృష్ణ మరియు మేకల సంపత్ క్యాత రాజు సాంబమూర్తి తాటి వెంకన్న ముద్దమల్ల భార్గవ్ బుర్ర కుమారస్వామి శ్రీరాములు తదితరులు పాల్గొనడం జరిగింది.

మృతుల కుటుంబాలను పరామర్శించిన టేకుమట్ల బీఆర్ఎస్ మండల నాయకులు

టేకుమట్ల నవంబర్ 11 (మన మీ వార్త)



టేకుమట్ల మండలం లోని రామకృష్ణాపూర్ టి గ్రామానికి చెందిన బందెల సదానందం నారాయణ తండ్రి బందెల నరసయ్య అనారోగ్యంతో మృతి చెందగా ఐదవ రోజు వారి కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపి, అదేవిధంగా నిమ్మల తారమ్మ అనారోగ్యంతో మృతిచెందగా వారి కుమారుడు నిమ్మల కుమారస్వామి కి ప్రగాఢ సానుభూతి తెలిపి 25 కిలోల బియ్యం ఆర్థిక సహాయం అందజేసిన టిఆర్ఎస్ మండల నాయకులు. ఈ కార్యక్రమంలో ఆది రఘు, బందెల నరేష్, బోండ్ల మహేష్, కోండ్ర రమేష్, ఎండి అన్వర్, నిమ్మల శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.



విద్యావ్యవస్థకు మౌలానా ఆజాద్ సేవలు చిరస్మరణీయం

మహబూబాబాద్, నవంబర్ 11 (మీవార్త ప్రతినిధి) :



భారతదేశ తొలి కేంద్ర విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతిని పురస్కరించుకుని జాతీయ విద్యా దినోత్సవ వేడుకలను మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఇంగ్లీష్ ఉపాధ్యాయులు యాకూబ్ పాషా మాట్లాడుతూ... భారత విద్యావ్యవస్థ అభివృద్ధికి మౌలానా అబుల్ కలాం ఆజాద్ అందించిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. ప్రతి సంవత్సరం నవంబర్ 11న ఆయన జయంతిని జాతీయ విద్యా దినోత్సవంగా జరుపుకుంటున్నామని తెలిపారు.1947 నుంచి 1958 వరకు కేంద్ర విద్యాశాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వహించిన ఆజాద్, దేశంలో విద్యారంగ అభివృద్ధికి విశేష కృషి చేశారని వివరించారు. పాఠశాల విద్యను బలోపేతం చేయడం, విశ్వవిద్యాలయాల స్థాపన, శాస్త్రీయ పరిశోధనలను ప్రోత్సహించడం, మహిళా విద్యకు ప్రాధాన్యత కల్పించడం వంటి అనేక సంస్కరణలకు ఆయన కృషి చేశారని తెలిపారు. ఆర్థిక, సామాజిక అసమానతలతో సంబంధం లేకుండా ప్రతి చిన్నారికి విద్య అందాలని మౌలానా ఆజాద్ ఆకాంక్షించారని యాకూబ్ పాషా పేర్కొన్నారు. 14 ఏళ్లలోపు పిల్లలందరికీ నిర్బంధ ఉచిత విద్య అందించాలని ఆయన బలంగా విశ్వసించారని తెలిపారు. ఇందుకోసం ప్రాథమిక పాఠశాలల విస్తరణకు కృషి చేశారని వివరించారు.పురుషులతో సమానంగా మహిళలకు కూడా విద్యావకాశాలు కల్పించాలని ఆజాద్ భావించారని, మహిళల విద్యాభివృద్ధి ద్వారానే సమాజం అభివృద్ధి చెందుతుందని నమ్మారని పేర్కొన్నారు.దేశ పారిశ్రామిక, సాంకేతిక అభివృద్ధికి నాణ్యమైన ఉన్నత విద్య అవసరమని గుర్తించిన ఆజాద్, ఉన్నత విద్యాసంస్థల ఏర్పాటుకు ప్రాధాన్యత ఇచ్చారని తెలిపారు. ఆయన పదవీకాలంలోనే 1951లో దేశంలో తొలి ఐఐటీ అయిన ఐఐటీ ఖరగ్‌పూర్ ప్రారంభమైందని గుర్తుచేశారు.దేశంలోని విశ్వవిద్యాలయాల మధ్య సమన్వయం, ఉన్నత విద్యా ప్రమాణాల పెంపు, నిధుల కేటాయింపులో కీలక పాత్ర పోషిస్తున్న యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) ఏర్పాటులో మౌలానా ఆజాద్ విశేష కృషి చేశారని వివరించారు. 1953 డిసెంబర్ 28న యూజీసీని ప్రారంభించగా, 1956లో చట్టబద్ధ సంస్థగా రూపుదిద్దుకుందని తెలిపారు.విద్య ద్వారానే సమాజంలో సమానత్వం, అభివృద్ధి సాధ్యమని చాటిచెప్పిన మౌలానా అబుల్ కలాం ఆజాద్ ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని యాకూబ్ పాషా పిలుపునిచ్చారు.
ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తెలంగాణలో నేటి నుంచి చెకుముకి సైన్స్ సంబరాలు

వరంగల్ నవంబర్ 11(మల్లేష్ మీవార్త ప్రతినిధి) :



విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకత, ఆలోచనా శక్తి, శాస్త్రీయ దృక్పథం, ప్రయోగాత్మక నైపుణ్యాలను వెలికితీయడమే లక్ష్యంగా 8, 9, 10వ తరగతుల విద్యార్థులకు చెకుముకి టాలెంట్ టెస్ట్ నిర్వహిస్తున్నట్లు జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షులు సుధాకర్ తెలిపారు. ఈసందర్భంగా అయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించే చెకుముకి సైన్స్ సంబరాలు పాఠశాల స్థాయిలో 2026 నవంబర్ 12వ తేదీ గురువారం ఉదయం 10 గంటలకు ప్రారంభం కానున్నాయన్నారు. ఈ పరీక్షలకు గణితం, భౌతిక శాస్త్రం, జీవశాస్త్రం, సాంఘిక శాస్త్రం, సమకాలీన శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం అంశాల నుంచి ప్రశ్నలు ఉంటాయని పేర్కొన్నారు. విద్యార్థులను ఉపాధ్యాయులు తగిన విధంగా సిద్ధం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ సంబరాలు మూడు దశల్లో నిర్వహించనున్నట్లు తెలిపారు. నవంబర్ 21న మండల స్థాయి, నవంబర్ 28న జిల్లా స్థాయి, డిసెంబర్ 11, 12, 13 తేదీల్లో రాష్ట్రస్థాయి పోటీలు ఘనంగా నిర్వహించనున్నారు.
ప్రభుత్వ, ప్రైవేటు, రెసిడెన్షియల్ పాఠశాలల్లో నిర్వహించే పరీక్షల్లో ప్రతిభ కనబరిచి ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థుల్లో ప్రతి తరగతి నుంచి ఒక్కొక్కరిని, మొత్తం ముగ్గురిని మండల స్థాయి పోటీలకు పంపించాల్సి ఉంటుందని తెలిపారు.ప్రతి పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు సమన్వయంతో కృషి చేసి చెకుముకి సైన్స్ సంబరాలను విజయవంతం చేయాలని జన విజ్ఞాన వేదిక నాయకులు కోరారు.

వడ్డేపల్లి బండ్‌పై ఫుడ్ స్ట్రీట్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలి

– పారిశుద్ధ్య నిర్వహణను నిత్యం పర్యవేక్షించాలి

– జీడబ్ల్యూఎంసీ కమిషనర్ టి.వెంకన్న

మన మీ వార్త నవంబర్ 11 వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి.





జీడబ్ల్యూఎంసీ, నవంబర్ 11: నగరంలో చేపడుతున్న అభివృద్ధి పనులను నాణ్యతా ప్రమాణాలతో నిర్ణీత గడువులోగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ టి.వెంకన్న అధికారులను ఆదేశించారు. అదేవిధంగా పారిశుద్ధ్య నిర్వహణను ప్రతిరోజూ క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలని సూచించారు. బుధవారం కమిషనర్ గ్రేటర్ వరంగల్ పరిధిలోని హనుమకొండ, వరంగల్ ప్రాంతాల్లో పర్యటించి కొనసాగుతున్న అభివృద్ధి పనులు, పూర్తయిన పనులు, పారిశుద్ధ్య నిర్వహణను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వడ్డేపల్లి బండ్‌పై ఫుడ్ స్ట్రీట్ పనుల పరిశీలన హనుమకొండలోని వడ్డేపల్లి బండ్‌పై చేపడుతున్న సుందరీకరణ పనులను కమిషనర్ పరిశీలించారు. ఇందులో భాగంగా ఏర్పాటు చేస్తున్న ఫుడ్ స్ట్రీట్ నిర్మాణ పనుల పురోగతిని సమీక్షించారు. ఫుడ్ స్ట్రీట్ అందుబాటులోకి వస్తే నగర ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణంలో ఆహార పదార్థాలను ఆస్వాదించే అవకాశం కలుగుతుందని పేర్కొన్నారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ, ఎలాంటి జాప్యం లేకుండా త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు.

ఈ సందర్భంగా హనుమకొండ బస్టాండ్ పరిసరాలను పరిశీలించిన కమిషనర్ పారిశుద్ధ్య నిర్వహణను సమీక్షించారు. బస్టాండ్‌లోని మురుగు కాలువను పరిశీలించి, మురుగునీరు నిల్వ ఉండకుండా శాశ్వత పరిష్కారం చూపేందుకు అవసరమైన అభివృద్ధి పనుల ప్రతిపాదనలు సమర్పించాలని ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. అనంతరం ఏనుమాముల మార్కెట్ సమీపంలోని బాలాజీ జంక్షన్ వద్ద పూర్తయిన అభివృద్ధి పనులను పరిశీలించారు.
వాటర్ ట్యాంక్ నిర్మాణం సకాలంలో పూర్తి చేయాలి
వరంగల్‌లోని గోవిందరాజులగుట్ట ప్రాంతంలో నిర్మిస్తున్న వాటర్ ట్యాంక్ పనులను కమిషనర్ పరిశీలించారు. నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాలతో నిర్ణీత గడువులోగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.
ఇంటి నుంచి చెత్త సేకరణ పక్కాగా జరగాలి
అదే ప్రాంతంలో ఆకస్మికంగా స్వచ్ఛ ఆటోను తనిఖీ చేసిన కమిషనర్ తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరిస్తున్న తీరును పరిశీలించారు. డ్రైవర్ నిర్వహిస్తున్న లాగ్‌బుక్‌ను తనిఖీ చేసి, ప్రతి ఇంటి నుంచి చెత్త సేకరణ వివరాలను నమోదు చేస్తున్న విధానాన్ని పరిశీలించారు. ప్రతి ఇంటి నుంచి ప్రతిరోజూ క్రమం తప్పకుండా తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించాలని, చెత్త సేకరణలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావివ్వకూడదని ఆదేశించారు. స్వచ్ఛ ఆటోల పనితీరు, లాగ్‌బుక్ నిర్వహణను శానిటరీ అధికారులు, సిబ్బంది నిత్యం పర్యవేక్షించాలని స్పష్టం చేశారు.
సీఎంహెచ్ఓ డాక్టర్ రాజారెడ్డి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు సంజయ్ కుమార్, ఎంహెచ్ఓ డాక్టర్ రాజేష్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, శానిటరీ సూపర్‌వైజర్లు, డీఈలు, ఏఈలు, సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజలకు తాగునీటి ఇబ్బందులు లేకుండా ముందస్తు ప్రణాళికతో పనిచేయాలి

– ప్రతి గ్రామంలో నీటి వనరుల సంరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలి

– ప్రతి జాబ్ కార్డు కలిగిన కూలీకి ఉపాధి అవకాశాలు కల్పించాలి

పరకాల ప్రతినిధి మన మీ వార్త



హనంకొండ జిల్లా ఆత్మకూరు మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి మండల పరిధిలోని సర్పంచులు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, వివిధ శాఖల అధికారులతో మంచినీటి సరఫరా, విభి–జీ రామ్ జి పథకం, గ్రామాల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఎల్ నినో ప్రభావంతో రానున్న రోజుల్లో నీటి కొరత ఏర్పడే అవకాశాలను దృష్టిలో ఉంచుకొని ఇప్పటి నుంచే నీటి సంరక్షణకు పటిష్టమైన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.గ్రామాల్లో ప్రజలకు ఎలాంటి తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో చర్యలు తీసుకోవాలని, ప్రతి ఇంటికి నల్లా ద్వారా మంచినీరు అందేలా చూడాలని కోరారు.ప్రతి గ్రామంలో తాగునీటి వనరులను పరిరక్షించాలని, బావుల్లో పేరుకుపోయిన పూడికను తొలగించి నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచాలని సూచించారు. ప్రతి 15 రోజులకు ఒకసారి గ్రామాల్లో భూగర్భ జలమట్టాన్ని తప్పనిసరిగా పరిశీలించి నివేదికలు సమర్పించాలని ఆదేశించారు.వీబీ–జీ రామ్ జీ పథకం ద్వారా గ్రామీణ కూలీలకు ఉపాధి అవకాశాలు కల్పించేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు. ప్రతి జాబ్ కార్డు కలిగిన కూలీ ఈ పథకం ద్వారా లబ్ధి పొందేలా అవగాహన కల్పించి, పనుల్లో పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.విధుల పట్ల నిర్లక్ష్యం వహించే అధికారులపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు అవసరమైతే సస్పెన్షన్‌కు కూడా వెనుకాడబోనని స్పష్టం చేశారు.నీటిని వృథా చేసే వారిపై ఫిర్యాదులు అందినట్లయితే విచారణ జరిపి రూ.500 వరకు జరిమానా విధించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.మంచినీటితో పాటు విద్యుత్‌ను కూడా పొదుపుగా వినియోగించుకోవాలని, ప్రతి ఒక్కరూ నీటి సంరక్షణను సామాజిక బాధ్యతగా భావించాలని పిలుపునిచ్చారు. ప్రజల తాగునీటి అవసరాలు, రైతుల జీవనాధారం వంటి సున్నితమైన అంశాలపై ప్రతిపక్షాలు రాజకీయ లబ్ధి కోసం ప్రజల సెంటిమెంట్‌తో ఆడుకోవడం సరికాదని, ప్రజలకు వాస్తవ పరిస్థితులను తెలియజేస్తూ సమస్యల పరిష్కారానికి అందరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని అన్నారు.భూగర్భ జలాల సంరక్షణ, నీటి పొదుపు, ప్రతి ఇంటికి సురక్షిత మంచినీటి సరఫరా లక్ష్యంగా అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని అన్నారు.

printed by SHIVA D , published by SHIVA D and owned by SHIVA PRASAD , printed at Rathna graphics offset printers, 2-3-703/7, Tirumala nagar colony ,Ambeerpet, police line hyd-500013 TS.
published at door no: 5-12, badyathand, Noothanakal mandal, thallasingaram, suryapet- 508221 TS, editor: SHIVA PRASAD. gmail : mivartanews@gmail.com, cell : 9515342857, TGBIL/25/A0512

తల్లి, ఇద్దరు చిన్నారుల మృతి కేసులో నలుగురు నిందితుల అరెస్ట్

నర్సంపేట నవంబర్ 11(మల్లేష్ నమస్తే భారత్) :

పాఖాల చెరువులో తల్లి తన ఇద్దరు చిన్నారులతో కలిసి దూకి ఆత్మహత్యకు పాల్పడిన ఘటనకు సంబంధించి నలుగురు నిందితులను పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు దుగ్గొండి సీఐ జె. శంకర్ రావు తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. గీసుగొండ మండలం ఎలుకుర్తి హవేలీ గ్రామానికి చెందిన ఈరెల్లి సుమన్ తో హసన్ పర్తి మండలం బైరాన్ పల్లికి చెందిన కల్లెబోయిన మమతకు 16-04-2021 ప్రేమ వివాహం జరిగింది. వీరికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. గత కొంతకాలంగా భర్త సుమన్ వేరే మహిళతో వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నాడనే అనుమానంతో భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరుగుతున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ క్రమంలో నవంబర్ 6న రాత్రి ఎలుకుర్తి హవేలికి చెందిన కొందరు వ్యక్తులు మమత ను దూషించి, బెదిరించినట్లు విచారణలో వెల్లడైంది. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన మమత నవంబర్ 7న ఉదయం తన ఇద్దరు చిన్నారులతో కలిసి ఖానాపురం మండలంలోని పాఖాల చెరువులో దూకి ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటనలో తల్లి ఇద్దరు చిన్నారులు మృతి చెందారు. మృతురాలి తల్లి కల్లెబోయిన రజిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. విచారణలో భర్త ఈరెల్లి సుమన్‌తో పాటు ఆకునూరి మౌనిక , ఆకునూరి శంకర్, ఆకునూరి రాజు ,ఆకునూరి రఘుపతి మరికొందరి పాత్ర ఉన్నట్లు గుర్తించడం జరిగిందన్నారు. ఈమేరకు ఈరెల్లి సుమన్‌తో పాటు ఆకునూరి మౌనిక , ఆకునూరి శంకర్, ఆకునూరి రాజు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.పరారీలో ఉన్న మరికొందరిని పట్టుకుని కోర్టులో హాజరుపర్చడం జరుగుతుందన్నారు. కుటుంబ సమస్యలు, వేధింపులు ఎదురైనప్పుడు మనస్తాపానికి గురై ఆత్మహత్యలకు పాల్పడవద్దని, ధైర్యంగా పోలీసులను సంప్రదించాలని సూచించారు. మహిళలు తమ సమస్యలను పోలీసుల దృష్టికి తీసుకువస్తే విచారించి న్యాయం చేస్తామని దుగ్గొండి సీఐ జె. శంకర్ రావు భరోసా ఇచ్చారు.

సీసీ కెమెరా వంద మందితో సమానం

- నేరాల నియంత్రణకే సీసీ కెమెరాల ఏర్పాటు చేయాలి..

- నేరాల నియంత్రణకే సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని

రేగొండ ఎస్సై సుధాకర్ గ్రామస్తులకు వివరించారు



నవంబర్12,11,2026 పరకాల ప్రతినిధి మన మీ వార్త

భూపాలపల్లి జయశంకర్ జిల్లా రేగొండ మండలం రూపిరెడ్డి పల్లి గ్రామంలో గ్రామస్తులతో సి సి కెమెరాల ఏర్పాటు కొరకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీసీ కెమెరాల వల్ల నేరాల నియంత్రణతో పాటూ ఏదైనా సంఘటనలు జరిగిన ప్పుడు వ్యక్తులను గుర్తించడం సులభం అవుతుందన్నారు. మండలంలో అన్నీ గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది ఉన్నారు.

ఈ నెల 13న 'టామ్‌కామ్' ఆధ్వర్యంలో విదేశీ ఉద్యోగ అవకాశాల నమోదు కార్యక్రమం

మన మీ వార్త నవంబర్ 11 వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి.



తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ కార్మిక, ఉపాధి, శిక్షణ మరియు కర్మాగారాల శాఖ పరిధిలోని తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ లిమిటెడ్' (TOMCOM)
ఆధ్వర్యంలో మహబూబాబాద్ జిల్లాలో విదేశీ ఉద్యోగాల కోసం అభ్యర్థుల నమోదు కార్యక్రమం నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి అధికారి రజిత నేడు ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ రాష్ట్రానికి చెందిన అర్హత, నైపుణ్యం మరియు సెమీ-స్కిల్డ్ కలిగిన కార్మికులకు జర్మనీ, యూకే, ఇజ్రాయెల్, ఆస్ట్రియా, పోలాండ్, సౌదీ అరేబియా, మారిషస్, దుబాయ్ తదితర దేశాల్లో ఉపాధి అవకాశాలు కల్పించడమే సంస్థ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.
ఈ ప్రత్యేక నమోదు కార్యక్రమం నవంబర్ 13, 2026న మహబూబాబాద్‌లోని ఎస్సీ కార్యాలయ ప్రాంగణంలోని ఏటీసీ (ATC) లో నిర్వహించబడుతుంది. విదేశాల్లో ఉద్యోగం చేయాలనే ఆసక్తి మరియు అర్హత ఉన్న అభ్యర్థులందరూ ఈ సదస్సుకు హాజరై అంతర్జాతీయ ఉద్యోగ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అభ్యర్థులు సురక్షితమైన మరియు చట్టబద్ధమైన వలస మార్గాల ద్వారా విదేశాలకు వెళ్లేందుకు టామ్‌కామ్ ద్వారా నమోదు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాల కోసం అధికారిక వెబ్‌సైట్ www.tomcom.telangana.gov.in ను సందర్శించాలని లేదా హెల్ప్‌లైన్ నంబర్ 080 3552 4946 ను సంప్రదించాలని అధికారి ఈ సందర్భంగా పేర్కొన్నారు.

హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి ని మర్యాదపూర్వకంగా కలిసిన ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ పవన్



మన మీ వార్త నవంబర్ 11 వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి.

హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లో జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయిని ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ ఎం.పవన్ బుధవారం మర్యాద పూర్వకంగా కలిసి మొక్కను అందించారు. హనుమకొండ లోని జవహర్ లాల్ నెహ్రూ స్టేడియంలో డిసెంబర్ నెలలో జరుగునున్న ఖేలో ఇండియా యూత్ గేమ్స్ పర్యవేక్షణ నిమిత్తం ప్రభుత్వం నియమించగా జిల్లా కలెక్టర్ ను ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ పవన్ మర్యాద పూర్వకంగా కలవగా జిల్లా కలెక్టర్ శుభాకాంక్షలు తెలియజేశారు.

హనుమకొండ తెలంగాణ బిడ్డలు ప్రపంచాన్ని శాసించేలా విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తెచ్చాం







- దేశంలో ఎక్కడా లేని విధంగా యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్, తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ ఏర్పాటు

- 27 లక్షల మంది విద్యార్థులకు ఏకకాలంలో బ్రేక్‌ఫాస్ట్

తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు బట్టి విక్రమార్క

మన మీ వార్త నవంబర్11 వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి.

ఇది దేశంలోనే కాదు, ప్రపంచంలోనే ప్రత్యేకం తెలంగాణలో పుట్టిన ప్రతి బిడ్డకు నాణ్యమైన విద్య అందించడమే ప్రభుత్వ లక్ష్యం తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క
వరంగల్ పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని కాజీపేటలోని ప్రభుత్వ బాలుర పాఠశాలలో తెలంగాణ పబ్లిక్ స్కూల్ భవన నిర్మాణానికి వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య, ఎమ్మెల్సీ బస్వరాజ్ సారయ్య, స్థానిక వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు, రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య,కుడా చైర్ పర్సన్ గుండు సుధారాణి, జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి, తదితరులతో కలిసి శంకుస్థాపన చేసిన డిప్యూటీ సీఎం తెలంగాణలో పుట్టిన ప్రతి బిడ్డ ఉన్నత విద్యను అభ్యసించి, భవిష్యత్తులో ప్రపంచాన్ని శాసించే స్థాయికి ఎదగాలన్నదే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. బుధవారం హనుమకొండ జిల్లా వరంగల్ పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని కాజీపేటలోని ప్రభుత్వ బాలుర పాఠశాలలో తెలంగాణ పబ్లిక్ స్కూల్ భవన నిర్మాణానికి వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య, ఎమ్మెల్సీ బస్వరాజ్ సారయ్య, స్థానిక వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు, రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య,కుడా చైర్ పర్సన్ గుండు సుధారాణి, జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి, తదితరులతో కలిసి డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క శంకుస్థాపన చేశారు. ముందుగా...భారతరత్న, దేశ తొలి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం పాఠశాల ప్రాంగణంలో నిర్మించే తెలంగాణ పబ్లిక్ స్కూల్ భవన నిర్మాణానికి సంబంధించిన మ్యాపులను ఉపముఖ్యమంత్రి పరిశీలించారు.
ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ..
మహాత్మా గాంధీ స్ఫూర్తి, మౌలానా అబుల్ కలాం ఆజాద్ ఆశయాలకు అనుగుణంగా దేశంలో మరెక్కడా లేని విధంగా రాష్ట్రంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్, తెలంగాణ పబ్లిక్ స్కూల్స్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేస్తోందని తెలిపారు.
విద్య ద్వారానే సమాజంలో సమానత్వం, అభివృద్ధి సాధ్యమని, అందుకే విద్యారంగానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తోందని పేర్కొన్నారు.
? దేశ తొలి విద్యాశాఖ మంత్రిగా మౌలానా అబుల్ కలాం ఆజాద్ విద్యారంగ అభివృద్ధికి బలమైన పునాదులు వేశారని, వయోజన విద్యతో పాటు శాస్త్రీయ పరిజ్ఞానానికి ప్రాధాన్యతనిస్తూ దేశ విద్యావ్యవస్థకు గొప్ప దిశానిర్దేశం చేశారని గుర్తుచేశారు. ఆయన జయంతి సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా నివాళులర్పించడంతో పాటు, ఆయన ఆశయాలను ఆచరణలో ముందుకు తీసుకెళ్లేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.
? రాష్ట్ర ప్రభుత్వం సామాజిక, ఆర్థిక, రాజకీయ, ఉపాధి అంశాలతో కూడిన సమగ్ర కులగణన సర్వే నిర్వహించిందని తెలిపారు. ఈ సర్వే విశ్లేషణలో సమాజంలోని వివిధ కుటుంబాలు, కులాలు, వర్గాల అభివృద్ధిలో విద్య కీలక పాత్ర పోషిస్తోందని స్పష్టమైందన్నారు. ఈ నేపథ్యంలోనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం విద్యారంగంపై ప్రత్యేక దృష్టి సారించి, ప్రపంచంలోని అభివృద్ధి చెందిన తొలి పది దేశాలతో పోటీపడే స్థాయికి తెలంగాణ విద్యావ్యవస్థను తీర్చిదిద్దాలని సంకల్పించిందని చెప్పారు.
మహాత్మా గాంధీ ప్రారంభించిన 'యంగ్ ఇండియా' పత్రిక స్ఫూర్తితో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్‌ను ప్రభుత్వం నిర్మిస్తోందని వివరించారు. ఒక్కో పాఠశాలను 20 నుంచి 25 ఎకరాల విస్తీర్ణంలో, అంతర్జాతీయ ప్రమాణాలతో, ఇంగ్లిష్ మీడియంలో ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, ఓసీ వర్గాలకు చెందిన విద్యార్థులంతా ఒకే ప్రాంగణంలో కలిసి చదువుకునేలా ఈ పాఠశాలలను రూపొందిస్తున్నామన్నారు. 12వ తరగతి వరకు ఒకే విద్యా ప్రాంగణంలో విద్యనభ్యసించేలా, ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బందికి కూడా వసతి కల్పించేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు రూ.200 కోట్ల చొప్పున 105 యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్‌ను ప్రభుత్వం మంజూరు చేసిందని, నిర్మాణ పనులు వేగంగా కొనసాగుతున్నాయని తెలిపారు.వచ్చే విద్యా సంవత్సరం నాటికి వీటిలో అనేక పాఠశాలలను ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు.
?ప్రతి నియోజకవర్గానికి తెలంగాణ పబ్లిక్ స్కూల్ ?ప్రభుత్వం మరో కీలక కార్యక్రమంగా తెలంగాణ పబ్లిక్ స్కూల్స్‌ను ప్రవేశపెట్టిందని తెలిపారు.
ప్రతి శాసనసభ నియోజకవర్గానికి ఒక పాఠశాలను మంజూరు చేశామని, ప్రీ-ప్రైమరీ నుంచి 12వ తరగతి వరకు ఇంగ్లిష్ మీడియంలో విద్య అందించేలా వీటిని అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. డిజిటల్ విద్య, ఆధునిక బోధనా పద్ధతులు, ఉపాధ్యాయులకు ప్రత్యేక శిక్షణతో పాటు విద్యార్థులకు అవసరమైన అన్ని సదుపాయాలను కల్పిస్తామన్నారు. ఈ పాఠశాలలు సెమీ రెసిడెన్షియల్ విధానంలో పనిచేస్తాయని వివరించారు. విద్యార్థులకు యూనిఫాం, బూట్లు, టై, పుస్తకాలు, నోట్‌బుక్స్, బ్యాగులు అందించడంతో పాటు ఇంటి నుంచి పాఠశాలకు, తిరిగి ఇంటికి చేరుకునేలా ప్రభుత్వమే రవాణా సదుపాయం కల్పిస్తుందని తెలిపారు. ఉదయం అల్పాహారం, మధ్యాహ్న భోజనం పాఠశాలలోనే అందిస్తామని, క్రీడలు, ఇతర కార్యకలాపాల అనంతరం సాయంత్రం విద్యార్థులను ఇంటికి చేర్చుతామన్నారు. పిల్లలు తల్లిదండ్రులతో గడిపే సమయాన్ని, కుటుంబ అనుబంధాలను కోల్పోకూడదనే ఉద్దేశంతోనే సెమీ రెసిడెన్షియల్ విధానాన్ని రూపొందించామని చెప్పారు. ఒకవైపు నాణ్యమైన విద్య, మరోవైపు కుటుంబ బంధాలకు ప్రాధాన్యతనిస్తూ ఈ పాఠశాలలను తీర్చిదిద్దుతున్నామని వివరించారు.
ప్రపంచంలోనే ఎక్కడ లేని విధంగా27 లక్షల మంది విద్యార్థులకు ఒకేసారి అల్పాహారం రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న సుమారు 27 లక్షల మంది విద్యార్థులకు ఈ ఏడాది నుంచి ఉదయం అల్పాహార పథకాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. ప్రభుత్వ, జిల్లా పరిషత్, మున్సిపల్, రెసిడెన్షియల్ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులందరికీ ఈ పథకం వర్తిస్తుందన్నారు. అత్యంత పరిశుభ్రమైన వాతావరణంలో సెంట్రలైజ్డ్ కిచెన్ల ద్వారా అల్పాహారాన్ని తయారుచేసి, ఉదయం 8.30 నుంచి 9.30 గంటల మధ్య అన్ని పాఠశాలలకు సరఫరా చేస్తున్నామని చెప్పారు.?ఒక గంట వ్యవధిలో 27 లక్షల మంది విద్యార్థులకు అల్పాహారం అందించడం దేశంలోనే కాకుండా ప్రపంచంలోనూ ప్రత్యేకమైన కార్యక్రమమని పేర్కొన్నారు. వైద్య నిపుణుల సూచనల మేరకు పోషక విలువలతో కూడిన అల్పాహారాన్ని అందిస్తున్నామని, వారంలో ఆరు రోజులు అల్పాహారంతో పాటు ప్రత్యామ్నాయ రోజుల్లో పాలు, రాగిజావ కూడా ఇస్తున్నామని తెలిపారు. విద్యను ప్రోత్సహించడం ద్వారానే సమాజం అభివృద్ధి చెందుతుందని, తెలంగాణ బిడ్డలు ప్రపంచంలోని అన్ని రంగాల్లో అత్యున్నత స్థానాలకు చేరుకోవాలన్న లక్ష్యంతోనే ప్రభుత్వం ఈ నిర్ణయాలు తీసుకుంటోందని భట్టి విక్రమార్క చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లో కల్పిస్తున్న ఆధునిక సదుపాయాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని మీడియా ప్రతినిధులను కోరారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి, ప్రభుత్వం కల్పిస్తున్న విద్యా అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.
? ఈ సందర్భంగా వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ హనుమకొండ నగరం తో పాటు కాజీపేట అభివృద్ధి పై ప్రత్యేక దృష్టిని సారించినట్లు తెలిపారు. ఇందులో భాగంగానే తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఏర్పాటు జరుగుతుందన్నారు.
తెలంగాణ పబ్లిక్ స్కూల్ ప్రారంభోత్సవానికి విచ్చేసిన రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కకు హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి, టీజీ ఎన్పీడీసీఎల్ సిఎండి వరుణ్ రెడ్డి, వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత, ఇతర ఉన్నతాధికారులు పుష్పగుచ్ఛాలు, మొక్కలను అందించి ఘనంగా స్వాగతం పలికారు.
ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి గిరిరాజ్ గౌడ్, హనుమకొండ ఆర్డిఓ వెంకటేష్, స్థానిక తహసిల్దార్ రాజు, ఇతర అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చిట్యాల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి మాదిగలకే కేటాయించాలి

--జనాభా ప్రాతిపదికన మాదిగలకు అవకాశం కల్పించాలి

-- ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నాయకుల డిమాండ్

టేకుమట్ల నవంబర్ 11 (మన మీ వార్త)

చిట్యాల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవిని మాదిగ సామాజిక వర్గానికి కేటాయించాలని ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ జిల్లా నాయకులు రామ్ రామ్ చందర్ మాదిగ, టేకుమట్ల మండల ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు మచ్చ శ్రీకాంత్ మాదిగ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కోరారు.చిట్యాల, మొగుళ్లపల్లి, టేకుమట్ల మండలాల పరిధిలో మాదిగ సామాజిక వర్గానికి గణనీయమైన జనాభా ఉందని, జనాభా ప్రాతిపదికన వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవిని మాదిగలకు కేటాయించాలని వారు డిమాండ్ చేశారు. సామాజిక



న్యాయం, సమాన అవకాశాల దిశగా కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి మాదిగ సామాజిక వర్గం ఎంతో కష్టపడి పనిచేసిందని నాయకులు పేర్కొన్నారు. పార్టీ జెండాలు కట్టడం మొదలుకొని, ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడం, ఎన్నికల ప్రచార కార్యక్రమాల్లో పాల్గొనడం వరకు ప్రతి దశలో మాదిగలు తమ వంతు కృషి చేశారని తెలిపారు. పార్టీ విజయానికి క్షేత్రస్థాయిలో మాదిగ కార్యకర్తలు చేసిన సేవలు మరువలేనివని అన్నారు. ఎన్నికల సమయంలో పార్టీ కోసం కష్టపడిన సామాజిక వర్గాలకు పదవుల కేటాయింపులో తగిన గుర్తింపు, ప్రాధాన్యత ఇవ్వాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని వారు పేర్కొన్నారు. మాదిగల జనాభా, రాజకీయ సేవలు, సామాజిక న్యాయాన్ని పరిగణనలోకి తీసుకొని చిట్యాల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవిని మాదిగ సామాజిక వర్గానికి కేటాయించాలని కోరారు.కాంగ్రెస్ ప్రభుత్వం మాదిగల ఆకాంక్షలను గుర్తించి సానుకూల నిర్ణయం తీసుకోవాలని, చైర్మన్ పదవి విషయంలో మాదిగలకు న్యాయం చేయాలని ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నాయకులు విజ్ఞప్తి చేశారు.

అమీన్‌పూర్‌లో ఘనంగా సదర్ ఉత్సవం -- 2026

- మెండే కుటుంబం ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో ముఖ్య అతిథిగా పాల్గొన్న బీఆర్ఎస్ రాష్ట్ర నాయకురాలు కాట సునీత

పటాన్‌చెరు, నవంబర్ 11, మీ వార్త ప్రతినిధి:



అమీన్‌పూర్‌లో మెండే కుటుంబం ఆధ్వర్యంలో నిర్వహించిన సదర్ ఉత్సవం -- 2026 వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ రాష్ట్ర నాయకురాలు శ్రీమతి కాట సునీత ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా నిర్వాహకులు, స్థానిక ప్రజలతో కలిసి ఆమె సదర్ ఉత్సవ వేడుకల్లో పాల్గొన్నారు. యాదవ సోదరులతో ఆత్మీయంగా మమేకమై సందడి చేశారు.అనంతరం కాట సునీత మాట్లాడుతూ.. సదర్ ఉత్సవం యాదవ సోదరుల సంస్కృతి, సంప్రదాయాలు, ఐక్యతకు ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. తరతరాలుగా వస్తున్న ఇటువంటి సంప్రదాయాలను భావితరాలకు అందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. అమీన్‌పూర్‌లో సదర్ ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించిన మెండే కుటుంబ సభ్యులు, నిర్వాహకులకు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో అమీన్‌పూర్‌కు చెందిన పలువురు స్థానిక ప్రజలు, యాదవ సోదరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణంలో యువత కీలక పాత్ర పోషించాలి

-- వరంగల్ సీపీ ఎన్. శ్వేత, ఐపీఎస్

మన మీ వార్త నవంబర్ 11వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి.

వరంగల్‌లోని కాకతీయ వైద్య కళాశాల వార్షికోత్సవాలు 'ఉత్కర్ష్-2026'లో భాగంగా నవంబర్ 11 నుంచి 17వ తేదీ వరకు నిర్వహిస్తున్న కార్యక్రమాల్లో భాగంగా, నశా ముక్త్ భారత్ అభియాన్‌పై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు బుధవారం కళాశాల విద్యార్థులు హెల్త్ రన్, హెల్త్ వాక్ నిర్వహించారు.





బుధవారం ఉదయం 6:30 గంటలకు కాకతీయ వైద్య కళాశాల నుంచి హనుమకొండ పోలీస్ హెడ్‌క్వార్టర్స్ వరకు నిర్వహించిన ఈ కార్యక్రమానికి వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత, ఐపీఎస్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రంలో ప్రముఖ విద్యాసంస్థగా గుర్తింపు పొందిన కాకతీయ వైద్య కళాశాల విద్యార్థుల ద్వారా డ్రగ్స్ వ్యతిరేక సందేశం సమాజంలోని అన్ని వర్గాలకు, ముఖ్యంగా యువతకు చేరడం అభినందనీయమన్నారు. మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని, డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణంలో యువత చురుకైన పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. మాదకద్రవ్యాల నిర్మూలన అనేది ఒక్క పోలీసు శాఖ బాధ్యత మాత్రమే కాదని, సమాజంలోని ప్రతి ఒక్కరూ బాధ్యతగా ముందుకు వచ్చి ఈ ఉద్యమంలో భాగస్వాములు కావాలని సూచించారు. అనంతరం విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు.

అనంతరం సీపీ ఆధ్వర్యంలో నిర్వహించిన హెల్త్ రన్, హెల్త్ వాక్ కాకతీయ వైద్య కళాశాల నుంచి పోలీస్ హెడ్‌క్వార్టర్స్ వరకు కొనసాగింది. మార్గమధ్యంలోని సీపీఓ జంక్షన్‌లో వైద్య కళాశాల విద్యార్థులు నాటక, నృత్య ప్రదర్శనల ద్వారా మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలను ప్రజలకు వివరించారు. అనంతరం పోలీస్ హెడ్‌క్వార్టర్స్ పరేడ్ గ్రౌండ్‌లో పెద్ద సంఖ్యలో పాల్గొన్న విద్యార్థులు 'ఝుఎ చీశ్ శీ ణతీబస్త్రం' నినాదంతో మానవహారం ఏర్పాటు చేసి, డ్రగ్స్‌కు వ్యతిరేకంగా తమ ఐక్యతను, సంకల్పాన్ని చాటారు.

ఈ కార్యక్రమంలో సెంట్రల్ జోన్ డీసీపీ ధార కవిత, వరంగల్ ఇన్‌చార్జి ఏసీపీ నరసింహారావు, హనుమకొండ, మట్టెవాడ ఇన్‌స్పెక్టర్లు మచ్చ శివకుమార్, కర్ణాకర్, డ్రగ్ కంట్రోల్ టీమ్ ఇన్‌స్పెక్టర్ సాయిరమణ, కాకతీయ వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ డి.మోహన్ దాస్, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ ప్రవీణ్, హెల్త్ రన్ కోఆర్డినేటర్లు షణ్ముఖ్, వసంత్, కాకతీయ వైద్య కళాశాల, ప్రభుత్వ నర్సింగ్ కళాశాల విద్యార్థులు కలిపి సుమారు 600 మంది పాల్గొన్నారు.

తల్లి, ఇద్దరు చిన్నారుల మృతి కేసులో నలుగురు నిందితుల అరెస్ట్

- దుగ్గొండి సీఐ శంకర్ రావు

నర్సంపేట నవంబర్ 11(మీవార్త ప్రతినిధి) :

పాఖాల చెరువులో తల్లి తన ఇద్దరు చిన్నారులతో కలిసి దూకి ఆత్మహత్యకు పాల్పడిన ఘటనకు సంబంధించి నలుగురు నిందితులను పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు దుగ్గొండి సీఐ జె. శంకర్ రావు తెలిపారు.

సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. గీసుగొండ మండలం ఎలుకుర్తి హవేలీ గ్రామానికి చెందిన ఈరెల్లి సుమన్ తో హసన్ పర్తి మండలం బైరాన్ పల్లికి చెందిన కల్లెబోయయిన మమతకు 16-04-2021 ప్రేమ వివాహం జరిగింది. వీరికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. గత కొంతకాలంగా భర్త సుమన్ వేరే మహిళతో వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నాడనే అనుమానంతో భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరుగుతున్నట్లు పోలీసులు తెలిపారు.

ఈ క్రమంలో నవంబర్ 6న రాత్రి ఎలుకుర్తి హావేలికి చెందిన కొందరు వ్యక్తులు మమత ను దూషించి, బెదిరించినట్లు విచారణలో వెల్లడైంది. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన మమత నవంబర్ 7న ఉదయం తన ఇద్దరు చిన్నారులతో కలిసి ఖానాపురం మండలంలోని పాఖాల చెరువులో దూకి ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటనలో తల్లి ఇద్దరు చిన్నారులు మృతి చెందారు. మృతురాలి తల్లి కల్లెబోయిన రజీత ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. విచారణలో భర్త ఈరెల్లి సుమన్‌తో పాటు ఆకునూరి మౌనిక , ఆకునూరి శంకర్, ఆకునూరి రాజు



,ఆకునూరి రఘుపతి మరికొందరి పాత్ర ఉన్నట్లు గుర్తించడం జరిగిందన్నారు. ఈమేరకు ఈరెల్లి సుమన్‌తో పాటు ఆకునూరి మౌనిక , ఆకునూరి శంకర్, ఆకునూరి రాజు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.పరారీలో ఉన్న మరికొందరిని పట్టుకుని కోర్టులో హాజరుపర్చడం జరుగుతుందన్నారు. కుటుంబ సమస్యలు, వేధింపులు ఎదురైనప్పుడు మనస్తాపానికి గురై ఆత్మహత్యలకు పాల్పడవద్దని, ధైర్యంగా పోలీసులను సంప్రదించాలని సూచించారు. మహిళలు తమ సమస్యలను పోలీసుల దృష్టికి తీసుకువస్తే విచారించి న్యాయం చేస్తామని దుగ్గొండి సీఐ జె. శంకర్ రావు భరోసా ఇచ్చారు.

ఘనంగా మైనార్టీ వెల్ఫేర్ డే, మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి వేడుకలు

- సూర్యాపేట జిల్లా కలెక్టరేట్‌లో ఘనంగా నిర్వహణ

మీ వార్త నవంబర్ 11 సూర్యాపేట జిల్లా ప్రతినిధి

సూర్యాపేట జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో మైనార్టీ వెల్ఫేర్ డే మరియు భారత తొలి విద్యాశాఖ మంత్రి, స్వాతంత్ర్య సమరయోధుడు మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మౌలానా అబుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా



జాయింట్ కలెక్టర్ హరి సింగ్ నాయక్ మాట్లాడుతూ మౌలానా అబుల్ కలాం ఆజాద్ దేశానికి అందించిన సేవలను కొనియాడారు. విద్యాభివృద్ధి, జాతీయ సమైక్యత, మైనార్టీల సంక్షేమం కోసం ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని పేర్కొన్నారు. ఆజాద్ ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో మైనార్టీ అధికారి విశాల ధార, మున్సిపల్ వైస్ చైర్మన్ షఫీ ఉల్లా, కౌన్సిలర్లు తాహిర్, జహీర్, కుమ్మరి కుంట్ల వేణు, అంజద్‌అలీ, ఖలీల్ అహ్మద్, షేక్ తాహీర్, ఎస్.కె. జహంగీర్, ఖలీద్ అహ్మద్ , అస్రార్ ,కరాటే సయ్యద్, అస్రార్ నోమాని, తదితరులు, జిల్లా మైనార్టీ నాయకులు కలెక్టరేట్ మైనార్టీ ఉద్యోగులు గిరి ,చంద్రు, పాల్గొన్నారు.

హోటల్స్‌కు మద్దతుగా ఓవైసీ

హైదరాబాద్ : భాగ్యనగరంలో ఇటీవల కాలంలో టీజీ సేఫ్ నిర్వహిస్తున్న ఆకస్మిక తనిఖీలతో హోటళ్ల యజమానులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. వారికి మజ్లిస్ పార్టీ అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ బాహాటంగా మద్దతుగా నిలిచారు. ట్విన్ సిటీస్ హోటల్ ఓనర్స్ అసోసియేషన్ ప్రతినిధి బృందంతో కలిసి ఆయన తెలంగాణ సేఫ్ కమిషనర్ అవినాష్ మొహంతిని కలిశారు. నగరవ్యాప్తంగా ఆహార భద్రతా అధికారులు చేపడుతున్న తనిఖీలు పారదర్శకంగా, నిష్పాక్షికంగా, చట్టబద్ధమైన నియమ నిబంధనలకు లోబడి మాత్రమే సాగాలని, వ్యాపారులను భయభ్రాంతులకు గురిచేసే ధోరణికి స్వస్తి పలకాలని ఈ సందర్భంగా కమిషనర్‌ను ఆయన గట్టిగా కోరారు.తనిఖీల పేరిట నిబంధనలను అతిక్రమించి ఏకపక్ష చర్యలకు పాల్పడటం సరికాదని అసదుద్దీన్ నేతృత్వంలోని బృందం ఉన్నతాధికారి దృష్టికి తీసుకెళ్లింది. నిబంధనల ప్రకారం ఏదైనా హోటల్‌లో లోపాలు కనిపిస్తే.. వెంటనే తీవ్ర చర్యలు తీసుకోకుండా తొలుత ఇంప్రూవ్‌మెంట్ నోటీసు జారీ చేసి నిర్ణీత గడువు ఇవ్వాల్సి ఉంటుందని గుర్తుచేశారు. ఆ చట్టబద్ధమైన ప్రక్రియను దాటవేసి సోషల్ మీడియాలో విజువల్స్ విడుదల చేయడం, వ్యాపార సంస్థల ప్రతిష్టను మసకబార్చడం ఆమోదయోగ్యం కాదని స్పష్టం చేశారు.హైదరాబాద్‌కు ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఆహార సంస్కృతి, గుర్తింపును పరిరక్షించడంలో హోటల్ రంగం కీలక పాత్ర పోషిస్తోందని అసదుద్దీన్ వర్గం పేర్కొంది. వేలాది మంది కార్మికులు, చిరువ్యాపారుల జీవనోపాధి ఈ రంగంపై ఆధారపడి ఉన్న వేళ.. కేవలం చిన్నపాటి లోపాలను సైతం భూతద్దంలో చూపిస్తూ హోటళ్లను సీజ్ చేయడం లేదా లైసెన్సులు రద్దు చేయడం వల్ల స్థానిక ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రతికూల ప్రభావం పడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఆహార నాణ్యతను కాపాడటానికి తాము వ్యతిరేకం కాదని, అయితే అధికారుల వైఖరి పారదర్శకంగా, సమానంగా ఉండాలే తప్ప.. ఎంపిక



చేసుకున్న కొన్ని సంస్థలనే లక్ష్యంగా చేసుకుని వేధించేలా ఉండకూడదని వ్యాపారులు వాపోయారు.పౌరుల ఆరోగ్య పరిరక్షణ ఎంత ముఖ్యమో, వ్యాపారాలు గౌరవప్రదంగా సాగే వాతావరణం కల్పించడం కూడా అంతే ఆవశ్యకమని అసదుద్దీన్ అంటున్నారు.

మెద్చల్ ఆర్టీఓ కార్యాలయంలో రోడ్డు ప్రమాదం.. రిటైర్డ్ ఎస్ఐకి తీవ్ర గాయాలు

డ్రైవింగ్ టెస్ట్‌లో నిర్లక్ష్యంగా కారు నడిపి పలువురిని ఢీకొన్న వ్యక్తి

మీ వార్త / కుత్బుల్లాపూర్ :



డ్రైవింగ్ లైసెన్స్ రెన్యువల్ కోసం ఆర్టీఓ కార్యాలయానికి వెళ్లిన ఓ రిటైర్డ్ ఎస్ఐ రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. డ్రైవింగ్ టెస్ట్‌లో పాల్గొన్న వ్యక్తి నిర్లక్ష్యంగా కారు నడపడంతో రిటైర్డ్ ఎస్ఐతో పాటు ఆయన స్నేహితులు గాయపడ్డారు. ఈ ఘటన మెద్చల్ ఆర్టీఓ కార్యాలయంలో బుధవారం చోటుచేసుకుంది.

వివరాల్లోకి వెళితే.. ఈ నెల 11న మధ్యాహ్నం కుతుకూర్ నీలం రెడ్డి (68), రిటైర్డ్ ఎస్ఐ, డ్రైవింగ్ లైసెన్స్ రెన్యువల్ కోసం మెద్చల్ ఆర్టీఓ కార్యాలయానికి వెళ్లారు. ప్రక్రియ పూర్తయిన అనంతరం మధ్యాహ్నం 1.30 గంటల సమయంలో డ్రైవింగ్ టెస్ట్ రేంజ్ పక్కన తన స్నేహితులు పి. సురేష్, పి. బాను ప్రసాద్, బాలు మహేందర్‌లతో కలిసి నిలబడి ఉన్నారు. అదే సమయంలో డ్రైవింగ్ టెస్ట్‌లో పాల్గొంటున్న ఎస్. శంకర్ రావు తన కారు (ఝూ37ఝాఔ2529)ను నిర్లక్ష్యంగా నడిపి అక్కడ ఉన్న వారిని ఢీకొట్టినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు.

ఈ ప్రమాదంలో నీలం రెడ్డి కాలి చీలమండ ఎముక విరగగా, ఆయన స్నేహితులకు కూడా గాయాలయ్యాయి. వెంటనే ఆయనను షాపూర్‌లోని మెడ్‌విజన్ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు శస్త్రచికిత్స అవసరమని తెలిపారు. ఘటనపై పేట్ బషీరాబాద్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

రామచంద్రపురంలో ఘనంగా సదర్ ఉత్సవాలు

- ముఖ్య అతిథిగా పాల్గొన్న పటాన్‌చెరు నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జ్ ఆదర్శ్ రెడ్డి





పటాన్‌చెరు, నవంబర్ 11, మీ వార్త ప్రతినిధి:

యాదవ సోదరుల ఐక్యత, ఆత్మగౌరవం, సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే సదర్ ఉత్సవాలు పటాన్‌చెరు నియోజకవర్గ పరిధిలోని రామచంద్రపురం ప్రాంతంలో ఘనంగా నిర్వహించారు. శ్రీనివాస్ నగర్ కాలనీ మార్కెట్ యార్డులో యాదవ సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకలకు జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్, తెలంగాణ యాదవ కార్పొరేషన్ చైర్మన్ మారబోయిన రఘునాథ్ యాదవ్, పటాన్‌చెరు నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జ్ ఆదర్శ్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు రాగం నాగేందర్ యాదవ్, మెట్టు కుమార్ యాదవ్, పుష్ప నగేష్ యాదవ్, అంజయ్య యాదవ్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కుమార్ గౌడ్, జగన్నాథ్ రెడ్డి, పరమేష్ యాదవ్, భాస్కర్ ముదిరాజ్, ఐలేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.అనంతరం వికాస్ ఏర్పాటు చేసిన సదర్ ఉత్సవాల్లోనూ ముఖ్య అతిథులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా దున్నపోతుల ప్రదర్శనను తిలకించి యాదవ సోదరులకు పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. సదర్ ఉత్సవాలు యాదవుల ఐక్యత, ఆత్మగౌరవం, తరతరాలుగా వస్తున్న సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తాయని పేర్కొన్నారు. యువత విద్య, ఉద్యోగ, వ్యాపార రంగాల్లో రాణిస్తూ అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో యాదవ సంఘాల నాయకులు రమేష్ యాదవ్, నవీన్ యాదవ్, ఉత్సవ కమిటీ సభ్యులు, యువకులు, యాదవ సోదరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

వరంగల్ జిల్లాలో పీసీపీఎన్‌డీటీ (PCPNDT) చట్టం అమలుపై ప్రైవేట్ ఆసుపత్రులు, స్కానింగ్ కేంద్రాల్లో తనిఖీలు

- సృష్టికి మూలం అమ్మ అనేది ప్రతి తల్లి గుర్తుంచుకోవాలి

- ఆడపిల్ల సంఖ్య అంతరించి పోతున్న తరుణం లో ప్రతి తల్లి ఆడపిల్లకు జన్మనిస్తే పునరుత్పత్తి కి మూలాధారం

మన మీ వార్త నవంబర్ 11 వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి.



వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఆదేశాల మేరకు, పీసీపీఎన్‌డీటీ చట్టం అమలులో భాగంగా బుధవారం వరంగల్ జిల్లాలోని ఏడు ప్రైవేట్ ఆసుపత్రులు మరియు స్కానింగ్ కేంద్రాలను జిల్లా పర్యవేక్షణ కమిటీ సభ్యులు తనిఖీ చేశారు.

ఈ తనిఖీల్లో వరంగల్ ఆర్డీఓ సుమ, అభ్యుదయ సేవా సమితి అధ్యక్షులు మండల పరశురాములు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రాజిరెడ్డి , ఎంహెచ్ఎన్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ సాజిదా పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ప్రతి స్కానింగ్ కేంద్రంలోని రికార్డులు, రిజిస్టర్లు, యంత్రాల నిర్వహణ, చట్టపరమైన నిబంధనలను క్షుణ్ణంగా పరిశీలించారు.

ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ, ఎట్టి పరిస్థితుల్లోనూ గర్భస్థ శిశువు లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించకూడదని, శిశువు ఆడా, మగా అనే విషయాన్ని తల్లిదండ్రులకు లేదా ఇతరులకు వెల్లడించకూడదని వైద్యులు, స్కానింగ్ కేంద్రాల నిర్వాహకులకు స్పష్టంగా సూచించారు.

పీసీపీఎన్‌డీటీ చట్టాన్ని 2006 ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని, చట్టాన్ని ఉల్లంఘించిన వారిపై నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కాసిపేట మోడల్ స్కూల్‌లో కెరీర్ గైడెన్స్, వ్యక్తిత్వ వికాస కార్యక్రమం

కాసిపేట, నవంబర్ 11:(మన మీ వార్త మండల ప్రతినిధి)



మండలంలోని తెలంగాణ ఆదర్శ పాఠశాలలో పదో తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థులకు కెరీర్ గైడెన్స్, వ్యక్తిత్వ వికాస కార్యక్రమం నిర్వహించారు. ప్రముఖ మోటివేషనల్ స్పీకర్,



ఇంపాక్ట్ ఫౌండేషన్ సర్టిఫైడ్ ట్రైనర్ మద్దెవేని అర్జున్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్రేరణాత్మక సూచనలు అందించారు. ఈ సందర్భంగా వృత్తి మార్గదర్శకత్వం, పరీక్షలకు సన్నద్ధత, జ్ఞాపకశక్తి పెంపు, సమయ నిర్వహణ, లక్ష్య నిర్దేశం, ఒత్తిడి అధిగమించే పద్ధతులు, విజయ సాధన మార్గాలపై అర్జున్ అవగాహన కల్పించారు. ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకొని, అవరోధాలను అధిగమిస్తూ విజయం సాధించాలని విద్యార్థులకు సూచించారు. విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు.
ప్రిన్సిపాల్ అబ్దుల్ ఖలీల్ మాట్లాడుతూ విద్యార్థులు దురలవాట్లకు దూరంగా ఉండి, క్రమశిక్షణతో చదువుకొని ఉన్నత స్థాయికి చేరుకోవాలని సూచించారు. అనంతరం మద్దెవేని అర్జున్‌ను ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు రాకేష్, నాగమల్లయ్య, శంకర్, విద్యార్థులు ఘనంగా సన్మానించారు.

వైద్య విద్యార్థిని శిరీషకు రాజ్‌గోండ్ ఉద్యోగుల భరోసా.. రూ.80 వేల చేయూత!

– సామాజిక బాధ్యతతో ఒక్కటైన ఉమ్మడి జిల్లా ఉద్యోగులు.. నిరుపేద కుటుంబానికి అండ

కాసిపేట, నవంబర్ 11:(మన మీ వార్త మండల ప్రతినిధి)



పేదరికం వైద్య విద్యకు అడ్డంకి కాకూడదనే సంకల్పంతో రాజ్‌గోండ్ ఉద్యోగులు మానవత్వాన్ని చాటుకున్నారు. నిరుపేద కుటుంబానికి చెందిన వైద్య విద్యార్థిని పెంద్రం శిరీష ఉన్నత చదువులకు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయం తెలుసుకొని ఉమ్మడి మంచిర్యాల, కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లాల రాజ్‌గోండ్ ఉద్యోగులు సమిష్టిగా స్పందించారు. తమ వంతు సహకారంగా రూ.80 వేల ఆర్థిక సాయాన్ని అందించి అండగా నిలిచారు.మంచిర్యాల జిల్లా తాండూర్ మండలం బెజ్జల నర్సాపూర్ గ్రామానికి చెందిన పెంద్రం మోతిరాం, రత్నాబాయి దంపతుల కుమార్తె శిరీష కు వైద్య విద్యలో సీటు లభించింది. అయితే నిరుపేద కుటుంబం కావడంతో వసతి, ఫీజులు, ఇతర విద్యా ఖర్చుల భారం తల్లిదండ్రులకు ఆందోళనగా మారింది. ఈ విషయం సామాజిక మాధ్యమాల ద్వారా తెలుసుకున్న రాజ్‌గోండ్ ఉద్యోగులు స్పందించి సమిష్టిగా విరాళాలు సేకరించారు. అనంతరం తల్లిదండ్రుల సమక్షంలో శిరీషకు రూ.80 వేల నగదును అందజేసి సన్మానించారు.
ఈ కార్యక్రమంలో కే. శ్రీకళ (డీఎం, సివిల్ సప్లై), తొడసం మాలతి (ఉమ్మడి జిల్లా రాజ్‌గోండ్ మహిళా అధ్యక్షురాలు), రాయి సిడం రాము (ఏఈఓ), ఎం. రాము (ఆసిఫాబాద్ జిల్లా కోఆర్డినేటర్), ఎం. శేఖర్ (మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు), ఎం. మోతీరాం (డీటీ, జిల్లా కార్యదర్శి), ఎం. శంకర్ (డీటీ), సోయం జ్ఞానేశ్వర్ (కోశాధికారి), పెంద్రం చందు (ఎస్ పి ఆర్ పి), మడావి బారిక్‌రావ్, ఉపాధ్యాయులు, ఇతర ఉద్యోగులు పాల్గొన్నారు.
నిరుపేద విద్యార్థిని వైద్య విద్యకు ఆర్థిక చేయూతనివ్వడం ద్వారా ఉద్యోగులు తమ సామాజిక బాధ్యతను చాటుకోవడమే కాకుండా, మరెందరికో స్ఫూర్తిగా నిలిచారని పలువురు ప్రశంసించారు.

ములుగు జిల్లా ట్రయాథ్లాన్‌లో ప్రతిభ చాటిన నిఖిల్‌ను అభినందించిన జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు

మన మీ వార్త నవంబర్ 11 వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి.



గోవాలో నిర్వహించిన ఐరన్‌మ్యాన్ 70.3 ట్రయాథ్లాన్ పోటీల్లో ప్రతిభ చాటిన ములుగు జిల్లా యువకుడు వజ్జా నిఖిల్‌ను జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు అభినందించారు.
బుధవారం జిల్లా సమీకృత కలెక్టరేట్‌లోని కలెక్టర్ ఛాంబర్‌లో నిఖిల్ జిల్లా కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.
ములుగు మండలం రాయినిగూడెం గ్రామానికి చెందిన నిఖిల్ గోవాలో ఇటీవల నిర్వహించిన ఐరన్‌మ్యాన్ 70.3 ట్రయాథ్లాన్ పోటీల్లో 1.9 కిలోమీటర్ల ఈత, 90 కిలోమీటర్ల సైక్లింగ్, 21.1 కిలోమీటర్ల పరుగును పూర్తి చేసి సత్తా చాటారు.
ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, పట్టుదల, క్రమశిక్షణతో కృషి చేస్తే క్రీడల్లో ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని అన్నారు. నిఖిల్ సాధించిన విజయం జిల్లాలోని యువతకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. భవిష్యత్తులో మరిన్ని జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీల్లో రాణించి ములుగు జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

ఘనంగా మైనార్టీ వెల్ఫేర్ డే, మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి

మీ వార్త నవంబర్ 11 సూర్యాపేట జిల్లా ప్రతినిధి



సూర్యాపేట జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో మైనార్టీ వెల్ఫేర్ డే,భారత తొలి విద్యాశాఖ మంత్రి, స్వాతంత్ర్య సమరయోధుడు మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మౌలానా అబుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.
ఈ కార్యక్రమానికి మౌలానా ముక్తి అసర్నోమని , మాట్లాడుతూ మౌలానా అబుల్ కలాం ఆజాద్ దేశానికి అందించిన సేవలను కొనియాడారు. విద్యాభివృద్ధి, జాతీయ సమైక్యత, మైనార్టీల సంక్షేమం కోసం ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని పేర్కొన్నారు. ఆజాద్ ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు.
ఈ కార్యక్రమంలో డి బి సి డబ్ల్యూ ఓ విశాల్ ధార, మున్సిపల్ వైస్ చైర్మన్ షఫీ ఉల్లా, కౌన్సిలర్లు తాహిర్, జహీర్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కుమ్మరి కుంట్ల వేణు, మాజీ కౌన్సిలర్ అంజద్‌అలీ, ఖలీల్ అహ్మద్, షేక్ తాహీర్, ఎస్.కె. జహంగీర్, ఖలీద్ అహ్మద్ , అస్రార్ ,కరాటే సయ్యద్, సిద్ధిక్, అస్రార్ నోమాని, డాక్టర్ కృష్ణ బంటు తదితరులు, జిల్లా మైనార్టీ నాయకులు, కలెక్టరేట్ ఉద్యోగులు పాల్గొన్నారు.

ప్రజలకు మేలు జరిగేలా భూముల రీసర్వే ప్రక్రియను పకడ్బందీగా, పారదర్శకంగా నిర్వహించాలి

– రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

మన మీ వార్త నవంబర్ 11 వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి.





నవంబర్ నెలాఖరులోగా ప్రతి జిల్లాలో తొలి విడత రీసర్వే లక్ష్యాన్ని పూర్తి చేయాలి
రీసర్వేలో నాణ్యతకు ప్రాధాన్యత.. తొందర పాటుతో తప్పులకు తావివ్వకూడదు
మండలాల వారీగా ప్రత్యేక సర్వే బృందాలను ఏర్పాటు
లైసెన్స్‌డ్ సర్వేయర్ల సేవలను వినియోగించుకోవాలి
రీసర్వేలో అవకతవకలకు పాల్పడితే సస్పెన్షన్‌తో పాటు క్రిమినల్ కేసులు నమోదు
భూముల రీసర్వే ప్రక్రియపై అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి
రాష్ట్రంలో భూముల రీసర్వే ప్రక్రియను ప్రజలకు మేలు జరిగేలా, సానుకూల వాతావరణంలో పకడ్బందీగా, పారదర్శకంగా నిర్వహించాలని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అధికారులను ఆదేశించారు.
రీసర్వేలో నాణ్యతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, తొందరపాటుతో ఎలాంటి తప్పులు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని స్పష్టం చేశారు.
బుధవారం హైదరాబాద్ నుంచి రెవెన్యూ శాఖ కార్యదర్శి లోకేష్ కుమార్, ఇతర ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో భూముల రీసర్వే ప్రక్రియపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మంత్రి సమీక్ష నిర్వహించారు.
ఈ వీడియో కాన్ఫరెన్స్ లో రాష్ట్ర మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, భూముల రీసర్వే ప్రక్రియపై ఇప్పటికే పలుమార్లు సమావేశాలు నిర్వహించామని, ఉమ్మడి జిల్లాలలో క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ జిల్లా స్థాయి నుంచి మండల స్థాయి వరకు రెవెన్యూ అంశాలపై సమీక్షలు నిర్వహించామని తెలిపారు.
రీసర్వే ఫలితాలు క్షేత్రస్థాయిలో ఎలా ఉన్నాయో తెలుసుకునేందుకు గ్రౌండ్ రిపోర్టులను సేకరిస్తున్నామని పేర్కొన్నారు. రీసర్వే సందర్భంగా ఎదురవుతున్న సమస్యలు, లోపాలు, వాటి పరిష్కార మార్గాలపై సమగ్రంగా చర్చిస్తున్నామని తెలిపారు.
రీసర్వే ఎస్ఓపీని పకడ్బందీగా అమలు చేయాలి
భూముల రీసర్వేకు సంబంధించి రూపొందించిన ప్రామాణిక కార్యాచరణ విధానం (ఎస్ఓపీ)ను అధికారులు పక్కాగా అమలు చేయాలని మంత్రి సూచించారు.
క్షేత్రస్థాయి నివేదికల ఆధారంగా అవసరమైన మార్పులు, సవరణలు చేపట్టాలని తెలిపారు. కేవలం ఉన్నతాధికారులను సంతృప్తిపరిచే నివేదికలు కాకుండా క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితులను ప్రతిబింబించేలా నివేదికలు ఉండాలని స్పష్టం చేశారు.
నవంబర్ నెలాఖరులోగా ప్రతి జిల్లాలో తొలి విడతలో ఎంపిక చేసిన 70 గ్రామాలతో పాటు నక్షా లేని గ్రామాల్లో రీసర్వే ప్రక్రియను పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్ణయించినట్లు తెలిపారు. రీసర్వే పనుల్లో అధికారులు పూర్తి బాధ్యతతో, చిత్తశుద్ధితో వ్యవహరించాలని, సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించుకోవాలని సూచించారు.
మండలాల వారీగా సర్వే బృందాల ఏర్పాటు
ప్రతి మండలంలో రీసర్వే కోసం అవసరమైన ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయాలని మంత్రి ఆదేశించారు. అందుబాటులో ఉన్న లైసెన్స్‌డ్ సర్వేయర్ల సేవలను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని సూచించారు.
రీసర్వే పనులను వేగవంతం చేసేందుకు సర్వే బృందాల సంఖ్యను పెంచాలని తెలిపారు.
రాబోయే ఏడాదిన్నర కాలంలో రాష్ట్ర వ్యాప్తంగా మూడు విడతల్లో భూముల రీసర్వే ప్రక్రియను పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని, ఈ మేరకు జిల్లా కలెక్టర్లు ముందస్తు ప్రణాళికలు రూపొందించుకోవాలని ఆదేశించారు.
రీసర్వేలో పారదర్శకత, నాణ్యత తప్పనిసరి
రీసర్వే జరిగే సమయంలో సంబంధిత గ్రామాల రైతులకు ముందుగానే సమాచారం అందించాలని, స్థానిక రైతుల సమక్షంలోనే సర్వే ప్రక్రియ నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు. రైతులకు ముందస్తుగా నోటీసులు జారీ చేయడంతో పాటు అవసరమైన కౌన్సెలింగ్ నిర్వహించాలని తెలిపారు.
సర్వే నివేదికల పై అభ్యంతరాలు ఎలా సమర్పించాలి, ఎక్కడ సమర్పించాలి, ఏ విధంగా పరిష్కరించబడతాయి అనే అంశాలపై ప్రజలకు ముందుగానే అవగాహన కల్పించాలని ఆదేశించారు.
రీసర్వే పూర్తయిన గ్రామాల్లో సర్వే వివరాలను ప్రజలకు తెలియజేస్తూ దండోరా వేయించాలని, ప్రజల నుంచి అభ్యంతరాలు స్వీకరించేందుకు అవకాశం కల్పించాలని తెలిపారు.
ప్రజలకు రీసర్వే వివరాలు పూర్తిస్థాయిలో తెలియజేయాలని, వచ్చిన అభ్యంతరాలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సూచించారు.
రీసర్వే పూర్తయిన ప్రాంతాల్లో కొత్త పట్టాదారు పాస్ పుస్తకాలను క్యూఆర్ కోడ్‌తో అందించనున్నట్లు మంత్రి తెలిపారు.
ఈ నేపథ్యంలో భూముల సర్వే వివరాలు, రికార్డులు కచ్చితత్వంతో ఉండేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు.
అసైన్డ్ భూముల పట్టాలను క్షుణ్ణంగా పరిశీలించాలి
అసైన్డ్ భూములకు సంబంధించి పట్టాలు అసలైనవా, నకిలీవా అనే అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలని మంత్రి సూచించారు. పట్టా పొందిన వ్యక్తులే ప్రస్తుతం ఆ భూములపై ఆధీనంలో ఉన్నారా లేదా అనే విషయాన్ని నిర్ధారించాలని తెలిపారు. గతంలో ఒకరికి పట్టా ఇచ్చినప్పటికీ ప్రస్తుతం మరొకరు భూమిని అనుభవిస్తున్నట్లయితే, ప్రస్తుత అనుభవదారుడు అర్హుడా కాదా అనే అంశాన్ని నిబంధనల ప్రకారం పరిశీలించాలని ఆదేశించారు.
పట్టాలో పేర్కొన్న విస్తీర్ణానికి, క్షేత్రస్థాయిలో ఉన్న భూమి విస్తీర్ణానికి మధ్య తేడాలు ఉన్నాయా అనే విషయాన్ని కూడా క్షేత్రస్థాయిలో సరిచూసుకోవాలని తెలిపారు.
సాగునీటి చెరువులు, రహదారులు, కుంటలు, ఇతర అభివృద్ధి పనుల కోసం గతంలో భూసేకరణ చేసిన భూములకు సంబంధించిన సర్వే నంబర్లలో ఉన్న సమస్యలను గుర్తించి పరిష్కరించాలని మంత్రి అధికారులను ఆదేశించారు. రీసర్వే ప్రక్రియలో ఎలాంటి సమస్యలు పెండింగ్‌లో ఉండకుండా అన్ని అంశాలను సమగ్రంగా పరిశీలించాలని సూచించారు.
రీసర్వేలో ఏ అధికారి అయినా అక్రమాలకు, అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని, సస్పెన్షన్‌తో పాటు క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని మంత్రి హెచ్చరించారు. ప్రజలకు భవిష్యత్తులో ఎలాంటి భూ వివాదాలు తలెత్తకుండా, రీసర్వే ప్రక్రియను నాణ్యతతో, పారదర్శకంగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు .
జిల్లా కలెక్టరేట్
వీడియో కాన్ఫరెన్స్ హాలు నుండి జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద,అదనపు కలెక్టర్ రెవెన్యూ ఎల్ కిషోర్ కుమార్, డియార్వో విజయలక్ష్మి, వరంగల్ ఆర్డీవో సుమ నర్సంపేట ఆర్డీవో ఉమారాణి తదితరులు పాల్గొన్నారు.

సీఈఓపై దర్యాప్తు ఎఫెక్ట్.. ఒక్కరోజులో ఎన్విడియా మార్కెట్ విలువ రూ.17 లక్షల కోట్లు ఆవిరి!

ప్రపంచంలోనే అత్యంత విలువైన టెక్ కంపెనీల్లో ఒకటైన ఎన్విడియాకు ఒక్కరోజులో భారీ నష్టం వాటిల్లింది. ఆ సంస్థ సీఈఓ జెన్సన్ హువాంగ్‌పై వచ్చిన వివాదాస్పద ఆరోపణలు, కంపెనీ బోర్డు ప్రారంభించిన అంతర్గత దర్యాప్తు ఇన్వెస్టర్లలో ఆందోళనకు కారణమయ్యాయి. దీంతో అమెరికా స్టాక్ మార్కెట్‌లో సోమవారం ఎన్విడియా షేర్లు 4.27 శాతం పడిపోయాయి. ఈ పతనంతో కంపెనీ మార్కెట్ విలువలో సుమారు 190 బిలియన్ డాలర్లు (రూ.17 లక్షల కోట్లకు పైగా) తగ్గిపోయింది. మార్కెట్ ముగిసే సమయానికి ఒక్కో షేరు ధర 7.97 డాలర్లు తగ్గి 178.67 డాలర్ల వద్ద స్థిరపడింది.



ఒక్కరోజులో 190 బిలియన్ డాలర్ల మార్కెట్ విలువ తగ్గుదల

శుక్రవారం ట్రేడింగ్ ముగిసే సమయానికి ఎన్విడియా మార్కెట్ విలువ సుమారు 4.5 ట్రిలియన్ డాలర్లుగా ఉంది. సోమవారం ట్రేడింగ్‌లో ఒక దశలో షేర్లు 7.5 శాతం వరకు పడిపోవడంతో కంపెనీ మార్కెట్ విలువ భారీగా తగ్గింది. రాయిటర్స్ నివేదిక ప్రకారం.. మార్కెట్ ముగిసే సమయానికి షేరు ధర 4.27 శాతం తగ్గి 178.67 డాలర్లకు చేరింది. దీంతో కంపెనీ మార్కెట్ విలువలో సుమారు 190 బిలియన్ డాలర్లు ఆవిరయ్యాయి. భారత కరెన్సీలో ఈ మొత్తం రూ.17 లక్షల కోట్లకు పైమాటే.

ఫోర్బ్స్ కుబేరుల జాబితాలోనూ రెండు స్థానాలు పతనం

ఎన్విడియా షేర్ల పతనం జెన్సన్ హువాంగ్ వ్యక్తిగత సంపదపైనా ప్రభావం చూపింది. ఫోర్బ్స్ రియల్‌టైమ్ బిలియనీర్స్ జాబితా ప్రకారం.. నవంబర్ 9న ఆయన సంపద 6.8 బిలియన్ డాలర్లు తగ్గి 155.4 బిలియన్ డాలర్లకు చేరింది. దీంతో ప్రపంచ కుబేరుల జాబితాలో ఎనిమిదో స్థానం నుంచి పదో స్థానానికి దిగజారారు. వారెన్ బఫెట్, లారీ ఎలిసన్ ఆయనను అధిగమించారు. హువాంగ్ సంపదలో ఎక్కువ భాగం ఎన్విడియాలో ఆయనకున్న 3.5 శాతానికి పైగా వాటా నుంచే వస్తోంది. అందుకే షేర్ల ధరలో మార్పులు ఆయన సంపదపై నేరుగా ప్రభావం చూపుతున్నాయి.

ఏఐ పెట్టుబడులపై సందేహాలూ కారణమేనా?

ఎన్విడియా షేర్లపై ఒత్తిడికి హువాంగ్ వ్యవహారంతో పాటు ఏఐ రంగంపై ఇన్వెస్టర్లలో పెరుగుతున్న ఆందోళనలు కూడా కారణమవుతున్నాయి. డేటా సెంటర్ల నిర్మాణం, విద్యుత్ వినియోగం, ఏఐ మౌలిక సదుపాయాలపై భారీగా పెట్టుబడులు పెట్టడం వల్ల ఆశించిన స్థాయిలో లాభాలు వస్తాయా? అనే సందేహాలు మార్కెట్‌లో ఉన్నాయి. మరోవైపు అమెరికా–చైనా మధ్య చిప్ ఎగుమతులపై ఆంక్షలు, నియంత్రణలు మరింత కఠినమయ్యే అవకాశం కూడా ఎన్విడియాకు సవాలుగా మారవచ్చని విశ్లేషకులు భావిస్తున్నారు. ప్రస్తుతం కంపెనీకి సంబంధించిన దర్యాప్తు కొనసాగుతోంది. నవంబర్ 17న ఎన్విడియా త్రైమాసిక ఆర్థిక ఫలితాలు ప్రకటించనుంది. ఈ ఫలితాలతో పాటు దర్యాప్తులో వెలువడే అంశాలు కంపెనీ షేర్ల తదుపరి కదలికలను ప్రభావితం చేసే అవకాశం ఉంది.

రైతులకు కేంద్రం భారీ ఊరట

న్యూఢిల్లీ: రైతులు, చిన్న వ్యాపారవేత్తలకు ప్రయోజనం కల్పించేలా కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుంది. రబీ 2026-27 సీజన్‌లో రైతులకు ఎరువులపై సబ్సిడీ అందించేందుకు రూ.62,370 కోట్లు కేటాయించడానికి కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. అంతర్జాతీయ పరిణామాలతో ఎరువుల ధరలు పెరుగుతున్న నేపథ్యంలో రైతులపై అదనపు భారం పడకుండా ఈ నిర్ణయం తీసుకుంది. ముఖ్యంగా 50 కిలోల డీఏపీ బస్తా ధరను గతంలో మాదిరిగానే రూ.1,350గా కొనసాగించనున్నట్లు కేంద్రం స్పష్టం చేసింది. ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన బుధవారం జరిగిన కేంద్ర కేబినెట్ సమావేశంలో వ్యవసాయం, సూక్ష్మ పరిశ్రమలు, మహిళా పారిశ్రామికవేత్తలు, మౌలిక సదుపాయాలకు సంబంధించి పలు కీలక ప్రతిపాదనలకు ఆమోదం లభించింది. సమావేశం అనంతరం కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ నిర్ణయాల వివరాలను వెల్లడించారు.

ఎరువుల సబ్సిడీకి రూ.62,370 కోట్లు

రబీ 2026-27 సీజన్‌కు సంబంధించి ఫాస్ఫేటిక్, పొటాషిక్ ఎరువులపై రూ.62,370 కోట్ల సబ్సిడీ అందించేందుకు కేంద్రం ఆమోదం తెలిపింది. పశ్చిమాసియాలో నెలకొన్న సంక్షోభం, రష్యా-ఉక్రెయిన్ యుద్ధం కారణంగా అంతర్జాతీయ మార్కెట్‌లో ఎరువుల ధరలు పెరిగాయని కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. ఈ పరిస్థితుల్లో రైతులకు ఎరువులు అందుబాటు ధరల్లో లభించేలా సబ్సిడీ కొనసాగించాలని ప్రభుత్వం నిర్ణయించింది. డీఏపీతో పాటు ఇతర ఫాస్ఫేటిక్, పొటాషిక్ ఎరువులపై పోషకాల ఆధారిత సబ్సిడీ (ఎన్‌బీఎస్) విధానం ప్రకారం రాయితీలు అందించనున్నారు. దీనివల్ల అంతర్జాతీయ మార్కెట్‌లో ధరలు పెరిగినా దేశీయ రైతులపై ఆ ప్రభావం పరిమితంగా ఉండే అవకాశం ఉంది. ముఖ్యంగా డీఏపీ 50 కిలోల బస్తా ధర రూ.1,350గానే కొనసాగుతుందని కేంద్రం స్పష్టం చేసింది.

ముద్రా రుణాలకు మరో ఐదేళ్ల గడువు

సూక్ష్మ పరిశ్రమలకు ఆర్థిక భరోసా కల్పించే క్రెడిట్ గ్యారెంటీ ఫండ్ ఫర్ మైక్రో యూనిట్స్ (సీజీఎఫ్ఎంయూ) పథకాన్ని మరో ఐదేళ్లపాటు పొడిగించేందుకు కేంద్ర కేబినెట్ ఆమోదం



తెలిపింది. ఈ పథకం 2031 మార్చి వరకు కొనసాగనుంది. ప్రధానమంత్రి ముద్రా యోజన కింద బ్యాంకులు, ఆర్థిక సంస్థలు అందించే రుణాలకు క్రెడిట్ గ్యారెంటీ రక్షణ కల్పించడం ఈ పథకం ప్రధాన ఉద్దేశం. రుణగ్రహీతలు తిరిగి చెల్లించలేని పరిస్థితుల్లో రుణ సంస్థలకు కలిగే నష్టభారాన్ని తగ్గించేందుకు ఈ గ్యారెంటీ ఉపయోగపడుతుంది. 2016లో ముద్రా యోజన ప్రారంభమైనప్పటి నుంచి 2026 సెప్టెంబర్ వరకు 60.36 కోట్లకు పైగా రుణాలు మంజూరయ్యాయి. వీటి మొత్తం విలువ రూ.43.34 లక్షల కోట్లుగా ఉంది. ఈ పథకం కొనసాగింపునకు రూ.5,000 కోట్ల నిధులు కేటాయించేందుకు కేబినెట్ ఆమోదించింది. తద్వారా రానున్న కాలంలో రూ.12.6 లక్షల కోట్ల విలువైన ముద్రా రుణాలకు మద్దతు లభించనుంది.

స్టాండప్ ఇండియాకు మరో ఐదేళ్లు

మహిళలు, ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించే స్టాండప్ ఇండియా పథకాన్ని కూడా మరో ఐదేళ్లపాటు పొడిగించారు. 2031 మార్చి 31 వరకు ఈ పథకం అమల్లో ఉండనుంది. ఈ పథకం ద్వారా రానున్న ఐదేళ్లలో అదనంగా 2.5 లక్షల మంది పారిశ్రామికవేత్తలకు ఆర్థిక సహాయం అందించాలని కేంద్రం లక్ష్యంగా పెట్టుకుంది. 2016 ఏప్రిల్‌లో ప్రారంభమైన ఈ పథకం ద్వారా ఇప్పటివరకు 2.75 లక్షల మందికి పైగా మహిళలు, ఎస్సీ, ఎస్టీ వర్గాల వారికి రుణాలు అందాయి. కొత్తగా గ్రీన్‌ఫీల్డ్ సంస్థలను ఏర్పాటు చేయాలనుకునే వారికి రూ.10 లక్షల నుంచి రూ.1 కోటి వరకు రుణాలు అందిస్తారు. తయారీ, సేవలు, వాణిజ్యం, వ్యవసాయ అనుబంధ రంగాల్లో వ్యాపారాలు ప్రారంభించేందుకు ఈ రుణాలు ఉపయోగపడతాయి. ప్రతి షెడ్యూల్డ్ కమర్షియల్ బ్యాంకు శాఖ కనీసం ఒక ఎస్సీ లేదా ఎస్టీ వ్యాపారవేత్తకు, ఒక మహిళా వ్యాపారవేత్తకు రుణం అందించాలన్నది ఈ పథకం లక్ష్యం. ఈ రుణాలకు గరిష్ఠంగా 18 నెలల మారటోరియం సదుపాయం ఉంటుంది. రుణాన్ని ఏడేళ్లలోపు తిరిగి చెల్లించాల్సి ఉంటుంది. రుణ మొత్తంలో 85 శాతం వరకు క్రెడిట్ గ్యారెంటీ సదుపాయం కల్పిస్తారు.

యుగే యుగీన్ మ్యూజియానికి రూ.3,230 కోట్లు

దేశ చరిత్ర, సంస్కృతి, వారసత్వ సంపదను భవిష్యత్ తరాలకు పరిచయం చేసే లక్ష్యంతో యుగే యుగీన్ మ్యూజియం అభివృద్ధికి రూ.3,230 కోట్లు కేటాయించేందుకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. ఢిల్లీలోని చారిత్రక నార్త్ బ్లాక్, సౌత్ బ్లాక్ భవనాలను మ్యూజియం ప్రాంగణంగా అభివృద్ధి చేయనున్నారు. దేశ చరిత్రకు సంబంధించిన ముఖ్యమైన ఘట్టాలు, కళలు, సంస్కృతి, వారసత్వ సంపదను ఒకే చోట ప్రదర్శించేలా ఈ ప్రాజెక్టును రూపొందించనున్నారు.

నోయిడా మెట్రోకు రూ.2,390 కోట్లు

ఉత్తరప్రదేశ్‌లో మెట్రో రైలు కనెక్టివిటీని మరింత విస్తరించేందుకు కేంద్రం ఆమోదం తెలిపింది. నోయిడా సెక్టార్-51 నుంచి గ్రేటర్ నోయిడాలోని సెక్టార్-4 వరకు మెట్రో మార్గాన్ని నిర్మించేందుకు రూ.2,390 కోట్ల వ్యయంతో ప్రతిపాదించిన ప్రాజెక్టుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ మార్గం అందుబాటులోకి వస్తే నోయిడా, గ్రేటర్ నోయిడా మధ్య ప్రయాణించే ప్రజలకు రవాణా సౌకర్యాలు మెరుగుపడనున్నాయి. ముఖ్యంగా ఉద్యోగులు, విద్యార్థులు, రోజువారీ ప్రయాణికులకు ప్రయోజనం చేకూరనుంది. రైతులకు ఎరువుల ధరల భారం తగ్గించడం, చిన్న వ్యాపారాలకు రుణ భరోసా కల్పించడం, మహిళా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించడం, పట్టణ రవాణా సదుపాయాలను విస్తరించడం వంటి పలు అంశాలకు కేంద్ర కేబినెట్ నిర్ణయాల్లో ప్రాధాన్యం లభించింది.

విదేశీయులకు వీసా విధానంలో భారీ మార్పులు

న్యూఢిల్లీ: భారత్‌ను సందర్శించాలనుకునే విదేశీ పౌరులకు కేంద్ర ప్రభుత్వం కీలక వెసులుబాటు కల్పించింది. దేశ వీసా విధానంలో సమూల మార్పులు చేస్తూ వీసా కేటగిరీల సంఖ్యను తగ్గించింది. ఇప్పటివరకు ఉన్న 13 ప్రధాన వీసా విభాగాలను 9కి, 49 ఉప విభాగాలను 23కి కుదించింది. అంతేకాకుండా వీసా దరఖాస్తు ఫారాల్లోనూ భారీగా మార్పులు చేసింది. దరఖాస్తుదారులు వివరాలు నమోదు చేసే ఫీల్డ్ సంఖ్యను 65 నుంచి 70 శాతం వరకు తగ్గించినట్లు అధికారులు బుధవారం వెల్లడించారు.

9 ప్రధాన వీసా కేటగిరీలు ఇవే

కొత్త విధానంలో వీసాలను ప్రయాణ ఉద్దేశాలకు అనుగుణంగా తొమ్మిది ప్రధాన విభాగాలుగా వర్గీకరించారు.

1. బిజినెస్ వీసా -- వ్యాపార కార్యకలాపాలు, పెట్టుబడులు.
2. డిప్లొమాటిక్ వీసా -- దౌత్య సంబంధిత పర్యటనలు.
3. వర్క్ వీసా -- ఉద్యోగ, ఉపాధి అవసరాలు.
4. జర్నలిస్ట్ వీసా -- పాత్రికేయ కార్యకలాపాలు.
5. మెడికల్ వీసా -- వైద్య చికిత్స.
6. అఫీషియల్ వీసా -- అధికారిక పర్యటనలు.
7. స్టూడెంట్ వీసా -- విద్య, పరిశోధన.
8. విజిటర్ వీసా -- పర్యాటకం, ఇతర స్వల్పకాలిక సందర్శనలు.
9. మిసిలేనియస్ వీసా -- ఇతర ప్రత్యేక అవసరాలు.

టూరిస్ట్ వీసా స్థానంలో విజిటర్ వీసా

కొత్త విధానంలో టూరిస్ట్ వీసా పేరును విజిటర్ వీసాగా మార్చారు. దీన్ని ఎ-1, ఎ-2 అనే రెండు ఉప విభాగాలుగా



విభజించారు. ఎ-1 వీసా ద్వారా పర్యాటకంతో పాటు వ్యాపార సమావేశాలు, వైద్య సంప్రదింపులు, వెల్‌నెస్ కార్యక్రమాలు, స్వల్పకాలిక కోర్సులకు వెళ్లవచ్చు. ఇది 30 రోజుల కాలపరిమితితో మల్టిపుల్ ఎంట్రీ సదుపాయంతో ఉంటుంది.

ఎ-2 వీసా దీర్ఘకాలిక సందర్శనల కోసం ఉద్దేశించారు. నిబంధనల ప్రకారం ఒకటి, ఐదు లేదా పదేళ్ల కాలపరిమితితో ఈ వీసా జారీ చేస్తారు. పర్వతారోహణకు సంబంధించిన సందర్శనలకూ ఇందులో అవకాశం కల్పించారు.

వైద్య, విద్యార్థి వీసాల్లోనూ మార్పులు

వైద్య చికిత్స కోసం వచ్చే విదేశీయులకు వీసా విధానాన్ని మరింత స్పష్టంగా రూపొందించారు. సాధారణ వైద్య చికిత్సలకు వీ-1, ఆయుష్ వైద్య విధానాల చికిత్సకు వీ-3 వీసాలను కేటాయించారు. రోగులతో పాటు వచ్చే సహాయకుల కోసం వీ-2, వీ-4 వీసా విభాగాలను ఏర్పాటు చేశారు. ఈ వీసాలకు సాధారణంగా ఏడాది కాలపరిమితితో మల్టిపుల్ ఎంట్రీ సదుపాయం ఉంటుంది.

విద్యార్థి వీసాలను ఎ-1, ఎ-2గా విభజించారు. పాఠశాల విద్య నుంచి డిగ్రీ, పీజీ చదువుల వరకు ఎ-1 వర్తిస్తుంది. పీహెచ్‌డీ, పరిశోధకులు, విజిటింగ్ ఫ్యాకల్టీ, ఇంటర్న్‌షిప్‌లు, ఎక్స్ఛేంజ్ ప్రోగ్రామ్‌లకు ఎ-2 వర్తిస్తుంది.

బిజినెస్ వీసాలకూ ప్రత్యేక విభజన

వ్యాపార అవసరాల కోసం భారత్‌కు వచ్చే విదేశీయులకు వీ-1, వీ-2 విభాగాలను రూపొందించారు. దీర్ఘకాలిక వ్యాపార కార్యకలాపాలు, పరిశ్రమల స్థాపన వంటి అవసరాలకు వీ-1 వీసా ఉపయోగపడుతుంది. స్వల్పకాలిక ఒప్పందాలు, సమావేశాలు, క్రీడా, సాంస్కృతిక కార్యక్రమాలు, సినిమా నిర్మాణం వంటి కార్యకలాపాలకు వీ-2 వీసా వర్తిస్తుంది. భారతీయ కంపెనీలకు అవసరమైన విదేశీ సాంకేతిక నిపుణులు, ఇంజినీర్లు, ప్రత్యేక నైపుణ్యాలు కలిగిన సిబ్బంది సేవలను వినియోగించుకునేందుకు కూడా ప్రత్యేక వెసులుబాటు కల్పించారు.

ఏడాది చివరి నుంచి కొత్త విధానం అమలు

వీసా విధానంలో చేసిన మార్పులను అమలు చేసేందుకు కేంద్ర హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ తన ఐటీ వ్యవస్థలను ఆధునీకరిస్తోంది. 2026 ఏడాది చివరి నాటికి కొత్త విధానం ప్రకారం వీసాల జారీ ప్రక్రియ ప్రారంభం కానుందని కేంద్రం వెల్లడించింది. ఈ మార్పులతో విదేశీ పర్యాటకులు, వైద్య సేవల కోసం వచ్చే వారు, విద్యార్థులు, పెట్టుబడిదారులు, వ్యాపారవేత్తలకు దరఖాస్తు ప్రక్రియ మరింత సులభతరం కానుంది.

అయోధ్యలో అద్భుత రామ్ దర్బార్

అయోధ్య: రామనామ స్మరణతో మారుమోగుతున్న అయోధ్యలో మరో అద్భుత కళాఖండం ఆవిష్కృతమైంది. 2026 దీపోత్సవ వేడుకల్లో భాగంగా సరయూ నదీ తీరంలో నిర్మించిన భారీ రామ్ దర్బార్ సైకత శిల్పం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఏకంగా 220 టన్నుల ఇసుకతో 58 అడుగుల పొడవు, 20 అడుగుల ఎత్తులో రూపొందించిన ఈ అద్భుత కళాకృతికి 'బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్' అధికారిక గుర్తింపు లభించింది. అంతర్జాతీయ సైకత శిల్పి మధురేంద్ర కుమార్ తన బృందంతో కలిసి ఈ అరుదైన శిల్పాన్ని రూపొందించారు.



220 టన్నుల ఇసుకతో అద్భుత సృష్టి

ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం, రాష్ట్ర పర్యాటక శాఖ సంయుక్త ఆధ్వర్యంలో అయోధ్యలోని రామ్ కథా పార్క్‌లో ఈ భారీ శిల్పాన్ని నిర్మించారు. సరయూ నది నుంచి సేకరించిన 220 టన్నుల ఇసుకను ఇందుకోసం వినియోగించారు. రామమందిర నమూనాతో పాటు రాముడు, సీత, లక్ష్మణుడు, హనుమంతుడితో కూడిన రామ్ దర్బార్‌ను అత్యంత నైపుణ్యంతో తీర్చిదిద్దారు. ప్రపంచ శాంతి, మానవత్వం, సోదరభావం సందేశాలను ప్రతిబింబించేలా ఈ కళాఖండాన్ని రూపొందించారు.

ఏడు రోజులపాటు నిర్విరామంగా నిర్మాణం

అక్టోబర్ 30న ప్రారంభమైన శిల్ప నిర్మాణ పనులు నవంబర్ 7 వరకు ఏడు రోజులపాటు కొనసాగాయి. భారీ పరిమాణంలో ఇసుకను ఉపయోగించి సున్నితమైన ఆకృతులను చెక్కడం కళాకారులకు పెద్ద సవాలుగా మారింది. అయినప్పటికీ మధురేంద్ర కుమార్ బృందం పట్టుదలతో పనులను పూర్తి చేసింది. రామ్ దర్బార్ ఇతివృత్తంతో తాను రూపొందించిన తొలి భారీ సైకత శిల్పం ఇదేనని మధురేంద్ర కుమార్ వెల్లడించారు. ఈ స్థాయిలో పొడవైన రామ్ దర్బార్ శిల్పాన్ని ఇసుకతో నిర్మించడం ఇదే తొలిసారి అని పేర్కొన్నారు.

బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో గుర్తింపు

ఈ భారీ కళాఖండానికి సంబంధించిన వివరాలను అక్టోబర్ 30న బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్, గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ సంస్థలకు సమర్పించారు. నవంబర్ 7న బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ నుంచి అధికారిక ఆమోదం లభించింది. ×చీణ/2026/001810 రికార్డు నంబరుతో గుర్తింపు నమోదు చేసి డిజిటల్ సర్టిఫికెట్ జారీ చేశారు. గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ గుర్తింపు ప్రక్రియ మాత్రం ఇంకా కొనసాగుతోంది.

ప్రముఖుల ప్రశంసలు

దీపోత్సవ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్, ఉత్తరప్రదేశ్ గవర్నర్ ఆనందీబెన్ పటేల్, ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ఈ భారీ శిల్పాన్ని సందర్శించారు. కళాకారుల నైపుణ్యాన్ని పరిశీలించి అభినందించారు. ఈ చారిత్రక కళాఖండాన్ని అయోధ్య ఎప్పటికీ గుర్తుంచుకుంటుందని ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ప్రశంసించారు. ఉపరాష్ట్రపతి సైతం శిల్పకళా నైపుణ్యాన్ని కొనియాడారు.

12కు పైగా ప్రపంచ రికార్డుల సృష్టికర్త

బిహార్‌లోని తూర్పు చంపారన్‌కు చెందిన మధురేంద్ర కుమార్ ఇప్పటికే అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన సైకత శిల్పి. ఇప్పటివరకు 25కు పైగా దేశాల్లో భారతదేశానికి ప్రాతినిధ్యం వహించారు. 12కు పైగా ప్రపంచ రికార్డులు సాధించారు. ఇసుకతో పాటు బొగ్గు బూడిద, ఆకులు, పండ్లు, కూరగాయలు, పునర్వినియోగ వస్తువులతో వేలాది కళాఖండాలను రూపొందించారు. అమెరికా ఇంటర్నేషనల్ యూనివర్సిటీ నుంచి ఇసుక కళలో గౌరవ డాక్టరేట్ కూడా అందుకున్నారు. పర్యావరణ పరిరక్షణ, పరిశుభ్రత, వ్యసన విముక్తి, ప్రపంచ శాంతి వంటి అంశాలను తన కళాఖండాల ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్లడం ఆయన ప్రత్యేకత.

30 లక్షలకు పైగా దీపాలతో అయోధ్య వెలుగులు

మరోవైపు 2026 దీపోత్సవ వేడుకలు అయోధ్యలో అంగరంగ వైభవంగా జరిగాయి. సరయూ నదీ తీరంలోని 56 ఘాట్లలో 30 లక్షలకు పైగా మట్టి ప్రమిదలను వెలిగించి దీపాల కాంతులతో నగరాన్ని అలంకరించారు. పదో దీపోత్సవ వేడుకలు భక్తి, ఆధ్యాత్మిక శోభ మధ్య ఘనంగా నిర్వహించారు. రామమందిర నిర్మాణం అనంతరం అయోధ్యకు పెరుగుతున్న అంతర్జాతీయ గుర్తింపులో ఇలాంటి కళాఖండాలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. సంప్రదాయం, కళానైపుణ్యం, ఆధ్యాత్మికత కలగలిసిన ఈ భారీ రామ్ దర్బార్ శిల్పం పర్యాటకులను విశేషంగా ఆకట్టుకుంటోంది.

స్వచ్ఛ సర్వేక్షణ్‌లో ఏపీ నగరాల హవా..

విశాఖకు అగ్రతాంబూలం

కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన 'స్వచ్ఛ సర్వేక్షణ్ 2025-26' వార్షిక సర్వేలో ఆంధ్రప్రదేశ్ నగరాలు ఘన విజయం సాధించాయి. దేశవ్యాప్త స్వచ్ఛతా ర్యాంకింగ్స్‌లో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన విజయవాడ, విశాఖపట్నం, గుంటూరు నగరాలు జాతీయ స్థాయిలో పురస్కారాలను కైవసం చేసుకున్నాయి. ఓవరాల్ విభాగంలో విజయవాడ దేశంలోనే మూడో అత్యంత స్వచ్ఛమైన నగరంగా నిలిచింది. న్యూఢిల్లీలో బుధవారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము విజేతలకు అవార్డులను అందజేశారు. వివిధ జనాభా వర్గాల వారీగా ప్రకటించిన ర్యాంకింగ్స్‌లోనూ ఏపీ నగరాలు ముందంజలో నిలిచాయి. 10 లక్షలకు పైగా జనాభా కలిగిన నగరాల విభాగంలో గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ దేశంలోనే ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకుని అగ్రగామిగా నిలిచింది. ఈ విభాగంలో మధ్యప్రదేశ్‌లోని జబల్‌పూర్ రెండో స్థానంలో, ఉత్తరప్రదేశ్‌లోని లక్నో మూడో స్థానంలో నిలిచాయి. అలాగే 3 లక్షల నుంచి 10 లక్షల లోపు జనాభా ఉన్న నగరాల కేటగిరీలో గుంటూరు నగరం జాతీయ స్థాయిలో మూడో స్థానాన్ని దక్కించుకుంది. ఈ కేటగిరీలో ఉజ్జయిని మొదటి స్థానం, చండీగఢ్ రెండో స్థానం సాధించాయి. ఓవరాల్ ర్యాంకింగ్స్ పరిశీలిస్తే.. మహారాష్ట్రకు చెందిన నవీ ముంబై దేశంలోనే అత్యంత స్వచ్ఛమైన నగరంగా మొదటి స్థానాన్ని దక్కించుకుంది. గుజరాత్‌కు చెందిన సూరత్ రెండో స్థానంలో నిలవగా, విజయవాడ మూడో స్థానాన్ని సొంతం చేసుకుంది. గత ఎనిమిదేళ్లుగా స్వచ్ఛ నగరాల ర్యాంకింగ్స్‌లో మొదటి స్థానంలో నిలుస్తూ వచ్చిన మధ్యప్రదేశ్‌కు చెందిన ఇండోర్ నగరం ఈసారి టాప్ స్థానాల్లో చోటు దక్కించుకోలేకపోవడం గమనార్హం. కేంద్ర గృహ నిర్మాణ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ నిర్వహించిన స్వచ్ఛ సర్వేక్షణ్ 10వ ఎడిషన్ (సూపర్ స్వచ్ఛ లీగ్)లో భాగంగా దేశవ్యాప్తంగా సుమారు 4,751 నగరాల్లో ఈ సర్వే చేపట్టారు. గత ఏడాది సూపర్ స్వచ్ఛ లీగ్‌లో ఇండోర్ మొదటి స్థానంలో, సూరత్ రెండో స్థానంలో, నవీ ముంబై మూడో స్థానంలో నిలిచాయి. ఇతర విభాగాల ఫలితాలు చూస్తే.. రివర్‌ఫ్రంట్ నగరాల విభాగంలో మధ్యప్రదేశ్‌కు చెందిన రేవా మొదటి స్థానంలో, ఛత్తీస్‌గఢ్‌కు చెందిన బిలాస్‌పూర్ రెండో స్థానంలో, ఉత్తరప్రదేశ్‌కు చెందిన వారణాసి మూడో స్థానంలో నిలిచాయి. తీరప్రాంత పట్టణాల కేటగిరీలో ఒడిశాకు చెందిన పూరీ అగ్రస్థానంలో నిలవగా, కేరళకు చెందిన అలప్పుళ రెండో స్థానం, మహారాష్ట్రకు చెందిన రత్నగిరి మూడో స్థానం పొందాయి. హిమాలయ ప్రాంత నగరాల విభాగంలో ఉత్తరాఖండ్‌కు చెందిన రుద్రపూర్ ప్రథమ స్థానాన్ని, జమ్ము ద్వితీయ స్థానాన్ని దక్కించుకున్నాయి. దేశవ్యాప్త పోటీలో విశాఖపట్నం, విజయవాడ, గుంటూరు నగరాలు అగ్రశ్రేణిలో నిలిచి రాష్ట్ర ప్రతిష్ఠను జాతీయ స్థాయిలో మరింత పెంచాయి.

మేధో సంపత్తి వివాదాలకు ఆ హైకోర్టే శరణ్యం అనుకోవడం భ్రమ..

తమకు అనుకూలమైన న్యాయస్థానాలను ఎంచుకుంటూ పిటిషన్లు దాఖలు చేసే 'ఫోరమ్ షాపింగ్' (లేదా లిటిగేషన్ టూరిజం) ధోరణిపై సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. సాంకేతిక పరిధి ఉందన్న ఏకైక కారణంతో సుదూర ప్రాంతాల్లోని హైకోర్టులను ఆశ్రయించడం సరైంది కాదని స్పష్టం చేసింది. మేధో సంపత్తి హక్కుల (ఐపీ) వివాదానికి సంబంధించి ఢిల్లీ హైకోర్టులో నడుస్తున్న ఒక వాణిజ్య దావాను మద్రాస్ హైకోర్టుకు బదిలీ చేస్తూ జస్టిస్ బి.వి. నాగరత్న, జస్టిస్ ఆర్. మహదేవన్‌లతో కూడిన ధర్మాసనం కీలక ఆదేశాలు జారీ చేసింది. ఈ కేసుకు సంబంధించి బెంగళూరు రూరల్ జిల్లా నెలమంగళకు చెందిన 'మెసర్స్ శ్రీ లక్ష్మీ శ్రీనివాస ఆగ్రో ఫుడ్స్', ఇతర సంస్థలు వాది (ప్లైంటిఫ్) పక్షంగా ఢిల్లీ హైకోర్టులో వాణిజ్య దావా కింజూ(జూవీవీ) 625/2026ని వేశాయి. చెన్నైకి చెందిన 'సాయి మహాలక్ష్మి ట్రేడర్స్' సహా మరికొందరు ప్రతివాదులుగా ఉన్నారు. అయితే, ఇరు పక్షాలు పొరుగు రాష్ట్రాలైన కర్ణాటక, తమిళనాడుకు చెందినవే అయినప్పుడు కేసును ఢిల్లీలో ఎందుకు దాఖలు చేశారో తమకు అర్థం కావడం లేదని సుప్రీంకోర్టు పేర్కొంది. కేసును చెన్నైకి బదిలీ చేయాలంటూ ప్రతివాదులు దాఖలు చేసిన పిటిషన్‌ను అనుమతిస్తూ ధర్మాసనం తీర్పు వెలువరించింది. విచారణ సందర్భంగా ధర్మాసనం స్పందిస్తూ.. వివిధ కోర్టులకు ప్రాదేశిక అధికార పరిధి ఉన్నంత మాత్రాన, పిటిషనర్లు తమకు నచ్చిన న్యాయస్థానాన్ని ఎంచుకునే 'ఫోరమ్ షాపింగ్' విధానాన్ని సమర్థించుకోలేరని తేల్చిచెప్పింది. ఇలాంటి చర్యలు దేశంలోని హైకోర్టుల మధ్య అంతరాలు ఉన్నాయనే తప్పుడు భావనను పెంచుతాయని వ్యాఖ్యానించింది. ముఖ్యంగా మేధో సంపత్తి, వాణిజ్య వివాదాలను విచారించడానికి ఒక నిర్దిష్ట హైకోర్టు (ఢిల్లీ హైకోర్టు వంటివి) మాత్రమే అత్యుత్తమమైనదనే ఆలోచన పూర్తిగా తప్పు అని, అది తప్పుడు అవగాహనతో కూడుకున్నదని స్పష్టం చేసింది. వివాదం ఎక్కడైతే మొదలైందో, ఇరు పక్షాలు ఎక్కడైతే ఉన్నాయో ఆ ప్రాంతంలోని న్యాయస్థానాలే కేసులోని వాస్తవాలను సమగ్రంగా అర్థం చేసుకోగలవని కోర్టు అభిప్రాయపడింది. మద్రాస్ హైకోర్టుకు స్వయంగా సివిల్ విచారణ చేపట్టే ఒరిజినల్ జ్యూరిస్‌డిక్షన్ ఉన్న విషయాన్ని గుర్తుచేసింది. ఈ క్రమంలోనే సదరు కేసును తక్షణమే మద్రాస్ హైకోర్టుకు బదిలీ చేయాలని ఆదేశించింది. ఇరు పక్షాల ప్రతినిధులు కోర్టుకు నేరుగా గానీ లేదా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా గానీ హాజరు కావచ్చని తెలిపింది. వాణిజ్య వివాదాల్లో ఢిల్లీ హైకోర్టును మాత్రమే ప్రాధాన్య వేదికగా భావించి ఇతర రాష్ట్రాల వారు సైతం అక్కడికే వెళ్లే పోకడలపై గతంలో ఢిల్లీ హైకోర్టు కూడా ఆందోళన వ్యక్తం చేసిన నేపథ్యంలో, సుప్రీంకోర్టు ఇచ్చిన ఈ ఆదేశాలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి.

రామమందిర విరాళాల లెక్కలు బయటపెట్టాలి..

న్యూఢిల్లీ: అయోధ్య రామమందిర విరాళాల వ్యవహారం మరోసారి రాజకీయంగా చర్చనీయాంశమైంది. ఆలయానికి వచ్చిన విరాళాల దుర్వినియోగంపై కాంగ్రెస్ పార్టీ తీవ్ర ఆరోపణలు చేసింది. విరాళాల సేకరణ, లెక్కింపు, బ్యాంకు ఖాతాల్లో జమ చేసే ప్రక్రియతో పాటు ఆలయ నిర్మాణ పనుల్లోనూ అవకతవకలు జరిగాయనే ఆరోపణలపై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేసింది. ఈ వ్యవహారంలో రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్), బీజేపీ, విశ్వహిందూ పరిషత్ (వీహెచ్‌పీ)కు చెందిన వ్యక్తుల పాత్రపైనా దర్యాప్తు జరగాలని కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేశ్ కోరారు. ఈ మేరకు ఆయన సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పలు ప్రశ్నలు సంధించారు.

ముందే ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోలేదా?

2021లోనే ఆలయ విరాళాల లెక్కల్లో అవకతవకలు జరుగుతున్నాయని అప్పటి ఖాతాల అధికారి మహిపాల్ సింగ్ గుర్తించి, ట్రస్టు ప్రతినిధులు చంపత్ రాయ్, గోపాల్ రావు దృష్టికి తీసుకెళ్లినట్లు మీడియా కథనాలు వెల్లడించాయని జైరాం రమేశ్ పేర్కొన్నారు. అయితే అక్రమాలను ప్రశ్నించిన అధికారినే విధుల నుంచి తొలగించారని ఆరోపించారు. ఆలయ నిర్మాణ పనులను పర్యవేక్షించిన ఇంజినీర్ దినానాథ్ వర్మ కూడా ట్రస్టు కార్యాలయంలో పనుల కోసం 40 శాతం కమీషన్ డిమాండ్ చేశారని ఆరోపించినట్లు జైరాం ప్రస్తావించారు. ఇందుకు సంబంధించిన ఆడియో రికార్డింగ్‌ను చంపత్ రాయ్‌కు వినిపించిన తర్వాత తననే ప్రాజెక్టు నుంచి తొలగించారని వర్మ చెప్పినట్లు మీడియా కథనాలను ఉటంకించారు. ఈ ఆరోపణలపై ట్రస్టు ప్రతినిధులు ఎలాంటి చర్యలు తీసుకున్నారో వెల్లడించాలని ప్రశ్నించారు.

కుల్గామ్‌లో సీఆర్‌పీఎఫ్ శిబిరంపై ఉగ్రదాడి

శ్రీనగర్: జమ్మూకశ్మీర్‌లో మరోసారి ఉగ్రవాదులు కాల్పులకు తెగబడ్డారు. కుల్గామ్ జిల్లాలోని సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ (సీఆర్‌పీఎఫ్) శిబిరం సమీపంలోని చెక్‌పోస్టుపై బుధవారం దాడి చేశారు. మోటార్‌సైకిల్‌పై వచ్చిన ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు భద్రతా సిబ్బందిని లక్ష్యంగా చేసుకుని కాల్పులు జరిపారు. ఈ ఘటనలో ముగ్గురు సీఆర్‌పీఎఫ్ జవాన్లు గాయపడ్డారు. వారిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. గాయపడిన వారిని వెంటనే అనంతనాగ్ జిల్లాలోని ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

మధ్యాహ్నం 2.15 గంటలకు కాల్పులు

అధికారుల వివరాల ప్రకారం.. బుధవారం మధ్యాహ్నం సుమారు 2.15 గంటల సమయంలో మోటార్‌సైకిల్‌పై వచ్చిన ఇద్దరు దుండగులు కుల్గామ్‌లోని సీఆర్‌పీఎఫ్ నాకా వద్ద విధులు నిర్వహిస్తున్న సిబ్బందిపై అకస్మాత్తుగా కాల్పులు జరిపారు. అప్రమత్తమైన భద్రతా సిబ్బంది ఎదురుకాల్పులు జరపడంతో దుండగులు అక్కడి నుంచి పరారయ్యారు. ఈ దాడిలో 46వ సీఆర్‌పీఎఫ్ బెటాలియన్‌కు చెందిన ముగ్గురు సిబ్బంది గాయపడినట్లు అధికారులు వెల్లడించారు.

తమ్మిడికుంటకు పునర్జీవం!

-మొదటిపేజీ తరువాయి

సినీనటుడు అక్కినేని నాగార్జున గౌరవ అతిథిగా హాజరయ్యారు. చెరువు అభివృద్ధికి నాగార్జున అందించిన సహకారాన్ని సీఎం ప్రత్యేకంగా ప్రశంసించారు.

మంచి నిర్ణయాలతో తరాలకు మేలు

ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వాలు తీసుకునే కొన్ని నిర్ణయాలు కొందరికి ఇబ్బందులు, నష్టాలు కలిగించవచ్చని, అయితే ప్రజా ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని తీసుకునే మంచి నిర్ణయాలు భవిష్యత్ తరాలకు మేలు చేస్తాయని అన్నారు. ఎన్నికల సమయంలో రాజకీయాలు చేసుకోవచ్చని, అభివృద్ధి విషయంలో మాత్రం అందరూ కలిసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. హైటెక్ సిటీతో పాటు తమ్మిడికుంట కూడా హైదరాబాద్ అభివృద్ధికి గుర్తుగా నిలవాలని ఆకాంక్షించారు. ఐటీ ఉద్యోగులు 'వర్క్ ఫ్రమ్ తమ్మిడికుంట' అని చెప్పుకునే స్థాయిలో ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలని అధికారులకు సూచించారు. చెరువుకు భద్రత కల్పించడంతో పాటు సందర్శకులకు అవసరమైన అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

1,372 చెరువుల్లో సగం కనుమరుగు

హైదరాబాద్ నగర విస్తరణలో చెరువులు కనుమరుగవుతున్న తీరుపై సీఎం ఆందోళన వ్యక్తం చేశారు. ఔటర్ రింగ్ రోడ్డు పరిధిలో ఒకప్పుడు సుమారు 1,372 చెరువులు ఉండగా, వాటిలో దాదాపు సగం కనుమరుగయ్యాయని పేర్కొన్నారు. నీటి వనరుల నివాసాలను మనం ఆక్రమిస్తే.. చివరకు ఆ నీళ్లే మన జీవితాలను ప్రభావితం చేస్తాయని హెచ్చరించారు.

హైదరాబాద్ నాగరికత మూసీ నది పరివాహక ప్రాంతంలోనే అభివృద్ధి చెందిందని గుర్తుచేశారు. చెరువులు, నదులు నగరానికి జీవనాధారమని, వాటిని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు.

నాగార్జున నిజ జీవితంలోనూ హీరోనే

తమ్మిడికుంట అభివృద్ధికి సినీనటుడు అక్కినేని నాగార్జున రెండు ఎకరాల స్థలాన్ని ఉదారంగా అందించారని సీఎం వెల్లడించారు. సినిమాల్లోనే కాకుండా నిజ జీవితంలోనూ నాగార్జున హీరో అని ప్రశంసించారు. ప్రజా ప్రయోజనాల కోసం ఆయన అందించిన సహకారం అభినందనీయమన్నారు.

మూసీ ప్రక్షాళనపై సీఎం కీలక వ్యాఖ్యలు

మూసీ నది కాలుష్యం నల్గొండ జిల్లా ప్రజలకు శాపంగా మారిందని సీఎం అన్నారు. గత పాలకులు కక్షపూరితంగా మూసీ కాలుష్యాన్ని తమపైకి వదిలారని నల్గొండ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని పేర్కొన్నారు. తనకు ఎలాంటి స్వార్థం లేదని, ఎవరిపైనా కోపం లేదని.. ప్రకృతిని రక్షించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. మూసీ పునరుద్ధరణలో ఎవరికీ అన్యాయం జరగకుండా ఆదుకునే బాధ్యత ప్రభుత్వానిదేనని హామీ ఇచ్చారు. ప్రజాప్రతినిధులు



వ్యక్తిగత బేషజాలను పక్కనపెట్టి నగర అభివృద్ధికి సహకరించాలని కోరారు. మూసీకి సంబంధించి 21 కిలోమీటర్ల మేర పనులు త్వరలో ప్రారంభిస్తామని, ఇప్పటికే అనుమతులు వచ్చాయని, టెండర్ల దశలో ఉన్నాయని తెలిపారు. ఇది కేవలం మూసీ సుందరీకరణ కార్యక్రమం కాదని, నది పునరుజ్జీవం, ప్రక్షాళన లక్ష్యంగా చేపడుతున్న చర్య అని వివరించారు. హైదరాబాద్‌లో చెరువులను ఆక్రమణల నుంచి విముక్తి చేయాల్సిన అవసరం ఉందన్నారు.

తమ్మిడికుంట వద్దే షూటింగ్ చేస్తా: నాగార్జున

నగరంలోని చెరువులను పునరుద్ధరించడం ఎంతో అవసరమని సినీనటుడు అక్కినేని నాగార్జున అన్నారు. హైదరాబాద్ పరిధిలో సుమారు రెండు వేల చెరువులు ఉన్నాయని, వాటిని కూడా తమ్మిడికుంట తరహాలో అభివృద్ధి చేస్తే నగర నీటి అవసరాలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని అభిప్రాయపడ్డారు. గతంలో భారీ వర్షాలు కురిసినప్పుడు చెరువుల్లోకి నీరు వెళ్లకుండా రోడ్లపై నిలిచిపోయేదని, తాను కూడా శిల్పారామం సమీపంలో ట్రాఫిక్‌లో పలుమార్లు ఇబ్బందులు ఎదుర్కొన్నానని గుర్తుచేశారు. తమ్మిడికుంట పునరుద్ధరణతో పరిసరాలు అందంగా మారాయని చెప్పారు. చెరువు నిండుగా మారిన తర్వాత ఇక్కడ సినిమా షూటింగ్ కూడా చేస్తానని ప్రకటించారు. మూసీ నది పునరుద్ధరణ పనులు పూర్తయ్యాక ప్రారంభోత్సవానికి తనను ఆహ్వానిస్తారని ఆశిస్తున్నట్లు తెలిపారు.

యువత నుంచి చెరువుల పరిరక్షణకు మద్దతు

తమ్మిడికుంట అభివృద్ధి పనులను హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ ముఖ్యమంత్రికి వివరించారు. ఏడాదిన్నర వ్యవధిలోనే చెరువు పునరుద్ధరణ పనులు పూర్తి చేసినట్లు తెలిపారు. గతంలో భారీ వర్షాలు కురిసినప్పుడు చెరువులోకి చేరాల్సిన నీరు రోడ్లపై నిలవడంతో చుట్టుపక్కల ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్యలు ఏర్పడేవని వివరించారు. చెరువుల పరిరక్షణకు యువత నుంచి విశేష మద్దతు లభిస్తోందని చెప్పారు. జెన్ జీతో పాటు జెన్ ఆల్ఫా తరానికి చెందిన యువత కూడా నీటి వనరుల పరిరక్షణకు మద్దతుగా నిలుస్తున్నారని తెలిపారు. జీవించే హక్కు తమకూ ఉందంటూ యువత ర్యాలీలు నిర్వహించిన విషయాన్ని ప్రస్తావించారు.

వాకింగ్ ట్రాక్.. రోజ్ గార్డెన్.. యోగా వేదిక

తమ్మిడికుంటను సుమారు 30 ఎకరాల విస్తీర్ణంలో పునరుద్ధరించగా, చెరువు చుట్టూ 1.2 కిలోమీటర్ల పొడవున వాకింగ్ ట్రాక్ నిర్మించారు. ట్రాక్ ఇరువైపులా మొక్కలు నాటి ల్యాండ్‌స్కేపింగ్ చేశారు. సందర్శకుల కోసం బెంచీలు, యోగా వేదిక, రోజ్ గార్డెన్ ఏర్పాటు చేశారు. చెరువు పరిసరాలను ఆహ్లాదకరమైన వాతావరణంగా తీర్చిదిద్దారు.

34 మందికి ఇందిరమ్మ ఇళ్ల పత్రాలు

చెరువుల అభివృద్ధిలో భాగంగా ఎఫ్‌టీఎల్ పరిధిలోని గుడిసెలను తొలగించాల్సి రావడంతో ఇళ్లు కోల్పోయిన వారికి ప్రభుత్వం పునరావాస చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగా ఉప్పల్ నియోజకవర్గంలోని రామంతాపూర్ పెద్దచెరువు పరిధిలో ఇళ్లు కోల్పోయిన 34 మందికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను అందజేశారు. చెరువుల పరిరక్షణతో పాటు ప్రభావిత కుటుంబాలకు ప్రత్యామ్నాయ నివాసం కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం ఈ చర్యలు చేపట్టినట్లు కార్యక్రమంలో వెల్లడించారు.

తెలంగాణ విద్యారంగంలో కీలక మార్పులు..

-మొదటిపేజీ తరువాయి

పన్నెండో తరగతి వరకు విద్యను ఉన్నత విద్యా దశగా పరిగణించి, విద్యార్థులకు ప్రత్యేక బోధనా ప్రణాళిక రూపొందించాలని సీఎం సూచించారు. ఈ తరగతుల్లో విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పెంపొందించడంతో పాటు భవిష్యత్తు అవసరాలకు తగిన విద్య అందించాలని స్పష్టం చేశారు.

12వ తరగతి నుంచే నైపుణ్యాభివృద్ధి

కేవలం పాఠ్యాంశాలకే పరిమితం కాకుండా విద్యార్థుల్లో వృత్తి నైపుణ్యాలను పెంపొందించడంపై దృష్టి పెట్టాలని రేవంత్‌రెడ్డి తెలిపారు. పన్నెండో తరగతి నుంచి నైపుణ్యాభివృద్ధికి ప్రాధాన్యం ఇచ్చేలా విద్యా ప్రణాళిక రూపొందించాలని అధికారులను ఆదేశించారు. చదువు పూర్తయ్యే సమయానికి విద్యార్థులు ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు అవసరమైన నైపుణ్యాలను పొందేలా చర్యలు తీసుకోవాలన్నది ప్రభుత్వ లక్ష్యంగా పేర్కొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలను ప్రైవేటుకు ధీటుగా తీర్చిదిద్దాలి

నర్సరీ నుంచి పన్నెండో తరగతి వరకు విద్యకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తుందని సీఎం స్పష్టం చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య, మెరుగైన బోధనా ప్రమాణాలు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. ప్రైవేటు విద్యాసంస్థలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేయడమే ప్రభుత్వ సంకల్పమన్నారు.

ఒక్క విద్యార్థికీ నష్టం జరగకూడదు

విద్యా విధానంలో మార్పులు తీసుకొచ్చే సమయంలో విద్యార్థుల భవిష్యత్తుకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. కొత్త విధానం అమలుతో ఏ ఒక్క విద్యార్థి కూడా నష్టపోకూడదని స్పష్టం చేశారు. సంస్కరణలు విద్యార్థులకు ప్రయోజనం చేకూర్చేలా ఉండాలని, అమలుకు అవసరమైన కార్యాచరణను సిద్ధం చేయాలని ఆదేశించారు. ఈ సమీక్ష సమావేశంలో ప్రభుత్వ సలహాదారులు కె.కేశవరావు, సుదర్శన్‌రెడ్డి, ఎంపీ వేం నరేందర్‌రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, విద్యాశాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఎల్‌నినో దెబ్బకు యాసంగి వరిసాగుకు బ్రేక్!

-మొదటిపేజీ తరువాయి

ప్రకారం ప్రస్తుతం ఆరుతడి పంటల సాగుకే రైతులు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు.

వరి సాగులో భారీ వెనుకంజ

గతేడాది ఇదే సమయానికి సుమారు లక్ష ఎకరాల్లో వరి సాగు పనులు ప్రారంభమయ్యాయి. ఈసారి మాత్రం వరి నాట్లు ఇంకా పెద్దగా ఊపందుకోలేదు. ఈ నెల 10వ తేదీ మంగళవారం నాటికి వరి నాట్లు ప్రారంభమైనట్లు పెద్దగా నమోదు కాలేదని వ్యవసాయ శాఖ అధికారులు వెల్లడించారు. నిజామాబాద్‌తో పాటు మరికొన్ని జిల్లాల్లో రైతులు ఇప్పుడిప్పుడే వరినార్లు పోస్తున్నట్లు తెలిపారు. సాధారణంగా అక్టోబర్ చివరి వారం నుంచే రైతులు వరినార్లు పోసి, నవంబర్ మొదటి వారం నుంచి నాట్లు ప్రారంభిస్తారు. అయితే ఈసారి నీటి లభ్యతపై అనిశ్చితి నెలకొనడంతో రైతులు ఆచితూచి అడుగులు వేస్తున్నారు. నీరు అందుబాటులో లేకపోతే పెట్టుబడి నష్టపోతామనే భయంతో వరి సాగును వాయిదా వేస్తున్నారు.

మొత్తం సాగు విస్తీర్ణంపైనా ప్రభావం

వర్షాభావ పరిస్థితులు వరి పంటతో పాటు మొత్తం సాగు విస్తీర్ణంపైనా ప్రభావం చూపుతున్నాయి. గతేడాది ఇదే సమయానికి సుమారు 5.60 లక్షల ఎకరాల్లో పంటలు సాగవగా, ఈసారి దాదాపు 3.90 లక్షల ఎకరాల మేర సాగు తక్కువగా నమోదైనట్లు వ్యవసాయ శాఖ గణాంకాలు సూచిస్తున్నాయి. వానాకాలం సీజన్‌లోనూ గతేడాదితో పోలిస్తే మొత్తం పంటల సాగు విస్తీర్ణం 8 శాతం తగ్గగా, వరి సాగు విస్తీర్ణం 18 శాతం మేర తగ్గినట్లు నివేదికలు వెల్లడిస్తున్నాయి. యాసంగిలోనూ ఇదే పరిస్థితి కొనసాగుతుండటం వ్యవసాయ రంగంపై ఆందోళన కలిగిస్తోంది.

నూనెగింజలు, పప్పుధాన్యాల వైపు మొగ్గు

నీటి వినియోగం తక్కువగా ఉండే పంటల సాగుకు రైతులు ప్రాధాన్యం ఇస్తున్నారు. ఇప్పటివరకు 66,532 ఎకరాల్లో నూనెగింజల పంటలు సాగు చేశారు. ఇందులో వేరుశనగ 63,306 ఎకరాల్లో, కుసుమ 2,373 ఎకరాల్లో సాగవుతోంది. పప్పుధాన్యాల సాగు 57,337 ఎకరాలకు చేరింది. ఇందులో శనగ 42,366 ఎకరాల్లో, మినుములు 11,600 ఎకరాల్లో, పెసలు 2,006 ఎకరాల్లో సాగవుతున్నాయి. కందులు, ఉలవలు, బెబ్బర్లు కూడా అక్కడక్కడా సాగు చేస్తున్నారు.

మొక్కజొన్న, జొన్నలకూ ప్రాధాన్యం

ఆరుతడి పంటల్లో భాగంగా రైతులు మొక్కజొన్న, జొన్న సాగుపైనా దృష్టి సారిస్తున్నారు. ఇప్పటివరకు 21,044 ఎకరాల్లో మొక్కజొన్న, 12,124 ఎకరాల్లో జొన్న పంటలు సాగవుతున్నాయి. మిగిలిన విస్తీర్ణంలో పశుగ్రాసం, ఇతర పంటలను వేస్తున్నారు.

నీటి లభ్యతపై రైతుల్లో ఆందోళన

వరి సాగుకు అధిక మొత్తంలో నీరు అవసరం కావడంతో ప్రస్తుత పరిస్థితుల్లో రైతులు వెనుకంజ వేస్తున్నారు. జలాశయాల్లో నిల్వలు, భూగర్భ జలమట్టాలు, విద్యుత్తు సరఫరా పరిస్థితులు అనుకూలంగా లేకపోతే పంట మధ్యలోనే నీటి సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని ఆందోళన చెందుతున్నారు. అందుకే పెట్టుబడి నష్టాలను తగ్గించుకునేందుకు ఆరుతడి పంటలను ఎంచుకుంటున్నారు. ప్రభుత్వం కూడా నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని ప్రత్యామ్నాయ పంటల సాగును ప్రోత్సహించాల్సిన అవసరం ఉంది. రైతులకు పంటల ఎంపిక, విత్తనాల లభ్యత, మార్కెటింగ్, కనీస మద్దతు ధరపై స్పష్టమైన మార్గదర్శకాలు అందితే యాసంగి సాగులో ఇబ్బందులను కొంతవరకు అధిగమించే అవకాశం ఉంటుంది.

ఆంధ్రాకు నీళ్లు.. తెలంగాణకు ఎక్కిళ్లా?

-మొదటిపేజీ తరువాయి

గురించి ఆలోచిస్తున్నారని విమర్శించారు. ఎల్‌నినో ప్రభావంతో వ్యవసాయ రంగం ఇబ్బందులు ఎదుర్కొంటున్న సమయంలో రైతులకు భరోసా కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. కరోనా సమయంలో అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రజలకు అండగా నిలిచారని గుర్తుచేశారు. ప్రజల దృష్టిని అసలు సమస్యల నుంచి మళ్లించేందుకే ముఖ్యమంత్రి నాటకాల గురించి మాట్లాడుతున్నారని కేటీఆర్ వ్యాఖ్యానించారు. నాటకాలు, ఉపన్యాసాలతో రైతుల కడుపు నిండదని, వారికి కావాల్సింది సాగునీరు, విద్యుత్, ఆర్థిక సాయం అని అన్నారు.

సాగునీటి ప్రాజెక్టులపై ప్రశ్నలు

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని రైతుల ప్రయోజనాల కోసం కేసీఆర్ సదర్మాట్ ప్రాజెక్టు నిర్మించినప్పటికీ, కాంగ్రెస్ ప్రభుత్వం దాని నీటిని పూర్తిస్థాయిలో వినియోగించుకోవడం లేదని కేటీఆర్ ఆరోపించారు. కాళేశ్వరం నుంచి నిజాంసాగర్‌కు నీటిని ఎత్తిపోసి ఉంటే ఎల్‌నినో ప్రభావం ఉన్నప్పటికీ రైతులకు ఇన్ని ఇబ్బందులు వచ్చేవి కావని అభిప్రాయపడ్డారు. కృష్ణా, గోదావరి నదుల్లో అందుబాటులో ఉన్న నీటిని వినియోగించుకుండా దిగువకు వదిలేస్తున్నారని విమర్శించారు. పట్టిసీమ ద్వారా ఏపీ నీటిని ఎత్తిపోస్తుండగా, కన్నెపల్లి, దేవాదుల వద్ద తెలంగాణ ప్రభుత్వం పంపులు ఎందుకు ప్రారంభించడం లేదని ప్రశ్నించారు. శ్రీశైలం నీటిని కుప్పం వరకు తీసుకెళ్తుంటే, పక్కనే ఉన్న పాలమూరు ప్రాంత రైతుల పొలాలు ఎందుకు ఎండిపోతున్నాయని నిలదీశారు.

మూడేళ్లలో రూ.4.5 లక్షల కోట్ల అప్పు?

కాంగ్రెస్ ప్రభుత్వం మూడేళ్ల పాలనలో సుమారు రూ.4.5 లక్షల కోట్ల అప్పు చేసిందని కేటీఆర్ ఆరోపించారు. హైదరాబాద్‌లో ప్రభుత్వ భూములను ఇష్టారీతిన విక్రయిస్తున్నారని విమర్శించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా అప్పులు ఎందుకు చేస్తున్నారని ప్రశ్నించారు. అమ్మఒడి వాహనాలు, గర్భిణులు, బాలింతలకు అందించే ప్రసూతి సహాయం వంటి పథకాలను నిలిపివేశారని ఆరోపించారు. విద్యా భరోసా హామీ అమలు



చేయకుండా ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు సుమారు రూ.12 వేల కోట్లకు చేరాయని పేర్కొన్నారు. ఈ ఆరోపణలపై ప్రభుత్వం స్పందనను కూడా పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంది.

ఆదివాసీ ప్రాంతాల అభివృద్ధి కేసీఆర్‌తోనే

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని గూడేలను కేసీఆర్ హయాంలో గ్రామపంచాయతీలుగా మార్చామని కేటీఆర్ తెలిపారు. జిల్లాలో సుమారు 4.5 లక్షల ఎకరాలకు పోడు పట్టాలు అందించినట్లు చెప్పారు. ప్రతి గ్రామానికి ట్రాక్టర్ కొనుగోలు చేసి ఇచ్చామని, వాటికి డీజిల్ పోయడానికి కూడా ప్రస్తుత ప్రభుత్వానికి చేతకావడం లేదని విమర్శించారు. నిర్మల్ జిల్లాను ఏర్పాటు చేసి ప్రాంత అభివృద్ధికి కేసీఆర్ కృషి చేశారని అన్నారు. స్థానిక బీజేపీ ఎమ్మెల్యే జిల్లాకు చేసిందేమీ లేదని ఆరోపించారు. ఎనిమిది మంది బీజేపీ ఎమ్మెల్యేలు, ఎనిమిది మంది ఎంపీలు ఉన్నప్పటికీ ప్రజలకు ప్రయోజనం చేకూర్చే పనులు చేయడం లేదని విమర్శించారు. కాంగ్రెస్, బీజేపీ రెండూ ఒకే విధంగా వ్యవహరిస్తున్నాయని వ్యాఖ్యానించారు.

మిగిలిన రైతు రుణమాఫీ పూర్తి చేయాలి

రైతులకు సంబంధించిన పెండింగ్ సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. బ్యాంకు రుణాలను తక్షణమే రీషెడ్యూల్ చేయాలని, మిగిలిపోయిన రైతు రుణమాఫీని పూర్తిచేయాలని కోరారు. రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కాలయాపన చేయడం సరికాదన్నారు.

యువత, ఉద్యోగులు, సంక్షేమ పథకాలపైనా విమర్శలు

ఉద్యోగాల భర్తీ ప్రక్రియలో జాప్యం జరుగుతోందని, నిరుద్యోగ భృతి హామీ అమలు కాలేదని కేటీఆర్ విమర్శించారు. ఉద్యోగులకు పీఆర్సీ, డీఏలు, రిటైర్డ్ ఉద్యోగులకు పింఛన్ల చెల్లింపుల విషయంలోనూ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. రంజాన్ తోఫా, క్రిస్మస్ కానుకలు, కేసీఆర్ కిట్ వంటి పథకాలు నిలిచిపోయాయని అన్నారు. రైతులు, యువత, ఉద్యోగులు, మహిళలు సహా వివిధ వర్గాలకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్ చేశారు. రైతుల సమస్యలపై బీఆర్ఎస్ పోరాటం కొనసాగిస్తుందని కేటీఆర్ స్పష్టం చేశారు.

బీజేపీ పాలిత గుజరాత్‌లో మైనార్టీ రిజర్వేషన్ ఎందుకు తొలగించటం లేదు

కాంగ్రెస్ ప్రభుత్వం మైనార్టీలకు విద్య, ఉద్యోగాల్లో 4 శాతం రిజర్వేషన్లు కల్పించిందని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. సచార్ కమిటీ సూచన మేరకు మైనార్టీలకు ప్రత్యేక రిజర్వేషన్ కల్పించిందన్నారు. దీంతో మైనార్టీలకు విద్య, ఉద్యోగ అవకాశాలు పెరిగాయని తెలిపారు. బంజారాహిల్స్‌లో జాతీయ విద్యా, మైనారిటీల సంక్షేమ దినోత్సవంలో సీఎం పాల్గొన్నారు. మైనార్టీశాఖ ఏర్పాటు చేసిన స్టాళ్లను ఆ శాఖ మంత్రి అజారుద్దీన్?తో కలిసి పరిశీలించారు. మైనార్టీలకు 4 శాతం రిజర్వేషన్ తొలగించాలని బీజేపీ డిమాండ్? చేస్తోందని సీఎం చెప్పారు. గుజరాత్‌లోనూ మైనార్టీలకు రిజర్వేషన్ అమలు చేస్తున్నారని, మరి అక్కడెందుకు తొలగించడం లేదని నిలదీశారు. గుజరాత్‌లో తొలగించడం లేదు కానీ, తెలంగాణలో రిజర్వేషన్?లు తీసేస్తామని బీజేపీ నేతలు అంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మైనార్టీలను ఓటుహక్కుకు కూడా దూరం చేయాలని బీజేపీ కుట్ర చేస్తోందని మండిపడ్డారు. సర్ పేరిట మైనార్టీలు, ఎస్టీలు, ఆదివాసీలు, పేదల ఓట్లను భారీగా తొలగిస్తున్నారని ఆరోపించారు.

బీజేపీ రాజకీయం చేస్తోంది

కాంగ్రెస్, బీజేపీ ఒక్కటేనని బీఆర్ఎస్ ఆరోపిస్తోందన్న రేవంత్ రెడ్డి, ప్రధాని మోదీని ఓడించి గద్దె దించడమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని స్పష్టం చేశారు. దిల్లీకి వెళ్లి మోదీ ఎదుట సాగిలపడిందో ఎవరో అందరికీ తెలుసని ఎద్దేవా చేశారు. కొందరు నేతలు మైనార్టీల ముందు ఒకలా దిల్లీకి వెళ్లాక మరోలా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. మోదీ ముందు తలవంచే పార్టీలకు కాంగ్రెస్ భిన్నంగా ఉంటుందని స్పష్టం చేశారు. మైనార్టీ విద్యార్థులకు ఇచ్చే స్కాలర్‌షిప్‌లపైనా బీజేపీ రాజకీయం చేస్తోందని విమర్శించారు.

నైట్ ఎకానమీ పెరుగుతుంది

మైనార్టీ విద్యార్థులను కాంగ్రెస్ ప్రభుత్వం అన్నివిధాలా ప్రోత్సహిస్తోందని, క్రికెట్‌లో రాణించిన సిరాజ్‌కు డీఎస్పీ ఉద్యోగం ఇచ్చి గౌరవించామన్నారు. షబ్బీర్, అజారుద్దీన్, ఫిరోజ్‌ఖాన్‌కు టికెట్లు ఇచ్చామని, వాళ్లు గెలవకపోయినా, ఇచ్చిన మాట ప్రకారం అజారుద్దీన్‌కు మంత్రి పదవి ఇచ్చామని గుర్తు చేశారు. మీరాలం చెరువుపై రూ.600 కోట్లతో కేబుల్ బ్రిడ్జిని నిర్మిస్తున్నామని, మీరాలం చెరువును అద్భుతమైన పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేస్తున్నామన్నారు. మూసీలో ఆక్రమణలు తొలగించి అభివృద్ధి చేస్తున్నామని, మూసీ సుందరీకరణ పూర్తయితే మూసీ, పాతబస్తీని చూసేందుకు ఎక్కడెక్కడి నుంచో వస్తారని వెల్లడించారు. మూసీ సుందరీకరణ పూర్తైతే హైదరాబాద్‌లో నైట్ ఎకానమీ పెరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

క్రషర్లలో అక్రమాల దందా సాగుతోందా?

– నిన్న కేఎన్‌పీ క్రషర్...నేడు గాయత్రి స్టోన్ క్రషర్!

– ట్రాన్సిట్ పాస్ ఎక్కడ? ట్రిప్ షీట్ పేరుతో కంకర రవాణా ఎలా?

– క్రషర్ యజమాని వివరణ ఒకలా.. టిప్పర్ యజమాని వాంగ్మూలం మరోలా!

– మైనింగ్ ఏడీకి ఫోన్ చేసినా స్పందన కరువు... పర్యవేక్షణ ఎక్కడ?

ఉమ్మడి మహబూబ్‌నగర్ బ్యూరో నవంబర్ 11 మీ వార్త :

వనపర్తి టౌన్ న్యూస్ : వనపర్తి జిల్లాలో స్టోన్ క్రషర్ల నుంచి కంకర రవాణా జరుగుతున్న తీరుపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఖనిజ సంపద రవాణాకు సంబంధించి తప్పనిసరిగా ఉండాల్సిన అనుమతులు, ట్రాన్సిట్ పాస్‌లు, సంబంధిత పత్రాల విషయంలో కొన్ని క్రషర్ల వద్ద నిర్లక్ష్యం జరుగుతోందా? లేక నిబంధనలకు విరుద్ధంగా రవాణా సాగుతోందా? అన్న ప్రశ్నలు ఇప్పుడు జిల్లావ్యాప్తంగా చర్చనీయాంశంగా మారుతున్నాయి.నిన్న కానాయపల్లిలో కేఎన్‌పీ క్రషర్‌కు సంబంధించిన కంకర రవాణా వ్యవహారం వెలుగులోకి రాగా, తాజాగా మదనాపురం పరిధిలోని గాయత్రి స్టోన్ క్రషర్ నుంచి వనపర్తి పట్టణానికి వచ్చిన కంకర టిప్పర్ వ్యవహారం మరోసారి చర్చకు దారితీసింది.

ట్రాన్సిట్ పాస్‌కు బదులుగా చీటీలేనా?

గాయత్రి స్టోన్ క్రషర్ నుంచి టీజీ 06 టీ 0925 నంబరు గల టిప్పర్‌లో 20 ఎంఎం కంకర 6 యూనిట్ల లోడుతో వనపర్తి పట్టణానికి వచ్చినట్లు గుర్తించారు. ఈ వాహనానికి సంబంధించిన ట్రాన్సిట్ పాస్ (టీపీ), వే బిల్లు, లేకుండా రవాణా అనుమతి పత్రాలు ఎక్కడ ఉన్నాయనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.ఈ విషయంపై గాయత్రి స్టోన్ క్రషర్ యజమాని మాధవరెడ్డిని వివరణ కోరగా, “సార్.. ఆ టీపీ ఉంటుంది. ఆఫ్‌లైడీ మేము రాయల్టీ కట్టాము. మా వాళ్లు రాసి పెడతారు. ప్రతి వాహనానికి టీపీ ఇస్తాము” అని వివరించినట్లు తెలిపారు.అయితే, ప్రతి వాహనానికి తప్పనిసరిగా సంబంధిత పత్రాలు ఇవ్వకుండా పంపితే తప్పు కదా అని ప్రశ్నించగా, “అవును సార్.. తప్పే కదా” అని అంగీకరించినట్లు వెల్లడించారు. అయినప్పటికీ, తమ వద్ద టీపీలు ఉంటాయని, సిబ్బంది తీసి పెడతారని ఆయన స్పష్టం చేసినట్లు సమాచారం.

6 యూనిట్ల 20 ఎంఎం కంకర ధర రూ.22 వేలా?

ఇదే విషయంపై టిప్పర్ యజమానిని వివరణ కోరగా, గాయత్రి స్టోన్ క్రషర్ నుంచి ఆరు యూనిట్ల 20 ఎంఎం కంకరను తీసుకుని మదనాపురం నుంచి వనపర్తి పట్టణంలోని ఓ నిర్మాణ పనికి తీసుకువచ్చినట్లు తెలిపారు.ఈ కంకర కోసం రూ.22,000 వేలు చెల్లించినట్లు టిప్పర్ యజమాని వివరించారు.అయితే, క్రషర్ నుంచి ట్రాన్సిట్ పాస్ ఇచ్చారా? అని ప్రశ్నించగా, తమ క్రషర్ నుంచి తమ టిప్పర్లలో కూడా ఇలాంటి చీటీ ఇచ్చి పంపుతామని, భయపడాల్సిన అవసరం లేదని క్రషర్ యజమాని చెప్పినట్లు టిప్పర్ యజమాని వెల్లడించారు.ఇక్కడే అసలు ప్రశ్న మొదలవుతోంది. ఆ చీటీ అధికారిక ట్రాన్సిట్ పాస్‌నా? రాయల్టీ చెల్లింపునకు సంబంధించిన ఆధారమా? లేక కేవలం క్రషర్ అంతర్గతంగా ఇచ్చే రవాణా చీటీనా? అధికారులు స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉంది.







నిన్న కేఎన్‌పీ.. నేడు గాయత్రి.. రేపు ఏ క్రషర్?

జిల్లాలోని క్రషర్ల నుంచి కంకర రవాణా వ్యవహారంపై వరుసగా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. లీజు గడువు ముగిసిన క్రషర్ల నుంచి కూడా రవాణా జరుగుతోందన్న ఆరోపణలు వినిపిస్తుండగా, లీజు కొనసాగుతున్న క్రషర్లలోనూ పత్రాల నిర్వహణపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి.లీజు ఉన్నా లేకున్నా నిబంధనల అమలు విషయంలో తేడా ఏమిటి? ప్రతి వాహనానికి చట్టబద్ధమైన ట్రాన్సిట్ పాస్ జారీ అవుతోందా? రాయల్టీ చెల్లింపులు సక్రమంగా జరుగుతున్నాయా? రవాణా చేసే ఖనిజం పరిమాణం, పత్రాల్లో నమోదు చేసిన పరిమాణం సరిపోతున్నాయా? అనే అంశాలపై సమగ్ర విచారణ జరగాల్సి ఉంది.

మైనింగ్ ఏడీ పర్యవేక్షణ ఎక్కడ? తనిఖీలు ఎన్ని?

జిల్లాలోని స్టోన్ క్రషర్లపై మైనింగ్ శాఖ అధికారులు ఎలాంటి పర్యవేక్షణ చేస్తున్నారు? ఇప్పటివరకు ఎన్ని క్రషర్లను తనిఖీ చేశారు? నిబంధనలు ఉల్లంఘించిన ఎన్ని క్రషర్లకు పెనాల్టీలు విధించారు? ఎన్ని డిమాండ్ నోటీసులు జారీ చేశారు? ఎన్ని క్రషర్ల కార్యకలాపాలను నిలిపివేశారు? లీజు గడువు ముగిసిన క్రషర్లపై ఎలాంటి చర్యలు తీసుకున్నారు? అనే ప్రశ్నలకు మైనింగ్ శాఖ సమాధానం చెప్పాల్సిన అవసరం ఉంది.

వివరణ కోరినా స్పందించని మైనింగ్ ఏడీ!

గాయత్రి స్టోన్ క్రషర్ నుంచి ట్రాన్సిట్ పాస్‌కు సంబంధించిన స్పష్టత లేకుండా కంకర రవాణా జరుగుతోందన్న అంశంపై మైనింగ్ ఏడీకి ఫోన్ చేసి వివరణ కోరేందుకు ప్రయత్నించగా స్పందించలేదని సమాచారం. పలుమార్లు ఫోన్ చేసినప్పటికీ కాల్ కట్ చేయడం లేదా స్పందించకపోవడంతో అధికారిక వివరణ అందుబాటులోకి రాలేదు.ఒక జర్నలిస్టుగా ప్రజా ప్రయోజనాలకు సంబంధించిన అంశంపై వివరణ కోరడం బాధ్యత. అలాంటి ప్రశ్నలకు సంబంధిత అధికారులు స్పందించి వాస్తవాలను ప్రజలకు తెలియజేయాల్సిన అవసరం ఉంది.

జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకోవాలి!

వనపర్తి జిల్లాలోని అన్ని స్టోన్ క్రషర్లపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించి, ప్రతి వాహనానికి చట్టబద్ధమైన ట్రాన్సిట్ పాస్ జారీ అవుతోందా లేదా పరిశీలించాలని ప్రజలు కోరుతున్నారు. రాయల్టీ చెల్లింపులు, లీజు అనుమతులు, ఖనిజ నిల్వలు, రవాణా రికార్డులను సమగ్రంగా తనిఖీ చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.ప్రభుత్వ ఆదాయానికి గండి పడకుండా, అక్రమ ఖనిజ రవాణాకు అడ్డుకట్ట వేసేలా మైనింగ్ శాఖ అధికారులు పారదర్శకంగా వ్యవహరించాల్సిన అవసరం ఉంది.

ప్రజల ముందున్న ప్రశ్న ఒక్కటే...

క్రషర్ల నుంచి బయటకు వెళ్లే ప్రతి టిప్పర్‌కు అధికారిక ట్రాన్సిట్ పాస్ ఉంటుందా? లేక చీటీ రాసి పంపితే సరిపోతుందా? నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకునే బాధ్యత మైనింగ్ శాఖదే కాదా?
ఈ ప్రశ్నలకు జిల్లా మైనింగ్ అధికారులు సమాధానం చెప్పాలి...

జనగణనలో ఓబీసీ కాలమ్ చేర్చాలి

కులానికి ప్రత్యేక యూనిక్ కోడ్ కేటాయించాలి
జాతీయ బీసీ హక్కుల పోరాట సమితి నిరసన
అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం

మంచిర్యాల : కేంద్ర ప్రభుత్వం చేపట్టనున్న జనగణనలో ఓబీసీ కాలమ్‌ను చేర్చి, ప్రతి కులానికి ప్రత్యేక యూనిక్ కోడ్ కేటాయించాలని మంచిర్యాల జిల్లా జాతీయ బీసీ హక్కుల పోరాట సమితి నాయకులు డిమాండ్ చేశారు. ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరిని విడనాడాలని కోరుతూ బుధవారం హాజీపూర్ మండల కేంద్రంలోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి బుధవారం వినతిపత్రం సమర్పించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, బ్రిటిష్ పాలనలో 1931లోనే కులగణన చేపట్టారని, దేశానికి స్వాతంత్ర్యం వచ్చి దాదాపు 80 సంవత్సరాలు గడుస్తున్నప్పటికీ బీసీ కులగణన చేపట్టకపోవడం బీసీల పట్ల వివక్షకు నిదర్శనమని విమర్శించారు. పార్లమెంట్ సాక్షిగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ బీసీ కులగణన చేపడతామని ప్రకటించినప్పటికీ ఆ హామీ కార్యరూపం దాల్చకపోవడం బాధాకరమన్నారు. దేశవ్యాప్తంగా, రాష్ట్రంలో అనేక సంవత్సరాలుగా బీసీ కులగణన కోసం ఉద్యమాలు కొనసాగుతున్నాయని, బీసీ సమాజం చేస్తున్న న్యాయమైన డిమాండ్‌ను పరిష్కరించడంలో కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. జనగణనలో ఓబీసీ కాలమ్ చేర్చి కులగణన చేపడితే బీసీల వాస్తవ జనాభా వెల్లడవుతుందని, తద్వారా చట్టసభల్లో బీసీలకు రాజకీయ రిజర్వేషన్లు కల్పించడంతోపాటు విద్య, ఉద్యోగాలు, స్థానిక సంస్థల్లో ప్రస్తుతం అమలవుతున్న రిజర్వేషన్లను పెంచాల్సి వస్తుందనే ఉద్దేశంతోనే కేంద్ర పాలకులు వెనుకడుగు వేస్తున్నారని ఆరోపించారు. బీసీ కులగణనకు అనుకూలంగా దేశంలోని పది రాష్ట్రాల శాసనసభలు తీర్మానాలు చేసి కేంద్రానికి పంపించాయని, దేశంలో గుర్తింపు పొందిన 27 రాజకీయ పార్టీలు సైతం బీసీ కులగణన చేపట్టాలని కేంద్ర ప్రభుత్వానికి లేఖలు రాశాయని గుర్తుచేశారు. ఇంతటి విస్తృత మద్దతు ఉన్నప్పటికీ కులగణన చేపట్టకపోవడం బీసీలపై వివక్ష, కుట్రగా భావించాల్సి వస్తోందన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం జనగణనలో ఓబీసీ కాలమ్‌ను చేర్చి, ప్రతి కులానికి ప్రత్యేక యూనిక్ కోడ్ కేటాయించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఈ అంశాన్ని బీసీ సమాజం ముందుకు తీసుకెళ్లి, బీజేపీ ప్రభుత్వ వైఖరిని ఎండగడతామని, బీసీ సమాజం ముందు ఆ ప్రభుత్వాన్ని దోషిగా నిలబెడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జాతీయ బీసీ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు గుమ్ముల శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి పెద్దళ్ల చంద్రకాంత్ (ఎం.టెక్), శకపురి భీంసేన్ తదితరులు పాల్గొన్నారు.





ఆ రెండు పార్టీలు సైలెంట్

హైదరాబాద్ : ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ వైవాహిక జీవిత పరిణామాలపై అటు అధికార భాగస్వామి తెలుగుదేశం పార్టీ, ఇటు ప్రధాన ప్రతిపక్షం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలు బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ తమ శ్రేణులకు కఠిన సంయమన మార్గదర్శకాలను జారీ చేశాయి. నాయకుల వ్యక్తిగత వ్యవహారాలను రాజకీయాల్లోకి లాగవద్దని, ఎలాంటి అనుచిత పోస్టులు పెట్టవద్దని ఆ రెండు పార్టీలు హెచ్చరించాయి. అయితే, క్షేత్రస్థాయిలో ప్రధాన పార్టీలు హుందాతనం ప్రదర్శిస్తుంటే.. జనసేన ముసుగులో ఉన్న కొందరు సోషల్ మీడియా ఔత్సాహికులు, అభిమానులు మాత్రం పరిస్థితిని అనవసరంగా రగిలిస్తూ వివాదాలను పెంచి పోషిస్తున్నారు.జనసేన పార్టీ సోషల్ మీడియా బలానికి, బలహీనతకు ప్రధాన కారణం అందులో అత్యధికులు సాధారణ సినీ అభిమానులే కావడం. వీరిలో చాలామందికి పార్టీ సంస్థాగత నియమావళి, రాజకీయ లక్ష్మణరేఖలపై ఎలాంటి స్పష్టమైన అవగాహన ఉండదు. అధికారిక పార్టీ గొడుగు కింద క్రమశిక్షణతో కాకుండా, వ్యక్తిగత ఖాతాల ద్వారా తాము పవన్ కల్యాణ్‌ను కాపాడుతున్నాం అనే భ్రమలో చేసే పోస్టులు చివరకు పార్టీకే తీవ్ర కీడు చేస్తున్నాయి. స్వయంగా పవన్ కల్యాణ్ పీఆర్వో అధికారికంగా విడాకుల ప్రెస్ నోట్‌ను విడుదల చేసినప్పటికీ.. ఆ విషయాన్ని సైతం టీడీపీ వర్గాలే మీడియాకు లీక్ చేశాయంటూ మిత్రపక్షంపై బురదజల్లే పోస్టులు పెట్టడం వీరి రాజకీయ అపరిపక్వతకు నిదర్శనం. మిత్రధర్మాన్ని విస్మరించి టీడీపీ శ్రేణులను బహిరంగంగా కించపరచడం, ప్రతి చిన్న అంశానికీ ప్రత్యర్థులతో పాటు మిత్రులనూ రెచ్చగొట్టడం వీరి ప్రధాన ధోరణిగా మారింది.ఈ గందరగోళంలో మరో ప్రమాదకరమైన కోణం కూడా దాగి ఉంది. జనసేన అభిమానుల రూపంలో చెలరేగిపోతున్న కొందరు ఖాతాదారులు వాస్తవానికి వైసీపీకి చెందిన కోవర్ట్స్ అన్న అనుమానాలు బలంగా వ్యక్తమవుతున్నాయి. టీడీపీ–జనసేన కూటమిని మానసికంగా, రాజకీయంగా చీల్చడమే లక్ష్యంగా పెట్టుకున్న కొందరు కేటుగాళ్లు.. తాము పవన్ భక్తులమని చెప్పుకుంటూ సోషల్ మీడియాలో టీడీపీ నాయకత్వంపై, చంద్రబాబుపై అత్యంత విషపూరిత ప్రచారం సాగిస్తున్నారు. పవన్ వ్యక్తిగత అంశాన్ని నెపంగా చూపి ఇరు పార్టీల కేడర్ మధ్య చిచ్చుపెట్టేందుకు ఇలాంటి ముసుగు ఖాతాలు శతవిధాలా ప్రయత్నిస్తున్నాయి. ఈ కుట్రను గ్రహించలేని అమాయక జనసేన అభిమానులు కూడా ఆ ఉచ్చులో పడి కూటమి సమన్వయాన్ని దెబ్బతీసేలా ప్రవర్తిస్తుండటం పార్టీ సీనియర్లను ఆందోళనకు గురిచేస్తోంది.జనసేన అధిష్ఠానం, పార్టీ అధికారిక డిజిటల్ వింగ్ తక్షణమే కళ్లు తెరిచి దిద్దుబాటు చర్యలు చేపట్టాల్సిన అనివార్యత ఏర్పడింది. అసలైన కార్యకర్తలు ఎవరు, విధ్వంసకర ఫ్యాన్స్ ఎవరు, ప్రత్యర్థి పార్టీల నుంచి చొరబడిన కోవర్టులు ఎవరన్నది వడపోసి కఠిన చర్యలు తీసుకోవాలి. అధికారిక వేదికల ద్వారా మిత్రపక్షాలపై తప్పుడు ఆరోపణలు చేసే ఖాతాలను బహిరంగంగా తిరస్కరించాలి. రాజకీయ పరిణతి లేకుండా సోషల్ మీడియాలో రెచ్చిపోతే అంతిమంగా నష్టపోయేది పవన్ కల్యాణ్ ఇమేజ్, కూటమి స్థిరత్వమేనన్న నిజాన్ని అభిమానులకు బోధించాల్సిన బాధ్యత జనసేన అగ్ర నాయకత్వంపై ఉంది. ఈ అనియంత్రిత శక్తులను ఇప్పటికైనా కట్టడి చేయకపోతే.. బయటి శత్రువుల కంటే అనుకూల శత్రువుల వల్లే జనసేనకు ఎక్కువ నష్టం వాటిల్లే ప్రమాదం పొంచి ఉంది.

బిజినెస్

అంతెత్తున ఎగిసి ఆపై దిగి వచ్చి..

చివరికి లాభాలతోనే ముగిసిన స్టాక్ మార్కెట్లు..!



దేశీయ స్టాక్ మార్కెట్లు బుధవారం లాభాలతో ముగిశాయి. చమురు ధరల పతనం, ఆసియా మార్కెట్ల సానుకూల సంకేతాలతో సూచీలు ఉదయం ఉరకలేశాయి. ఆ తర్వాత అమాంతం చతికిలపడ్డాయి. చివరకు కోలుకుని లాభాలతో ముగిశాయి. ఇవాళ్టి ట్రేడింగ్‌లో సెన్సెక్స్ 770 పాయింట్లకుపైగా లాభపడగా, నిఫ్టీ 25,200 మార్క్ పైన ముగిసింది. క్రితం సెషన్ ముగింపు (81,106.65) తో పోలిస్తే ఈ ఉదయం సెన్సెక్స్ దాదాపు 1100 పాయింట్ల లాభంతో 82,248.68 వద్ద ఉత్సాహంగా ట్రేడింగ్‌ను ప్రారంభించింది. ఒక దశలో 82,520 వద్ద ఎనిమిది నెలల గరిష్ఠస్థాయిని తాకింది. ఈ దశలో మదుపర్లు లాభాల స్వీకరణకు మొగ్గుచూపడంతో సూచీలు తీవ్ర ఒత్తిడికి గురయ్యాయి. ఐటీ, రియల్టీ షేర్లలో అమ్మకాలతో కుదేలైన సెన్సెక్స్.. 81,417 పాయింట్ల వద్ద ఇంట్రాడే కనిష్ఠాన్ని నమోదు చేసింది. అంటే గరిష్ఠస్థాయి నుంచి దాదాపు 1000 పాయింట్లు తగ్గింది. చివరి సెషన్‌లో కోలుకున్న సూచీలు మార్కెట్ ముగిసే సమయానికి 772.75 పాయింట్లు పెరిగి 81,879 వద్ద స్థిరపడింది. అటు నిఫ్టీ 210 పాయింట్ల లాభపడి 25,255 వద్ద ముగిసింది. డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ ఎనిమిది పైసలు పెరిగి 93.69 గా స్థిరపడింది. పశ్చిమాసియా ఉద్రిక్తతలు సద్దుమణుగుతాయనే అంచనాలతో ముడిచమురు ధరలు దిగొచ్చాయి.

ఐపీవోకు 'హిందుస్తాన్ కోకకోలా'..

99.75 కోట్ల షేర్ల ఆఫర్



న్యూఢిల్లీ: గ్లోబల్ పానీయాల దిగ్గజం కోకకోలా కంపెనీ దేశీ బాట్లింగ్ బిజినెస్ హిందుస్తాన్ కోకకోలా హోల్డింగ్స్(హెచ్‌సీసీహెచ్) పబ్లిక్ ఇష్యూ బాట పట్టింది. ఇందుకు అనుగుణంగా క్యాపిటల్ మా ర్కెట్ల నియంత్రణ సంస్థ సెబీకి ముసాయిదా ప్రాస్పెక్టస్ దాఖలు చేసింది. ఐపీవోలో భాగంగా విదేశీ ప్రమోటర్ కంపెనీ హిందుస్తాన్ కోకకోలా ఓవర్‌సీస్ హోల్డింగ్స్ పీటీఈ 99.75 కోట్ల ఈక్విటీ షేర్లను ఆఫర్ చేయనుంది. వెరసి ఐపీవో నిధులు ప్రమోటర్లకు చేరనున్నాయి. దేశీ బాట్లింగ్ విభాగం హిందుస్తాన్ కోకకోలా బెవరేజెస్(హెచ్‌సీసీబీ)ను త్వరలో లిస్ట్ చేయనున్నట్లు మాతృ సంస్థ హెచ్‌సీసీహెచ్ ఈ ఏడాది జూన్‌లో ప్రకటించిన సంగతి తెలిసిందే.

అతిపెద్ద కంపెనీగా..

ఆదాయరీత్యా 2025--26లో నాన్‌ఆల్కహాలిక్ రెడీ టు డ్రింక్ పానీయాల విభాగంలో హెచ్‌సీసీహెచ్ దేశీయంగా అతిపెద్ద కంపెనీగా నిలిచినట్లు టీకేసీ నివేదిక పేర్కొంది. దేశీ కోకకోలా వ్యవస్థలో అతిపెద్ద బాట్లర్‌గానూ కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్లు తెలియజేసింది. కంపెనీ కోక కోలాకు చెందిన విభిన్న పానీయాల ప్యాకేజింగ్, పంపిణీ, విక్రయాలను చేపడుతోంది. కోకకోలా ఓవర్‌సీస్ ద్వారా హెచ్‌సీసీహెచ్‌లో విదేశీ మాతృ సంస్థ కోకకోలా కంపెనీ 60 శాతం వాటాను కలిగి ఉంది.

బ్యాటరీ వ్యర్థాల ఎగుమతులపై నిషేధం



దేశంలో ఎలక్ట్రిక్ వాహనాలు, పునరుత్పాదక శక్తి నిల్వ వ్యవస్థల వినియోగం వేగంగా పెరుగుతున్న తరుణంలో కేంద్ర ప్రభుత్వం ఒక నిర్ణయం తీసుకుంది. ముందస్తు వర్గీకరణ చేయని (అన్‌సార్టెడ్) బ్యాటరీ వ్యర్థాలు, లిథియం-అయాన్ బ్యాటరీ బ్లాక్ మాస్ ఎగుమతులను తక్షణమే నిషేధిస్తూ కేంద్ర వాణిజ్య మంత్రిత్వ శాఖకు చెందిన డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్ (డీజీఎఫ్‌టీ) అధికారిక ప్రకటన జారీ చేసింది. తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకు ఈ నిషేధం అమల్లో ఉంటుందని స్పష్టం చేసింది.

మారిన ఎగుమతి విధానం

గతంలో ఐటీసీ (హెచ్ఎస్) కోడ్ కింద ఉన్న ప్రాథమిక సెల్స్, ప్రైమరీ బ్యాటరీలు, ఎలక్ట్రిక్ అక్యుములేటర్లు అలాగే వినియోగించిన బ్యాటరీల వ్యర్థాల ఎగుమతి విధానం 'స్వేచ్ఛ'(ఫ్రీ) జాబితాలో ఉండేది. అయితే, ఎలాంటి సీసం (లెడ్), కాడ్మియం లేదా పాదరసం లేని, వర్గీకరించని బ్యాటరీ స్క్రాప్, లిథియం-అయాన్ బ్యాటరీ బ్లాక్ మాస్‌ను ఇప్పుడు నిషేధిత జాబితాలోకి మారుస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దీనివల్ల దేశీయ ఎగుమతిదారులు ఇకపై ఈ నిర్దిష్ట వ్యర్థాలను విదేశాలకు తరలించడానికి వీలు ఉండదు.

ఈ నిర్ణయం వెనుక కారణం

లిథియం-అయాన్ బ్యాటరీల రీసైక్లింగ్ ద్వారా లభించే బ్లాక్ మాస్‌లో లిథియం, కోబాల్ట్, నికెల్, మాంగనీస్ వంటి విలువైన ఖనిజాలు ఉంటాయి. సరిగ్గా ఇటువంటి కీలక ఖనిజాల సంపద దేశం దాటిపోకుండా అడ్డుకోవడమే ఈ నిషేధం ప్రధాన ఉద్దేశం. భారత్‌ను గ్రీన్ ఎనర్జీ తయారీ కేంద్రంగా తీర్చిదిద్దాలనే ప్రభుత్వ లక్ష్యానికి ఇది పెద్దపీట వేస్తుంది. దేశంలో తయారయ్యే లేదా సేకరించే బ్యాటరీ వ్యర్థాలు ఇక్కడి రీసైక్లింగ్ యూనిట్లకే అందేలా చూడటం ద్వారా సర్క్యులర్ ఎకానమీ విధానాన్ని బలోపేతం చేయాలని ప్రభుత్వం భావిస్తోంది.

వ్యాపారం పెరిగినా లేఆఫ్‌లే..
1,000 ఉద్యోగాలపై కోతవేసిన పెప్సీకో



ఇంటర్నెట్‌డెస్క్: శీతలపానీయ దిగ్గజ సంస్థ పెప్సీకో తాజాగా 1,000 ఉద్యోగాలను తగ్గించుకోవాలని నిర్ణయించింది. తన ఉత్తర అమెరికా వ్యాపార కార్యకలాపాలను క్రమబద్ధీకరించేందుకు ఈ చర్యలు చేపట్టినట్లు కంపెనీ చెబుతోంది. వాస్తవానికి ఈ సంస్థ ఐరోపా, మధ్య ఆఫ్రికా వ్యాపారం ఈ త్రైమాసికంలో 5.41 బిలియన్ డాలర్లు వృద్ధి చెందినా.. ఈ నిర్ణయం తీసుకొంది. వ్యాపార అభివృద్ధి, ఆపరేషనల్ సామర్థ్యం పెంపొందించడానికి ఈ చర్యలు చేపట్టినట్లు వెల్లడించింది. పెప్సీకోలో ఇలియాట్ ఇన్వెస్ట్‌మెంట్ మేనేజ్‌మెంట్ 2025లో వాటాలు కొనుగోలు చేసిన తర్వాత పునర్‌వ్యవస్థీకరణ వేగవంతమైంది.

క్వాల్‌కామ్‌లో చర్యలు మొదలు

ఇప్పటికే ఉద్యోగులకు లేఆఫ్‌లు ఉంటాయని అక్టోబర్‌లో ప్రకటించిన క్వాల్‌కామ్ సంస్థ ఆ దిశగా చర్యలు చేపట్టింది. దీంతో ప్రపంచంలోని వివిధ దేశాల్లోని ఆ సంస్థ ఉద్యోగులు ప్రభావితం కానున్నారు. దీనికి సంబంధించి వీడ్కోలు ప్యాకేజీని ప్రకటించింది. మొదట దీనికి అంగీకరించి.. ఎగ్జిట్ పత్రాలపై సంతకం చేసిన ఉద్యోగులు అదనపు మొత్తం అందుకొంటారని వెల్లడించింది. ఇక ప్రకటించిన ప్యాకేజీ ప్రకారం రెండువారాల స్థూల వేతనం, మిగిలిన సర్వీసులో ప్రతి ఏడాదికి రెండు వారాల అదనపు వేతనం, మిగిలిన సర్వీసుకు ముందుగా లెక్కగట్టిన పరిహారం, హెల్త్‌కవరేజీకి ఏకమొత్తంలో చెల్లింపులు వంటి అంశాలున్నాయి. ఈ సారి లేఆఫ్‌ల్లో ఎన్ని ఉద్యోగాలు ప్రభావితం అవుతాయో కచ్చితంగా వెల్లడించలేదు. తొలుత భారత్‌లో 1,000 ఉద్యోగాలపై ప్రభావం పడొచ్చని భావించినా.. ఇప్పుడు ఆ సంఖ్య తక్కువగానే ఉండొచ్చని అంచనా వేస్తున్నారు. క్వాల్‌కామ్‌కు ప్రపంచ వ్యాప్తంగా 52,000 మంది ఉద్యోగులున్నారు.

'శ్రేయస్.. నీ వెనక నేనున్నా'..
పంజాబ్‌కు మారిన తర్వాత హార్దిక్ ఫస్ట్ రియాక్షన్

ట్రేడ్‌లో భాగంగా పంజాబ్ కింగ్స్‌కు మారిన హార్దిక్

కెప్టెన్, కోచ్, జట్టు, మొత్తం పంజాబ్‌కు అండగా ఉంటానని వ్యాఖ్య

తన ఆల్‌రౌండ్ నైపుణ్యాలతో టీమ్‌కు మద్దతుగా ఉంటానని సంకేతం

అతడి స్థానంలో ముంబై ఇండియన్స్‌లో చేరనున్న అర్ష్‌దీప్



ఐపీఎల్‌లో కీలక ఆటగాళ్ల ట్రేడింగ్ వ్యవహారం క్రికెట్ వర్గాల్లో ఆసక్తి రేపుతోంది. ముంబై ఇండియన్స్ మాజీ కెప్టెన్ హార్దిక్ పాండ్యా పంజాబ్ కింగ్స్ జట్టులోకి మారనున్న నేపథ్యంలో ఆ జట్టు కెప్టెన్ శ్రేయస్ అయ్యర్‌కు బలమైన సందేశం పంపించాడు. కెప్టెన్ శ్రేయస్, కోచ్ రికీ పాంటింగ్ సహా పంజాబ్ జట్టు మొత్తానికి తాను అండగా ఉంటానని స్పష్టం చేశాడు. పంజాబ్ జెర్సీతో ఉన్న ఫొటోను కూడా పంచుకున్నాడు. రెండుసార్లు ఐపీఎల్ ఫైనల్‌కు చేరిన పంజాబ్ కింగ్స్‌తో కలిసి పనిచేయడం పట్ల హార్దిక్ ఉత్సాహం వ్యక్తం చేశాడు. ఈ సందర్భంగా ఇన్‌స్టాగ్రామ్‌లో 'నా కెప్టెన్ శ్రేయస్.. నా కోచ్ రికీ.. నా జట్టు.. పంజాబ్ మొత్తం.. మీ వెనక నేనున్నా' అంటూ పోస్ట్ చేశాడు. తన ఆల్‌రౌండ్ నైపుణ్యాలతో జట్టుకు ఉపయోగపడతాననే సంకేతాలిచ్చాడు. ఐపీఎల్ చరిత్రలోనే కీలకమైన ఆటగాళ్ల మార్పిడిలో భాగంగా పంజాబ్ కింగ్స్‌కు హార్దిక్ వెళ్లనున్నాడు. అతడి స్థానంలో భారత టీ20 బౌలర్ అర్ష్‌దీప్ సింగ్ ముంబై ఇండియన్స్‌లో చేరనున్నాడు. ఈ ట్రేడింగ్‌లో హార్దిక్ పాత్రతోషికం రూ.16.35 కోట్ల నుంచి రూ.18 కోట్లకు పెరగనుంది. అర్ష్‌దీప్ మాత్రం తన ప్రస్తుత రూ.18 కోట్ల పారితోషికంతోనే ముంబై జట్టుకు మారనున్నాడు. హార్దిక్‌కు ముంబై ఇండియన్స్‌తో సుదీర్ఘ అనుబంధం ఉంది. 2015లో ఆ జట్టులో చేరిన అతడు 2015, 2017, 2019, 2020 సీజన్లలో టైటిళ్లు గెలిచిన జట్టులో సభ్యుడిగా ఉన్నాడు. ఏడు సీజన్ల తర్వాత గుజరాత్ టైటాన్స్‌కు మారి, తొలి సీజన్‌లోనే కెప్టెన్‌గా టైటిల్ అందించాడు. 2023లోనూ ఆ జట్టును ఫైనల్‌కు చేర్చాడు. 2024లో తిరిగి ముంబైకి వచ్చి కెప్టెన్సీ బాధ్యతలు చేపట్టాడు. మొత్తం 162 ఐపీఎల్ మ్యాచ్‌ల్లో హార్దిక్ 2,955 పరుగులు చేయడంతోపాటు 82 వికెట్లు పడగొట్టాడు. అయితే ముంబైతో రెండో విడత మూడేళ్ల ప్రయాణంలో ఆశించిన స్థాయిలో రాణించలేకపోయాడు. 39 మ్యాచ్‌ల్లో 647 పరుగులు, 29 వికెట్లు సాధించాడు. అతడి కెప్టెన్సీలో ముంబై 2025లో ప్లేఆఫ్స్‌కు చేరగా, 2024, 2026 సీజన్లలో తొమ్మిదో స్థానంలో నిలిచింది. మరోవైపు అర్ష్‌దీప్ 2019లో పంజాబ్ తరఫున ఐపీఎల్ అరంగేట్రం చేశాడు. ఆ జట్టు తరఫున 96 మ్యాచ్‌ల్లో 111 వికెట్లు తీసి అత్యధిక వికెట్లు సాధించిన బౌలర్‌గా నిలిచాడు. 2025 సీజన్‌లో 21 వికెట్లు, 2026లో 14 వికెట్లు పడగొట్టాడు. కొత్త బంతితో వికెట్లు తీయడంతోపాటు డెత్ ఓవర్లలోనూ బౌలింగ్ చేయగల సామర్థ్యం అతడికి ప్రత్యేక గుర్తింపు తెచ్చింది.

స్పోర్ట్స్

పురుష క్రికెటర్లతో సమానంగా మమ్మల్నీ గుర్తించండి: పాక్ కెప్టెన్ ఫాతిమా సనా

పురుషుల క్రికెట్‌తో సమానంగా మహిళల క్రికెట్ కు ఆదరణ దక్కాలన్న ఫాతిమా సనా

డబ్ల్యూబీబీఎల్‌లో పెర్త్ స్కార్చర్స్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న సనా

ఈ లీగ్‌లో ఆడుతున్న రెండో పాకిస్థాన్ మహిళా క్రికెటర్

2028 టీ20 వరల్డ్ కప్‌తో పెను మార్పులు ఖాయమన్న ఆశాభావం

మెగా టోర్నీకి ఆతిథ్యం ఇస్తున్న పాక్



పాకిస్థాన్‌లో పురుషుల క్రికెట్‌తో సమానంగా మహిళల క్రికెట్‌కు కూడా గుర్తింపు, ఆదరణ దక్కాలని ఆ దేశ మహిళల జట్టు కెప్టెన్ ఫాతిమా సనా ఆకాంక్షను వ్యక్తం చేసింది. ప్రస్తుతం ఆస్ట్రేలియాలో జరుగుతున్న ఉమెన్స్ బిగ్ బాష్ లీగ్ (డబ్ల్యూబీబీఎల్)లో పెర్త్ స్కార్చర్స్ జట్టుకు ఆమె ప్రాతినిధ్యం వహిస్తోంది. ఈ సందర్భంగా ఇచ్చిన ఇంటర్వ్యూలో ఫాతిమా సనా మాట్లాడుతూ, మహిళల క్రికెట్‌లో సమగ్ర మార్పు రావాల్సిన అవసరాన్ని నొక్కిచెప్పింది. పాకిస్థాన్‌లో పురుషుల క్రికెట్ మ్యాచ్‌లు జరుగుతున్నప్పుడు స్టేడియాలు కిక్కిరిసిపోవడం, మీడియా నుంచి విపరీతమైన ప్రచారం లభించడం సర్వసాధారణమని, సరిగ్గా అలాంటి వాతావరణం, ఉత్సాహం మహిళల మ్యాచ్‌లకు కూడా దక్కాలన్నదే తన ప్రధాన లక్ష్యమని ఫాతిమా సనా పేర్కొంది. మైదానంలో మహిళా క్రికెటర్లు సైతం పూర్తి స్థాయిలో శ్రమిస్తున్నారని, వారికి కూడా సమాన స్థాయిలో అభిమానుల మద్దతు అవసరమని ఆమె అభిప్రాయపడింది. ఈ ఏడాది అంతర్జాతీయ క్రికెట్‌లో కేవలం 15 బంతుల్లోనే మెరుపు అర్ధశతకం సాధించి ప్రపంచ రికార్డు సృష్టించిన ఫాతిమా సనా, మహిళల బిగ్ బాష్ లీగ్‌లో అడుగుపెట్టిన రెండో పాకిస్థానీ క్రీడాకారిణిగా నిలిచింది. గతంలో 2019లో నిదా దార్ ఈ లీగ్‌లో ఆడగా, మళ్లీ ఇన్నాళ్లకు ఫాతిమాకు ఈ అవకాశం లభించింది. డబ్ల్యూబీబీఎల్ వంటి నాణ్యమైన అంతర్జాతీయ లీగ్‌లలో ఆడటం వల్ల నైపుణ్యాలు మెరుగుపడతాయని, తన అనుభవం భవిష్యత్తులో మరింత మంది పాకిస్థానీ అమ్మాయిలు విదేశీ లీగ్‌లకు ఎంపికయ్యేందుకు మార్గం సుగమం చేస్తుందని ఆమె ఆశాభావం వ్యక్తం చేసింది. మరోవైపు, 2028లో జరగనున్న మహిళల టీ20 ప్రపంచకప్‌కు పాకిస్థాన్ ఆతిథ్యం ఇవ్వనుండటంపై ఫాతిమా సనా స్పందిస్తూ.. ఈ మెగా ఈవెంట్ దేశంలో మహిళల క్రీడారంగానికి ఒక గేమ్ ఛేంజర్‌గా మారనుందని చెప్పింది. సొంత గడ్డపై ప్రపంచకప్ నిర్వహించడం ద్వారా స్థానిక బాలికల్లో క్రికెట్ పట్ల మరింత ఆసక్తి పెరుగుతుందని, మహిళల క్రికెట్‌ను చూసే దృక్పథంలోనూ స్పష్టమైన మార్పు వస్తుందని ఆమె విశ్వాసం వ్యక్తం చేసింది. క్రీడారంగంలో లింగ సమానత్వం దిశగా అడుగులు పడటానికి ఇలాంటి భారీ టోర్నీలు దోహదపడతాయని ఫాతిమా సనా స్పష్టం చేసింది.

మ్యూజియానికి సచిన్ 26 బ్యాట్లు..
నవంబర్ 16న 'బ్యాటోగ్రఫీ'



క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ తన కెరీర్‌లో ఉపయోగించిన 26 బ్యాట్లను ముంబై క్రికెట్ సంఘానికి (ఎంసీఏ) బహుమతిగా ఇవ్వనున్నారు. అంతర్జాతీయ క్రికెట్‌లో ఎన్నో చారిత్రక ఘనతలు సాధించేందుకు ఉపయోగించిన బ్యాట్లతో పాటు హెల్మెట్లు, జెర్సీలు, కీలక సందర్భాలకు సంబంధించిన వ్యక్తిగత నోట్లను కూడా ఎంసీఏకు అందించనున్నారు. వీటిని ముంబైలోని శరద్ పవార్ క్రికెట్ మ్యూజియంలో ప్రత్యేక విభాగంలో ప్రదర్శించనున్నారు. 'బ్యాటోగ్రఫీ' పేరుతో ఏర్పాటు చేస్తున్న ఈ ప్రదర్శనను నవంబర్ 16న ప్రారంభించనున్నారు. సచిన్ అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికి 13 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా ఈ ప్రదర్శనను ప్రారంభించడం విశేషం. 2013 నవంబర్‌లో ముంబై వాంఖడే స్టేడియంలో వెస్టిండీస్‌తో తన 200వ టెస్టు ఆడిన సచిన్.. అదే మ్యాచ్‌తో అంతర్జాతీయ కెరీర్‌కు ముగింపు పలికారు. సచిన్ క్రికెట్ ప్రయాణాన్ని ఆయన ఉపయోగించిన బ్యాట్ల ద్వారా పరిచయం చేయడమే 'బ్యాటోగ్రఫీ' ఉద్దేశం. అంతర్జాతీయ క్రికెట్‌లో 100 సెంచరీలు సాధించిన చారిత్రక ఘనతకు తోడ్పడిన బ్యాట్లు కూడా ఇందులో ఉండనున్నాయి. వాటి వెనుక ఉన్న విశేషాలను తెలుసుకునే అవకాశం అభిమానులకు లభించనుంది. ఈ కార్యక్రమంపై ఎంసీఏ అధ్యక్షుడు అజింక్య నాయక్ మాట్లాడుతూ.. భారత, ప్రపంచ క్రికెట్‌కు సచిన్ అందించిన సేవలు రికార్డులకు మాత్రమే పరిమితం కావని అన్నారు. కోట్లాది మంది అభిమానుల జ్ఞాపకాల్లో ఆయన ప్రయాణం భాగమైందని పేర్కొన్నారు. సచిన్ తన విలువైన జ్ఞాపికలను మ్యూజియానికి అందించడం గౌరవంగా భావిస్తున్నామని, తద్వారా భవిష్యత్ తరాల క్రికెట్ అభిమానులు ఆయన ఘనతలను మరింత దగ్గరగా తెలుసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ ప్రత్యేక ప్రదర్శన ద్వారా సచిన్ కెరీర్‌లోని కీలక ఘట్టాలను, వాటితో ముడిపడిన జ్ఞాపకాలను భద్రపరచడంతో పాటు అభిమానులకు వాటిని ప్రత్యక్షంగా చూసే అవకాశం కలగనుంది.



ఇండోనేషియాలో దూసుకుపోతున్న 'రామాయణం'!

దర్శకుడు నితేష్ తివారీ ప్రతిష్టాత్మకంగా తెరకెక్కించిన పౌరాణిక చిత్రం 'రామాయణ: రైజ్ ఆఫ్ ఎ లెజెండ్' ఇండోనేషియాలో దూసుకుపోతుంది. జకార్తాలో జరిగిన ఈ సినిమా ప్రీమియర్‌కు భారీ సంఖ్యలో ప్రేక్షకులు తరలివచ్చారు. సాంప్రదాయ భారతీయ దుస్తులు ధరించి ప్రేక్షకులు థియేటర్ల వద్ద సందడి చేసిన వీడియోలు, ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. మరోవైపు, థాయ్‌లాండ్‌లోనూ ఈ సినిమా జోరు కొనసాగుతోంది. అక్కడ విడుదలైన ఐదు రోజుల్లోనే రూ. 5.15 కోట్లకు పైగా వసూలు చేసి, ఒక భారతీయ చిత్రానికి సంబంధించి రికార్డు సృష్టించింది. బాక్సాఫీస్ రిపోర్టుల ప్రకారం, థాయ్‌లాండ్‌లో నవంబర్ 5న విడుదలైన ఈ చిత్రం సుమారు ฿550,000 (సుమారు రూ. 5.15 కోట్లు) రాబట్టింది. ఇక నవంబర్ 11న ఇండోనేషియాలోనూ ఈ చిత్రం ఘనంగా విడుదలైంది. జకార్తాలో జరిగిన ఈ ప్రీమియర్ షో సందర్భంగా అభిమానులు రెడ్ కార్పెట్ పై నడుస్తూ, గాజులు కొనుగోలు చేస్తూ, మెహందీ పెట్టుకుంటూ సందడి చేశారు. రాముడు, సీత, లక్ష్మణుడు, రావణాసురుల వేషధారణలో ఉన్న కళాకారులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. మహర్షి వాల్మీకి రామాయణం, అద్భుత రామాయణం అలాగే తులసీదాస్ రచించిన రామచరితమానస్ ఆధారంగా తెరకెక్కిన ఈ చిత్రంలో రణబీర్ కపూర్ రాముడిగా, సాయి పల్లవి సీతగా, యశ్ రావణాసురుడిగా నటించారు. ఇండోనేషియాలో ప్రాచీన జావానీస్ అనువాదమైన 'కకావిన్ రామాయణం' ద్వారా, అలాగే థాయ్‌లాండ్‌లో 'రామకీయెన్' రూపంలో ఈ ఇతిహాసానికి ఉన్న గాఢమైన సాంప్రదాయ సంబంధాల వల్ల ఇక్కడ ఈ చిత్రానికి విశేషమైన ఆదరణ లభిస్తోంది. మరోవైపు ప్రపంచవ్యాప్తంగా బాక్సాఫీస్ వద్ద ఈ చిత్రం దూసుకుపోతోంది. ట్రేడ్ వర్గాల సమాచారం ప్రకారం, కేవలం ఆరు రోజుల్లోనే ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా రూ. 800 కోట్లకు పైగా వసూలు చేసింది. భారతదేశంలో హిందీ, తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో విడుదలైన ఈ చిత్రం, డొమెస్టిక్ మార్కెట్‌లో ఆరు రోజుల్లో రూ. 52.50 కోట్లకు పైగా గ్రాస్ వసూళ్లను సాధించి, ప్రపంచవ్యాప్తంగా మొత్తం రూ. 823.50 కోట్ల మార్క్‌ను దాటింది. నమిత్ మల్హోత్రాకు చెందిన ప్రైమ్ ఫోకస్, యశ్ యొక్క మాన్‌స్టర్ మైండ్ క్రియేషన్స్ సంయుక్తంగా అత్యంత భారీ బడ్జెట్‌తో నిర్మించిన ఈ చిత్రంలో రవి దూబే లక్ష్మణుడిగా నటించారు. కాగా, ఈ చిత్రంలోని పోస్ట్-క్రెడిట్ సీన్‌తో పాటు, సన్నీ డియోల్ హనుమంతుడిగా పరిచయమయ్యే 'హనుమాన్ చాలీసా' మ్యూజిక్ వీడియోను కూడా చిత్ర యూనిట్ విడుదల చేసింది.

'దాదా'లో సింగర్‌గా మారిన బాలయ్య..
'దాదా ధమాకా'లో
నందమూరి నటసింహం స్పెషల్ ట్రీట్!



నందమూరి బాలకృష్ణ అభిమానులకు అదిరిపోయే అప్‌డేట్ వచ్చేసింది. వరుస విజయాలతో జోరు మీదున్న బాలయ్య.. ఇప్పుడు తన తదుపరి చిత్రం 'దాదా'తో ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతున్నారు. గోపీచంద్ మలినేని దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమాపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. డిసెంబర్ 24, 2026న క్రిస్మస్ కానుకగా ఈ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. ఈ క్రమంలో సినిమా నుంచి విడుదల కానున్న తొలి పాటకు సంబంధించిన ఆసక్తికరమైన విషయం ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఈ సినిమాలో బాలకృష్ణ కేవలం నటించడమే కాకుండా తన గొంతును కూడా వినిపించనున్నారనే వార్త అభిమానుల్లో ఉత్సాహాన్ని నింపుతోంది. 'దాదా' సినిమా నుంచి నవంబర్ 13, 2026న తొలి పాట 'దాదా ధమాకా' విడుదల కానుంది. టైటిల్‌కు తగ్గట్టుగానే ఈ పాటను ఫుల్ మాస్ ఎనర్జీతో రూపొందించినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా ఈ పాటలో బాలకృష్ణ తనదైన స్టైల్‌లో స్టెప్పులు వేయనుండటం ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది. బాలయ్యతో పాటు బాలీవుడ్ బ్యూటీ నోరా ఫతేహి కూడా ఈ పాటలో సందడి చేయనున్నారు. నోరా ఫతేహి తన అద్భుతమైన డ్యాన్స్‌తో ఇప్పటికే దేశవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. ఆమె డ్యాన్స్‌కు బాలయ్య మాస్ గ్రేస్ తోడైతే అభిమానులకు పండగే అని చెప్పాలి. ఈ ఇద్దరి కాంబినేషన్‌లో రాబోతున్న పాట ఎలా ఉండబోతోందనే ఆసక్తి ఇప్పుడు అందరిలోనూ నెలకొంది. నవంబర్ 13న విడుదల కానున్న ఈ సాంగ్ సినిమాపై అంచనాలను మరింత పెంచే అవకాశం ఉంది. ఇక ఈ పాటకు సంబంధించి మరో ఆసక్తికరమైన విషయం ఏమిటంటే.. బాలకృష్ణ స్వయంగా కొన్ని లైన్స్ పాడారట. సాధారణంగా తనదైన నటన, డైలాగ్ డెలివరీ, మాస్ యాక్షన్‌తో ప్రేక్షకులను అలరించే బాలయ్య.. ఈసారి గాయకుడిగానూ అభిమానులను సర్‌ప్రైజ్ చేయబోతున్నారు. సినిమాలోని పాట కోసం ఆయన కొన్ని పంక్తులు ఆలపించగా, అవుట్‌పుట్ విషయంలో చిత్రబృందం సంతోషంగా ఉన్నట్లు సమాచారం.దీంతో బాలకృష్ణ గొంతులో వచ్చే ఆ ప్రత్యేకమైన లైన్స్ వినేందుకు అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. గతంలోనూ పలువురు స్టార్ హీరోలు తమ సినిమాల్లో పాటలు పాడి ప్రేక్షకులను అలరించారు. ఇప్పుడు బాలయ్య కూడా 'దాదా' కోసం తన గొంతును వినిపించనుండటం ఈ సినిమాకు మరో ప్రత్యేక ఆకర్షణగా మారనుంది. ముఖ్యంగా 'దాదా ధమాకా' పాటలో బాలయ్య పాడిన లైన్స్‌ను హైలైట్ చేయాలని చిత్రబృందం భావిస్తున్నట్లు తెలుస్తోంది. పాట విడుదలైన తర్వాత ఈ అంశం అభిమానుల్లో మరింత చర్చనీయాంశమయ్యే అవకాశం ఉంది. !



మెగాస్టార్ ఫ్యాన్స్‌కు గుడ్ న్యూస్..
సైలెంట్‌గా పనులు పూర్తి చేస్తున్న వశిష్ఠ!

మెగాస్టార్ చిరంజీవి హీరోగా తెరకెక్కుతున్న భారీ సోషియో ఫాంటసీ చిత్రం 'విశ్వంభర' గురించి గత కొంతకాలంగా రకరకాల వార్తలు వినిపిస్తున్నాయి. బింబిసార ఫేమ్ వశిష్ఠ మల్లిడి దర్శకత్వంలో రూపొందుతున్న ఈ సినిమాపై మొదట్లో భారీ అంచనాలు ఏర్పడ్డాయి. అయితే షూటింగ్, గ్రాఫిక్స్, ఇతర నిర్మాణానంతర కార్యక్రమాల కారణంగా సినిమా విడుదల ఆలస్యమవుతూ వస్తోంది. ఇప్పటివరకు విడుదల తేదీపై స్పష్టత లేకపోవడంతో మెగా అభిమానుల్లో కొంత నిరాశ నెలకొంది. ఈ నేపథ్యంలో తాజాగా సినిమాకు సంబంధించిన ఓ ఆసక్తికరమైన అప్‌డేట్ బయటకు వచ్చింది. చిత్రంలో నటిస్తున్న నటుడు ప్రవీణ్ కుమార్ సోషల్ మీడియాలో షేర్ చేసిన ఓ ఫొటోతో 'విశ్వంభర' పనులు ప్రస్తుతం ఏ దశలో ఉన్నాయో వెల్లడైంది. 'విశ్వంభర' సినిమా పరిస్థితి ఏమిటి? షూటింగ్ పూర్తయిందా? పోస్ట్ ప్రొడక్షన్ పనులు ఎక్కడి వరకు వచ్చాయి? అనే సందేహాలు చాలాకాలంగా అభిమానులను వెంటాడుతున్నాయి. ఈ ప్రశ్నలకు సమాధానమిచ్చేలా నటుడు ప్రవీణ్ కుమార్ తాజాగా డబ్బింగ్ సెషన్‌కు సంబంధించిన ఫొటోను సోషల్ మీడియాలో పంచుకున్నారు. దీంతో ఆయన ఈ సినిమాలో భాగమనే విషయం మరోసారి స్పష్టమైంది. అంతేకాకుండా సినిమా నిర్మాణానంతర కార్యక్రమాలు కూడా కొనసాగుతున్నట్లు తెలుస్తోంది.ఎలాంటి హడావుడి లేకుండా చిత్రబృందం సైలెంట్‌గా పనులు పూర్తి చేస్తున్నట్లు ఈ పరిణామం సూచిస్తోంది. ముఖ్యంగా డబ్బింగ్ కార్యక్రమాలు జరుగుతున్నాయనే విషయం అభిమానులకు కొంత ఊరటనిచ్చింది. అయితే సినిమా విడుదల తేదీపై మాత్రం ఇంకా అధికారిక ప్రకటన రాలేదు. ఈ సినిమాలో మెగాస్టార్ చిరంజీవికి జోడీగా అందాల తార త్రిష కృష్ణన్ నటిస్తున్నారు. వీరిద్దరి కాంబినేషన్‌లో గతంలో వచ్చిన సినిమాలు ప్రేక్షకులను అలరించడంతో 'విశ్వంభర'లో వీరి జంట ఎలా ఉండబోతోందనే ఆసక్తి నెలకొంది. ఇక ఈ చిత్రంలో బాలీవుడ్ నటుడు కునాల్ కపూర్, ఆశికా రంగనాథ్, రమ్య పసుపులేటి, ఈషా చావ్లా, ఆశ్రిత వేముగంటి సందూరి తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. విభిన్నమైన పాత్రలు, భారీ తారాగణంతో ఈ సినిమాను రూపొందిస్తున్నారు. 'బింబిసార' సినిమాతో దర్శకుడిగా మంచి గుర్తింపు తెచ్చుకున్న వశిష్ఠ మల్లిడి.. ఇప్పుడు చిరంజీవితో 'విశ్వంభర' వంటి భారీ సోషియో ఫాంటసీ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. సాధారణ కమర్షియల్ సినిమాలకు భిన్నంగా అద్భుతమైన ప్రపంచం, మాయాజాలం, ఫాంటసీ అంశాలు, భారీ విజువల్ ఎఫెక్ట్స్‌తో ఈ సినిమాను రూపొందిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది.

పాన్ ఇండియా హీరోగా
శ్రీకాంత్ తనయుడు..
షూటింగ్ ప్రారంభం



పెళ్లిసందడి, ఛాంపియన్ మూవీస్‌తో హీరోగా గుర్తింపు తెచ్చుకున్న శ్రీకాంత్ తనయుడు రోషన్ మేకా. తాజాగా మరో మూవీకి సిద్ధమయ్యారు. రోషన్ హీరోగా భారీ సూపర్ హీరో అడ్వెంచరస్ మూవీని తెరకెక్కిస్తున్నారు. ఈ సినిమాకు ఇంద్రగంటి మోహనకృష్ణ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్రాన్ని అశోక క్రియేషన్స్ బ్యానర్‌పై పాన్ ఇండియాస్థాయిలో అశోక్ వర్ధన్ ముప్పా, సునీల్ బలుసు నిర్మించనున్నారు. తాజాగా ఈ భారీ అడ్వెంచరస్ మూవీ పూజా కార్యక్రమాన్ని హైదరాబాద్‌లో గ్రాండ్‌గా నిర్వహించారు. ఈ ఈవెంట్‌కు శ్రీకాంత్ హాజరై ముహుర్తపు షాట్‌కు క్లాప్ కొట్టారు. ఈ చిత్రంలో రేఖా పాండే, వినయ్ రాయ్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ మూవీ రెగ్యులర్ షూటింగ్ డిసెంబర్ మొదటి వారంలో ప్రారంభం కానుంది.

ఆ ఆలోచనలు ఒత్తిడి పెంచాయి: మౌళి తనూజ్ ప్రశాంత్



"నా తొలి చిత్రం 'లిటిల్ హార్ట్స్' మంచి విజయం సాధించింది. కానీ ఆ విజయం నాలో ఒత్తిడి పెంచింది. ఆ సినిమా విజయం తర్వాత నేను చాలా కథలు విన్నాను. అయితే సరైన కథలనే ఎంచుకుంటున్నానా? నా జడ్జ్‌మెంట్ కరెక్టేనా? అనే ఆలోచనలు నాలో ఒత్తిడి పెంచాయి. అయితే నాకు కొత్త కథలు చెబుతూనే, ఎంటర్‌టైనింగ్ సినిమాలు చేయాలని ఉంది" అని మౌళి తనూజ్ ప్రశాంత్ అన్నారు. మౌళి తనూజ్ ప్రశాంత్, సుష్మితా శెట్టి హీరో హీరోయిన్లుగా నటించిన క్రైమ్ కామెడీ ఎంటర్‌టైనర్ సినిమా 'డీఎన్‌కే'. శ్రీను కంబాల దర్శకత్వంలో మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 13న విడుదల కానుంది. ఈ సందర్భంగా మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో మౌళి తనూజ్ మాట్లాడుతూ-- "ఈజీ మనీకి అలవాటు పడ్డ ఓ కుర్రాడు గ్యాంబ్లింగ్ చేస్తే డబ్బులు వస్తాయని ఆ మార్గాన్ని ఎంచుకుంటాడు. కానీ అతను తీసుకునే నిర్ణయాల వల్ల అప్పుల్లో కూరుకుపోతాడు. ఆ అప్పుల నుంచి బయటపడటానికి ఒక దొంగతనం చేస్తాడు. ఆ తర్వాత ఆ కుర్రాడు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చింది? ఆ కష్టాల నుంచి ఎలా బయటపడ్డాడు? అన్నదే ఈ సినిమా కథ. కథలో క్రైమ్ ఎలిమెంట్ ఉన్నప్పటికీ మంచి ఫన్ కూడా ఉంది. సెకండాఫ్‌లో ఒక సర్‌ప్రైజింగ్ సాంగ్ కూడా ఉంటుంది. సింజిత్ మంచి మ్యూ జిక్ ఇచ్చాడు. ఇక సెన్సార్ వాళ్లు అభ్యంతరం చెప్పడంతో మా సినిమా టైటిల్‌ను 'డీఎన్‌కే'గా మార్చాం. నాకు దర్శకత్వంపై ఆసక్తి ఉంది. కానీ ఇది పెద్ద బాధ్యత కాబట్టి కాస్త సమయం పడుతుంది" అని అన్నారు.

printed by SHIVA D , published by SHIVA D and owned by SHIVA PRASAD , printed at Rathna graphics offset printers, 2-3-703/7, Tirumala nagar colony ,Ambeerpet, police line hyd-500013 TS.
published at door no: 5-12, badyathand, Noothanakal mandal, thallasingaram, suryapet- 508221 TS, editor: SHIVA PRASAD. gmail : mivartanews@gmail.com, cell : 9515342857, TGBIL/25/A0512